




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 05 సోమవారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 231
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# ఉగ్రదాడిలో చైనా పాత్ర?



- పెహల్గాం దాడిలో చైనా పాత్ర ఉందనే అనుమానాలు
- దాడి జరిగిన ప్రాంతంలో లభించిన చైనా ఆధారాలు
- పాకిస్తాన్ రక్షణ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడంలో చైనా సహాయం
- బంకర్ల నిర్మాణం, డ్రోన్ల సరఫరా రహస్య కమ్యూనికేషన్ టవర్ల నిర్మాణంలో చైనా సాంకేతిక సాయం

2

**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో**
పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దారుణ దాడి యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అమాయక పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన వెనుక ఉన్న కుట్రలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ దాడిలో చైనా పాత్ర ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. దాడి జరిగిన ప్రాంతంలో లభించిన కొన్ని ఆధారాలు చైనా వైపు వేలు చూపుతున్నాయి. ముఖ్యంగా, నిషేధిత చైనా మొబైల్ తయారీ సంస్థ అయిన హువావేకి చెందిన శాటిలైట్ ఫోన్ కదలికలు ఆ ప్రాంతంలో నమోదవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ ఫోన్ దాడి జరిగిన సమయంలో క్రియాశీలకంగా ఉండటం మరింత కలకలం రేపుతోంది. భారతదేశంలో హువావే ఉత్పత్తులపై నిషేధం ఉన్నప్పటికీ, ఈ ఫోన్ అక్కడ ఎలా ప్రత్యక్షమైందనే ప్రశ్న ఇప్పుడు భద్రతా దళాలను వేధిస్తోంది. చైనా, పాకిస్తాన్‌కు ఆయుధాలు సాంకేతిక పరిజ్ఞానం సరఫరా చేసే ప్రధాన దేశంగా ఉంది. గతంలో జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన అనేక ఉగ్రదాడుల్లో చైనాకు చెందిన కమ్యూనికేషన్ పరికరాలు లభ్యమయ్యాయి. సరిహద్దు వెంబడి పాకిస్తాన్ తన రక్షణ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడంలో చైనా సహాయం చేస్తోందనే నివేదికలు కూడా ఉన్నాయి. వీటిలో బంకర్ల నిర్మాణం, డ్రోన్ల సరఫరా రహస్య కమ్యూనికేషన్ టవర్ల ఏర్పాటు వంటివి ఉన్నాయి. పహల్గామ్ దాడి తర్వాత చైనా స్పందించిన తీరు కూడా అనుమానాలకు బలం చేకూరుస్తోంది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి, పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్‌తో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం, పాకిస్తాన్ "సార్వభౌమాధికారాన్ని" "చట్టబద్ధమైన భద్రతా సమస్యలను" చైనా సమర్థిస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా, ఈ దాడిపై "నిష్పాక్షిక"

# యుద్ధానికి సన్నద్ధం!

- పాక్‌పై యుద్ధం ఖాయమన్న సంకేతాలు
- అరేబియా సముద్రంలో నావిగేషన్ హెచ్చరికలు జారీ..!
- భారత్ కూడా పాకిస్తాన్‌పై దాడికి సన్నాహకంగా అరేబియా సముద్రంలో డ్రిల్స్
- భద్రతా కారణాలతో వాణిజ్య నౌకలు ఈ ప్రాంతానికి దూరంగా ఉండాలని నావికా దళాల సూచన

2



**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో**
కశ్మీర్లో పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పై ఎలాంటి ప్రతీకార చర్య తీసుకోవాలనే విషయంలో కేంద్రం మల్లగుల్లాలు పడుతోంది. భారత్ తరహాలోనే పాకిస్తాన్ కూడా అణ్వస్త్రాలు కలిగిన దేశం కావడం, అక్కడి రాజకీయ నేతల కంటే ఆర్మీ బలమైనది కావడం, అక్కడి అణ్వస్త్రాలు తీవ్రవాదుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉండటంతో కేంద్రం ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటోంది. అయితే పహల్గాం దాడికి ప్రతీకారంగా పాక్‌పై ఏదో ఒక బలమైన చర్య తీసుకోవాలన్న డిమాండ్లు ఎక్కువవుతున్నా యి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ ఇప్పటికే ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఛీఫ్‌లతో భేటీ అయ్యారు. పహల్గాం దాడి తర్వాత భారత్ నుంచి గట్టి ప్రతిస్పందన ఉండొచ్చన్న అంచనాలో ఉన్న పాకిస్తాన్ నేవీ అరేబియా సముద్రంలో విన్యాసాలు ప్రారంభించింది. అలాగే భారత్ కూడా పాకిస్తాన్‌పై దాడికి సన్నాహకంగా అరేబియా సముద్రంలో డ్రిల్స్ చేస్తోంది. ఇందులో భాగంగా ఇవాళ అరేబియా సముద్రంలో ప్రయాణించే నౌకలకు మన నేవీ నావిగేషన్ అలర్ట్ జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో అరేబియా సముద్రంలో ప్రయాణించకపోవడమే మంచిదని ఇందులో పేర్కొంది. భారత నావికాదళం కింద పనిచేసే భారతదేశ జాతీయ హైడ్రోగ్రాఫిక్ కార్యాలయం అరేబియా

# వారం పాటు వర్షాలు

- 16 రాష్ట్రాల్లో వర్షాలు.. వారంరోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ వానలే..
- వాతావరణంలో కలిగిన మార్పుల వల్లే జోరుగా వానలు
- గంటకు 40 కి.మీ నుంచి 70 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- చాలా చోట్ల వడగండ్ల వానలు కురిసే అవకాశం

2



**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో**
దేశవ్యాప్తంగా వేసవి కాలంలో అనేక రాష్ట్రాలలో ఎండలు మండుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో అయితే గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటాయి అంటే అతిశయోక్తి కాదు. ఎండలతో పాటుగా విపరీతంగా వీస్తున్న వడగాలులతో చాలామంది వృద్ధులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక తాజాగా తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలోని 16 రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వెస్టన్ డిస్టబెన్స్.. 16 రాష్ట్రాల్లో వర్షాలు వెస్టన్ డిస్ట్రబెన్స్ కారణంగా వాతావరణంలో మార్పు వచ్చింది. దేశంలోని 16 రాష్ట్రాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. మధ్యప్రదేశ్, త్రిపుర, మిజోరం, మణిపూర్, కేరళ, ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ సహా అనేక రాష్ట్రాలలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. బలమైన ఈదురు గాలులతో పాటు, వడగళ్ల వానలు కురుస్తున్నాయి. ఈ వారంలో ఈశాన్య భారతదేశంలో వర్షాలు వెస్టన్ డిస్ట్రబెన్స్ కారణంగా మరో నాలుగైదు రోజులపాటు ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రైతులు ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మే 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఈశాన్య భారతదేశంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్పింది. తెలంగాణా రాష్ట్రంలో వర్షాలు ఇక ఈనెల 7వ తేదీ వరకు వాయువ్య భారతదేశంలో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఇదిలా ఉంటే గత 24 గంటల్లో తెలంగాణ రాష్ట్రంలో పలుచోట్ల గంటకు 70 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసాయి. రోజులపాటు ఈ రాష్ట్రాలలో వర్షాలకు ఛాన్స్ మరోవైపు కోస్తాంధ్ర, తమిళనాడు, పుదుచ్చేరి, చత్తీస్గడ్, హర్యానా, పంజాబ్, చండీగఢ్, సౌత్

# కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- తెలంగాణలో బీసీ గణనను కేంద్రం అవలంబిస్తుంది
- బీసీ చట్టం చేసింది కాంగ్రెస్ పార్టీనే,మేం బీసీల పక్షమే
- జనాభాకు అనుగుణంగా బీసీలకు న్యాయం చేస్తున్నాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

2



**సూర్యాపేట-నవభూమిబ్యూరో:** వడ్డెర కులస్తులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. వడ్డెర కులస్తులకు తమ ప్రభుత్వంలో పెద్దపీట వేయబోతున్నామని అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ... దేశంలో మొట్టమొదటిగా బీసీ కుల గణనను తెలంగాణ పూర్తి చేసిందని అన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.
తెలంగాణలో చేసిన బీసీ కులగణనను కేంద్రం అవలంబిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బీసీ చట్టం చేసింది కాంగ్రెస్ పార్టీనే, జనాభాకు అనుగుణంగా బీసీలకు న్యాయం చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.
అలాగే కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల పనులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. రెడ్లకుంట, శాంతినగర్, పాలేరు-మోతె ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులపై సమీక్షించారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గంలోని ఎన్ఎస్పీ కాల్వలపై కూడా అధికారులతో మాట్లాడారు. అధికారుల పని తీరుపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

**దేశంలో సమగ్రమైన కులగణన జరగాలి: గిడుగు రుద్రరాజు**

**ఢిల్లీ-నవభూమి:** దేశంలో సమగ్రమైన కులగణన జరగాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి కులగణనకు కట్టుబడి ఉందని అన్నారు. ఆదివారం ఢిల్లీ వేదికగా గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడారు. 1951లో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ కులగణనను వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఒత్తిడితో కేంద్రం కులగణన నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆర్టికల్ 15 (5)ను బలహీన వర్గాలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ కల్పించిందని.. దీనిని మోదీ ప్రభుత్వం

# ఏఐతో భారత్‌కు అగ్రస్థానం

- స్టాటిస్టా కన్స్యూమర్ ఇన్‌సైట్స్ ఆగస్టు , సెప్టెంబర్ 2024 మధ్య నిర్వహించిన సర్వేలో తేలిన నిజమిది
- ఈ సర్వేలో ప్రతి దేశం నుండి పాల్గొన్న 18 నుండి 64 ఏళ్ల వయస్సు గల 1,250 మంది
- భారత్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ఏఐ వినియోగం

2



**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో**
భారతదేశం ఇప్పుడు కృత్రిమ మేధస్సు (ఏఐ)ని రోజువారీ జీవితంలో భాగంగా వాడటంలో ప్రపంచ దేశాలన్నింటి కంటే ముందుంది. ఇటీవలే విడుదలైన ఒక నివేదిక ఈ ఆసక్తికరమైన విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. స్టాటిస్టా కన్స్యూమర్ ఇన్‌సైట్స్ ఆగస్టు , సెప్టెంబర్ 2024 మధ్య నిర్వహించిన సర్వే ప్రకారం, భారతదేశంలో 41% మంది ప్రజలు ప్రతిరోజూ ఏదో ఒక రూపంలో ఏఐ సాధనాలను వినియోగిస్తున్నారు. ఈ సర్వేలో ప్రతి దేశం నుండి 18 నుండి 64 సంవత్సరాల వయస్సు గల 1,250 మంది పాల్గొన్నారు. రోజువారీ ఏఐ వినియోగంలో భారతదేశం ఇతర దేశాలతో పోలిస్తే చాలా ముందంజలో ఉంది. బ్రెజిల్‌లో 33% మంది రోజువారీ ఏఐని ఉపయోగిస్తుండగా, మెక్సికోలో ఇది 24%గా ఉంది. జర్మనీ , యునైటెడ్ కింగ్‌డమ్‌లలో కేవలం 21% మంది మాత్రమే దీనిని ఉపయోగిస్తున్నారు. ఇక యునైటెడ్ స్టేట్స్ కేవలం 20% మంది రోజువారీ వినియోగదారులతో చివరి స్థానంలో నిలిచింది. ఈ గణాంకాలు భారతదేశంలోప్రజల దైనందిన జీవితంలో ఎంత వేగంగా ఒక అంతర్భాగంగా మారుతోందో స్పష్టం చేస్తున్నాయి. డెలాయిట్ నివేదిక ప్రకారం.., ఏఐ కేవలం వ్యక్తిగత వాడకానికే పరిమితం కాలేదు. ప్రభుత్వం, బ్యాంకులు , టెలికాం వంటి కీలక రంగాలను సమూలంగా మారుస్తోంది. ఈ రంగాలు తమ వ్యవస్థలను మెరుగుపరచడానికి, డేటా భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి , పౌరులకు మెరుగైన సేవలను అందించడానికి

# అక్రమార్కులపై హైడ్రా కన్నెర్ర

- అక్రమ నిర్మాణాలు చేసే వారికి హైడ్రా హెచ్చరికలు
- చెరువులు, బహిరంగ ప్రదేశాలలో నిర్మాణాలకు సంబంధించిన వ్యర్థాలను వేసేవారిపై కఠిన శిక్షలు
- యాభైకు పైగా కేసులను విచారిస్తున్న హైడ్రా స్టేషన్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** హైదరాబాదులో ఇల్లు నిర్మిస్తున్నారా? షాపింగ్ కాంప్లెక్స్‌లు గట్రా నిర్మాణం చేస్తున్నారా? అయితే ఈ విషయం మీరు తప్పక తెలుసుకోవాల్సిందే. ఇకపై హైదరాబాద్లో నిర్మాణాలు చేపట్టే వారికి కీలక అలర్ట్ ఇచ్చింది హైడ్రా. నిర్మాణాల విషయంలో అవకతవకలకు పాల్పడితే జైలుకు పంపిస్తామని తేల్చి చెప్పింది. అక్రమార్కులకు వారికి చుక్కలు చూపించేందుకు సిద్ధమైన హైడ్రా చెరువులు, ప్రభుత్వభూములు, పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు, పార్కులు, రహదారులు తదితరాలను ఆక్రమించి నిర్మాణాలు చేసే

# కులం కార్డు దిశగా బీజేపీ!

- రూటు మార్చిన బీజేపీ
- హిందూత్వం నుంచి బీసీ కార్డు
- కులగణన వెనుకున్న ఉద్దేశ్యమిదే
- ఏ ఎండకు ఆ గొడుగు ఇదే బాట

2



**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో:** భారతీయ జనతా పార్టీ ఆదినుంచి క్రమశిక్షణ కలిగిన పార్టీగా తనను తాను ప్రచారం చేసుకుంటూ వచ్చింది. భారతీయ జనతా పార్టీలో ఇప్పుడు దీనికి భిన్నంగా వ్యవహరిస్తూ వస్తోంది. అయితే ఒకసారి అధికారం రుచి మరిగాక తేడాలు అన్నీ పోతాయి. అన్నీ ఆ తానులో ముక్కలవుతాయి. బీజేపీ వరిష్ట నేత అటల్ బిహారీ వాజ్ పేయ్ దీని మీద ఒక మాట అన్నారు. అవతల వారు ఏ ఆట అయితే ఏ పద్ధతిలో ఆడతారో తాము కూడా అదే తీరున ఆడాలని ఆయన అంటూ వచ్చేవారు. రాజకీయాల్లో అలా

# హీరో నానికి ప్రమాదం

- షూటింగ్‌లో తల పగిలి నానికి తీవ్ర గాయాలు..
- జమ్ముకశ్మీర్ శ్రీనగర్‌లో ఓ ఫైట్ సీన్ షూట్ చేస్తున్నప్పుడు కెమెరా నాని తలకు తగిలి చీలి రక్త గాయాలు
- రక్తం గడ్డ కట్టేలా చేసి షూటింగ్ పూర్తిచేసిన నాని
- షూట్ అవ్వగానే ఢిల్లీకి వెళ్లి ట్రీట్‌మెంట్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**నేచురల్ స్టార్ నాని లేటెస్ట్ క్రైమ్ థ్రిల్లర్ హిట్-3 బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. నాని సరికొత్తగా ఊర మాస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రం వసూళ్ల వర్షం కురిపిస్తోంది. మే 1న ప్రపంచవ్యాప్తంగా రిలీజైన ఈ మూవీ రికార్డుల వేట కొనసాగిస్తోంది. హీరో నానికి బిగ్గెస్ట్ ఓపెనింగ్ మూవీగా హిట్- 3 నిలిచింది. మూడు రోజుల్లో 82 కోట్లు గ్రాస్ వసూలు చేసి సత్తా చాటింది. రూ. 100 కోట్ల దిశగా ఈ మూవీ దూసుకెళ్తోంది. ఈ సినిమాలో మొదటిసారి నాని.. తన విశ్వరూపం చూపించాడు. దసరా సినిమాలో మాస్ పాత్రలో నటించాడు. ఈ సారి మాత్రం మాస్‌తో పాటు వైలెంట్ పోలీస్‌గా తన నటనతో ప్రేక్షకులను అలరించాడు. ఈ సినిమాకు ఏ సర్టిఫికెట్ వచ్చినప్పటికీ జనాలు మాత్రం ఫ్యామిలీతో కలిసి థియేటర్ల ముందు క్యూ కడుతున్నారు. ఇక ఈ

# ప్రశాంతంగా నీట్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
భౌతిక శాస్త్రంలో 16 ప్రశ్నలు బెంబేలెత్తించాయి! రసాయన శాస్త్రంలో 15 ప్రశ్నలు బెదరగొట్టాయి!! బోటనీలో 14, జువాలజీలో ఆరు ప్రశ్నలు చాలా కష్టంగా వచ్చాయి! ఒక్కమాటలో చెప్పాలంటే.. వైద్య విద్యలో ప్రవేశాల నిమిత్తం ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ అర్హత పరీక్ష (నీట్-యూజీ 2025) ప్రశ్నపత్రం



# అమెరికా వద్దు.. ఆస్ట్రేలియానే ముద్దు



**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో**
సర్వేలో పాల్గొన్న భారతీయ విద్యార్థుల్లో 28% మంది ఆస్ట్రేలియాను తమ మొదటి ప్రాధాన్యతగా ఎంచుకున్నారు. %దీఎ: ుబజుఘునఱ ణవంని ఎ 4 మీుఎ 2025 6:00 “ూవీ ూష్ట్రుతీవ%: అభ్యసించడానికి ఎంచుకుంటున్న దేశాల జాబితాలో ఆస్ట్రేలియా ఇప్పుడు అగ్రస్థానంలో నిలిచింది. అంతర్జాతీయ విద్యా సేవల సంస్థ %×ఴూ% ఎడ్యుకేషన్ మార్చి 2025లో నిర్వహించిన సర్వే ప్రకారం.., అమెరికాను వెనక్కి నెట్టి ఆస్ట్రేలియా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. అదే సమయంలో కెనడా ప్రజాదరణ మరింత క్షీణించింది. సర్వేలో పాల్గొన్న భారతీయ విద్యార్థుల్లో 28% మంది ఆస్ట్రేలియాను తమ మొదటి ప్రాధాన్యతగా ఎంచుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో అమెరికా (22%) , యునైటెడ్ కింగ్‌డమ్ (21%) ఉన్నాయి. గత ఏడాది మార్చి (2024)తో పోలిస్తే కెనడా ఆరు శాతం పాయింట్లు తగ్గి కేవలం 13% వద్ద నిలిచింది. %ూశ్రీంశీ =ఘుఎ% - టెన్షన్ పెంచుతున్న పాక్.. అణుబూచి చూపిస్తూ భారత్‌ను భయపెట్టాలని చూస్తోందా? 'ఎమర్జింగ్ ఫ్యూచర్స్ సెవెన్ - వాయిస్ ఆఫ్ ది ఇంటర్నేషనల్ స్టూడెంట్' నివేదిక కోసం ప్రపంచవ్యాప్తంగా 6,000 మందికి పైగా విద్యార్థుల అభిప్రాయాలు సేకరించగా, వారిలో సుమారు 1,400 మంది భారతీయులే ఉన్నారు. ఆస్ట్రేలియా ప్రజాదరణ పెరగడానికి ప్రధాన కారణాలుగా దాని విశ్వవిద్యాలయాల మెరుగైన ప్రపంచ ర్యాంకింగ్‌లు వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2025లో టాప్ 200లో 15 ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాలు ఉన్నాయి) , ఆస్ట్రేలియా-భారతదేశ ఆర్థిక సహకారం .. వాణిజ్య ఒప్పందం ద్వారా లభించిన పోస్ట్-స్టడీ వర్క్ పర్మిట్ కాల పరిమితి పెంపును నివేదిక పేర్కొంది. %ూశ్రీంశీ =ఘుఎ% - అతడి రక్తం నుంచి పాము విషానికి విరుగుడు.. అదెలా? అమెరికా ఇప్పటికీ భారతీయ విద్యార్థులకు ఒక మంచి ఎంపికగా నిలుస్తోంది. 22% మంది దీనిని మొదటి ఎంపికగా భావిస్తున్నారు. అక్కడి విద్యా

# విద్యార్థుల చూపు.. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల వైపు

**హైదరాబాద్-నవభూమి:** ఉన్నత విద్యలో తెలంగాణ ఆవిర్భావం అనంతరం ప్రభుత్వాలు చేపట్టిన చర్యలు, సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఏటేటా డిగ్రీ కాలేజీల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నా యి. 'దోస్త్' ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రంలోని 136 కళాశాలల్లో గణనీయంగా పెరుగుదల కనిపిస్తున్నదని ఉన్నత విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. 2018-19లో 28,035 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోగా, 2023-24 విద్యాసంవత్సరానికి 50, 477కు పెరిగాయి. అంటే ఏడేండ్లలో 22,442 మంది(80% వృద్ధి) ప్రవేశాలు పొందడమే ఇందుకు నిదర్శనమన్నారు. సీబీసీఎస్‌తో భారీగా పెరిగిన సంఖ్య..2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్(సీబీసీఎస్)ను అమల్లోకి తీసుకువచ్చింది. దీంతో ఏకంగా ఒకే ఏడాదిలో 14,250 అడ్మిషన్లు పెరిగాయి. ఆ తర్వాత సైతం గణనీయ వృద్ధి నమోదవుతూ వస్తున్నది. తాజాగా 2024-25 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని 28 డిగ్రీ కాలేజీల్లో ఐటీల తరహాలో అప్రెంటిషిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏబీఈడీ)ని అమలు చేయాలని నిర్ణయిం చారు. డిగ్రీ పూర్తిచేసిన వెంటనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని విద్యారంగ నిపుణులు భావిస్తున్నారు. మరింత మంది విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చదివేందుకు ఆసక్తిచూపుతారని విశ్లేషిస్తున్నారు. విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యా ర్థులు చదువు కొనసాగిస్తున్న సమయంలోనే కోర్సులకు సంబంధించి నైపుణ్యాలపై సాంకేతిక శిక్షణ ఇస్తున్నారు. బీకాం(బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్), బీఎస్సీ (టూరిజం అండ్ హాస్పిటాలిటీ ఆపరేషన్స్), బీఎస్సీ డిజిటల్/ఇండస్ట్రీ యల్ ఎలాక్ట్రానిక్స్, బీఎస్సీ (మార్కెటింగ్ అండ్ సేల్స్), బీఎస్సీ(ఫార్మాస్యుటికల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అండ్ క్వాలిటీ), బీబీఏ (కాంటెంట్ అండ్ క్రియేటివ్ రైటింగ్) కోర్సుల్లో ఈ అవకాశం కల్పించారు.

## రేషన్ కార్డుదారులకు బిగ్ అలర్ట్.. అలా చేస్తే మీ కార్డులు రద్దు..!



**హైదరాబాద్-నవభూమి:** ప్రస్తుతం తెలంగాణలో రేషన్ కార్డుదారులందరికీ.. రేవంత్ రెడ్డి సర్కార్ సన్నబియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో.. రేషన్ కార్డుదారులకు అధికారులు వార్నింగ్ ఇచ్చారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో ఇస్తున్న బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటుండటంపై అధికారులు దృష్టిసారించారు. ఈ క్రమంలోనే.. మంచిర్యాల జిల్లాలో రేషన్ బియ్యం అక్రమంగా విక్రయిస్తున్న వారిపై అధికారులు కొరడా ఝుళిపించారు. తాండూర్ మండలంలోని అచలాపూర్‌లో రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి, ఉచితంగా పొందిన సన్నబియ్యాన్ని అమ్ముకుంటున్న 11 మంది రేషన్ కార్డుదారులను గుర్తించారు. వారి కార్డులను వెంటనే రద్దు చేశారు.వివరాల్లోకి వెళితే... రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, కొందరు లబ్ధిదారులు రేషన్ దుకాణాల నుంచి ఉచితంగా బియ్యం తీసుకుని వాటిని అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం అధికారులకు అందింది. దీంతో అప్రమత్తమైన రెవెన్యూ అధికారులు తాండూర్ మండలం అచలాపూర్‌లో తనిఖీలు చేపట్టారు.

ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన పలువురు రేషన్ కార్డుదారులు తమకు ఉచితంగా వచ్చిన 1.91 క్వింటాళ్ల సన్నబియ్యాన్ని కిలో రూ.16 చొప్పున మహేశ్ అనే వ్యక్తికి విక్రయించినట్లు అధికారులు గుర్తించారు. ఈ అక్రమ వ్యాపారాన్ని నిర్ధారించిన అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. సంబంధిత 11 రేషన్ కార్డులను రద్దు చేశారు. అంతేకాకుండా, రేషన్ బియ్యం అక్రమంగా అమ్మినా, కొన్నా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.కాగా, రాష్ట్రంలో మే నెలలో రేషన్ కార్డుదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కొత్తగా 11 లక్షల మందికి పైగా రేషన్ కార్డులు పొందారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ పొందే వారి సంఖ్య 2.93 కోట్లకు చేరుకుంది. తాజాగా 31,084 కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయగా, పాత కార్డుల్లో 10,12,199 మంది పేర్లను అదనంగా చేర్చారు. ఈ నేపథ్యంలో రేషన్ బియ్యం కోటా కూడా పెరిగింది. జనవరిలో 1.79 లక్షల టన్నులుగా ఉన్న బియ్యం కోటా మే నాటికి 1.86 లక్షల టన్నులకు చేరుకుంది. కొత్త రేషన్ దారుల కోసం అదనంగా 4,431 టన్నుల సన్నబియ్యాన్ని అధికారులు సిద్ధం చేశారు. జనవరి నుంచి మే మధ్యలో ప్రభుత్వం 19 లక్షలకు పైగా కొత్త లబ్ధిదారులను గుర్తించినప్పటికీ, సాంకేతిక సమస్యల కారణంగా 7 లక్షల పేర్లను తొలగించారు. మార్పులు, చేర్పులతో నికరంగా 12 లక్షల మంది కొత్తగా రేషన్ పొందనున్నారు. ప్రస్తుతం మరో మూడు లక్షల రేషన్ కార్డుల పరిశీలన పెండింగ్‌లో ఉంది. భర్త, భార్య వేర్వేరు కార్డుల్లో ఉన్నవారిని ఒకే కార్డులో చేర్చడం, కొత్తగా పిల్లల పేర్లు నమోదు చేయడం వంటి ప్రక్రియలు వేగంగా జరుగుతున్నాయి.


## ఈ తెలంగాణ జిల్లాల్లో వడగళ్ల వానలు పడే ఛాన్స్..

### 13 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..!



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో రాగల నాలుగురోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో వడగండ్ల వానలు, మరికొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంటుందని తెలిపింది. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వండగండ్ల వానలు కురుస్తాయని పేర్కొంది.జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వచే అవకాశం ఉందని పేర్కొంది. దాంతో ఆయా జిల్లాలకు హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్‌ని జారీ చేసింది. అలాగే, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయంటూ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలో ఉరుములు, మెరుపులు వానలు కురుస్తాయని తెలిపింది.ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ని జారీ చేసింది ఐఎండీ హైదరాబాద్. అలాగే, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే, ఈ నెల 6, 7 తేదీల్లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ, వరంగల్ జిల్లాలతో పాటు సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడుతాయని వాతావరణశాఖ వివరించింది.

## నకిలీ దేశ గురువు మాయాజాలం



**జనగామ జిల్లా-నవభూమి:** పాలకుర్తి మండలం, విస్నూర్ గ్రామ ప్రజల అమాయకత్వాన్ని, వారి మూఢనమ్మకాలను అసరాగా చేసుకుని అందినకాడికి దోచుకున్న నకిలీ దేశ గురువు మాయాజాలం వెలుగులోకి వచ్చింది. దేశ గురువు పేరుతో నకిలీ గుర్రం బాబా లక్షల రూపాయలు వసూలు చేశాడు. అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు వసూలు చేశాడు. మోసాన్ని గ్రహించిన గ్రామంలో యువకులు నకిలీ దేశ గురువును పట్టుకుని నిలదీశారు. అయితే వారి నుంచి తప్పించుకుని పరారయ్యాడు. బాబా అనుచరులను పట్టుకుని గ్రామస్తులు బంధించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భార్య కోసం భర్త ధర్నా.. మహిళా సంఘాల సపోర్ట్



**హైదరాబాద్-నవభూమి:** సాధారణంగా.. భర్త వేధింపులు భరించలేకో, ప్రియుని చేతిలో మోసపోయో, భర్త తనకు తెలియకుండా చిన్నిల్లు పెట్టాడనో.. ఇలా రకరకాల సందర్భాల్లో న్యాయం కోసం భార్యలు రోడ్డెక్కుతుంటారు. భర్తల ఇండ్ల ముందు ధర్నాలు చేస్తుంటారు. వారికి మహిళ సంఘాలు కూడా మద్దతు తెలుపుతుంటాయి. ఇప్పటివరకు ఇలాంటి ఘటనలే వార్తల్లో వచ్చేవి. కానీ.. ఇప్పుడు సీన్ కాస్త రివర్స్ అయ్యింది. ఓ భర్త తన భార్య కోసం తన అత్తగారింటి ముందు ధర్నాకు దిగాడు. అంతేకాదండోయ్.. ఆ భర్తకు మహిళా సంఘాలు కూడా మద్దతు తెలపటం గమనార్హం. వినడానికి కాస్త వింతగా ఉన్నా ఇది నిజంగానే జరిగింది మరి..!జగిత్యాల జిల్లా కోరుట్లలోని ప్రకాశం రోడ్డుకు చెందిన గాజుల అజయ్ అనే భర్త తన భార్య శివాని కోసం రోడ్డెక్కాడు. కొన్ని రోజుల కిందట.. ఇద్దరి మధ్య చిన్నగా గొడవ జరగ్గా.. శివాని తన రెండేళ్ల బాబుతో కలిసి అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. ఇక్క అప్పటి నుంచి ఆమెను తిరిగి ఇంటికి తీసుకురావడానికి అజయ్ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. పెద్ద మనుషులతో కూడా చెప్పించాడు. వాళ్లు నచ్చజెప్పినా శివాని మనసు మాత్రం మారలేదు. "ఇకపై నిన్ను ఏమీ అనను, బాగా చూసుకుంటాను." అంటూ అజయ్ ప్రాధేయపడుతున్నా శివాని మాత్రం రాలేనని తేల్చి చెప్పేసింది.చివరికి విసిగిపోయిన అజయ్ ఏ భర్త తీసుకోని నిర్ణయమే తీసుకున్నాడు. మహిళా సంఘాల మద్దతు కూడగట్టుకొని ఏకంగా తన అత్తగారి ఇంటి ముందే బైఠాయించి ఆందోళన మొదలుపెట్టాడు. మహిళా సంఘాలు కూడా ఈ వింత పోరాటంలో అజయ్‌కి అండగా నిలవడం విశేషం..!అయితే, శివాని మాత్రం తన భర్త ఇంటికి వెళ్లేందుకు ఏమాత్రం సిద్ధంగా లేదు. "అక్కడ నాకు రక్షణ లేదు. అతను నిత్యం నన్ను వేధిస్తాడు, చాలా ఇబ్బంది పెడతాడు." అంటూ తన గోడు వెళ్లబోసుకుంటోంది. భార్య బెట్టు వీడకపోవడంతో అజయ్ చాలాసేపటి తర్వాత నిరాశగా అక్కడి నుంచి కదిలాడు.ఈ తతంగాన్ని చూసిన కోరుట్ల జనాలు మాత్రం నోరెళ్లబెట్టారు. భర్త తన భార్య కోసం ధర్నా చేయడం ఇదే తొలిసారి అని ముక్కున వేలేసుకుంటున్నారు. మరి ఇప్పటికైనా శివాని మనసు కరుగుతుందో లేదో చూడాలి. మొత్తానికి ఈ రివర్స్ స్టోరీ కోరుట్ల టౌన్‌లో హాట్ టాపిక్‌గా మారింది..!

# ప్రశాంతంగా నీట్

(1వపేజీ తరువాయి)ఘాటుగా, అత్యంత కఠినంగా ఉంది! రాష్ట్రంలో 190 పరీక్ష కేంద్రాల్లో జరిగిన నీట్ పరీక్షకు 95 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించే సమయంలో అభ్యర్థులను సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. గడియాంలు, ఇతర గాడ్జెట్లను తీసివేయించారు. ఎప్పటి లాగానే.. ఒక్క నిమిషం ఆలస్యం నిబంధనను కచ్చితంగా అమలు చేశారు. రకరకాల కారణాల వల్ల సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపో యిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. లోపలికి అనుమతించా లంటూ సిబ్బందిని బతిమిలాడుకున్నా ఉపయోగం లేకపోయింది. దీంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు. కరీంనగర్‌లోని మహిళల డిగ్రీ, పీజీ కాలేజీలో నీట్ పరీక్ష రాసేందుకు ఒక విద్యార్థిని వేములవాడ నుంచి తన తల్లితో కలిసి వచ్చింది. కానీ.. ఆమె మూడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించలేదు.కూలీ పని చేసి, పుస్తెలతాడు తాకట్టుపెట్టి అప్పు తీసుకొని తన కుమార్తెకు లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించానని.. ఇలా జరుగుతుందని ఊహించలేదని ఆ తల్లి కన్నీరుమున్నీరు అయింది. ఇటువంటి ఘటనలు అక్కడక్కడ జరిగినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మేడ్చల్ జిల్లా కీసర పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో నీట్ పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్న విద్యార్థులు.. హాల్ టికెట్‌లో ఆ కేంద్రం పేరు ఒకలా, అక్కడ మరొకలా ఉండడంతో అయోమయానికి గురయ్యారు. అక్కడ గతంలో మూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఉండేది. గత ప్రభుత్వ హయాంలో ఆ కాలేజీని అద్దెకు తీసుకుని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్లలో ఆ కేంద్రం పేరు మూర్తి ఇంజనీరింగ్ కళాశాల అని ఉండ డం.. అక్కడ గురుకుల పాఠశాల ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. అది తమ పరీక్షా కేంద్రమో కాదో తెలియక అటూ ఇటూ తిరిగి చివరికి అక్కడికి వచ్చేసరికి సమయం మించిపోయింది. దీంతో కొంతమంది విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. ఇక.. కొన్ని పరీక్షా కేంద్రాల్లో గోడ గడియారాలను ఏర్పా టు చేయలేదు. దీంతో విద్యార్థులు సమయం ఎంత అయిందో తెలియక, పరీక్ష రాయడానికి ఇంకా ఎంత సమయం ఉందో తెలుసుకునే వెసులుబాటు లేక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కొన్ని కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులతో దీనిపై గొడవకు దిగారు. కాగా.. హైదరాబాద్ జేఎన్‌టీయూ కేంద్రంలో పరీక్షా సమయం ముగియడానికి ముందే పేపర్లు తీసేసుకున్నారని విద్యార్థులు ఆరోపించారు.

# అక్రమార్కులపై హైడ్రా కన్నెర్ర

(1వపేజీ తరువాయి)వారిపైన ఉక్కుపాదం మోపడానికి హైడ్రా రెడీ అయింది. అంతేకాదు ఇసుక అక్రమరవాణా చేసేవారిని, చెరువులు, బహిరంగ ప్రదేశాలలో నిర్మాణాలకు సంబంధించిన వ్యర్థాలను వేసేవారిని కూడా కఠినంగా శిక్షించడానికి హైడ్రా సిద్ధమైంది. వాళ్లపైన క్రిమినల్ కేసులు నమోదు చేసి నేరుగా జైలుకు పంపించడమే లక్ష్యంగా ప్రత్యేక పోలీస్ స్టేషన్ ను సైతం ఏర్పాటు చేస్తుంది. ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఉద్దేశం ఇదే బుద్ధ భవన్ లోని హైడ్రా ప్రధాన కార్యాలయం పక్కన ఒక ప్రత్యేక పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేసి హైడ్రా రంగంలోకి దిగుతుంది. ఇప్పటికే ప్రభుత్వ భూములు, చెరువులు, పరిధిలో నిర్మించిన నిర్మాణాలను కూల్చివేసి హైదరాబాద్ వాసులను వణికించిన హైడ్రా ఇప్పుడు పోలీస్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేసి ఆక్రమణలకు పాల్పడి నిర్మాణాలు చేస్తే జైలుకు పంపడం ఖాయమని స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్ ఏమన్నారంటే ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపటం ఖాయమని, ఇదే విషయాన్ని హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్ స్పష్టం చేశారు. ఇప్పటికే గతంలో అనేక వందల ఎకరాల ప్రభుత్వ భూములను, చెరువులను, పార్కులను, నాలాలను హైడ్రా పరిరక్షించిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆక్రమణలకు సంబంధించి వివిధ పోలీస్ స్టేషన్లలో 50కిపైగా కేసులు విచారణలో ఉన్నాయని హైడ్రా ప్రత్యేక పోలీస్ స్టేషన్ అందుబాటులోకి వస్తే ఈ కేసులన్నీ అక్కడికి బదిలీ చేయబడతాయి అని ఆయన వెల్లడించారు. పక్కా ఆధారాలతో జైలుకు పంపడం కోసమే హైడ్రా అంతేకాకుండా కొత్త కేసులు నమోదు చేయడానికి కూడా ఇది సులభంగా ఉంటుందని హైడ్రా పోలీస్ స్టేషన్ గురించి వివరాలు తెలిపారు. చెరువుల ఆక్రమణలను పూర్తిగా అడ్డుకోవడం కోసం, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్న వారిని పక్కా ఆధారాలతో జైలుకు పంపడం కోసమే హైడ్రా పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. ఏసిపి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ నిర్వహణ ఈ ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఒక ఏసిపి ఆధ్వర్యంలో ఆరుగురు ఇన్స్పెక్టర్లు, 12మంది సబ్ ఇన్స్పెక్టర్లు, 60మంది కానిస్టేబుల్ లతో నిర్వహించబడుతుంది అని, భవిష్యత్తులో ఫిర్యాదుల సంఖ్య పెరిగితే మరిన్ని పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఎవరైనా సరే చెరువులను చెత్త చెదారంతో నింపి, వాటిని ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తే జైలు ఊచలు లెక్క పెట్టాల్సిందేనని హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్ పేర్కొన్నారు.

### హీరో నానికి ప్రమాదం

సినిమా కోసం నాని బాగా కష్టపడినట్లు స్క్రీన్ పై ఆయన నటన చూస్తే తెలుస్తోంది. అయితే ఇటీవల ఈ సినిమా డైరెక్టర్ డాక్టర్. శైలేష్ కొలను.. నాని పనితనం గురించి ఓ ఇంటర్వ్యూలో షాకింగ్ నిజాన్ని బయటపెట్టాడు. 'జమ్ముకశ్మీర్ శ్రీనగర్‌లో ఓ ఫైట్ సీన్ షూట్ చేస్తున్నప్పుడు కెమెరా నాని తలకు తగిలి చీలి రక్తం కారింది. కానీ నాని మాత్రం షూటింగ్ స్టాప్ చేయలేదు. రక్తం గడ్డ కట్టేలా చేసి షూటింగ్ పూర్తిచేశాడు. షూట్ అవ్వగానే ఢిల్లీకి నైట్ వెళ్లి ట్రీట్‌మెంట్ చేయించుకొని ఉదయాన్నే.. శ్రీనగర్ వచ్చి అక్కడినుంచి షూటింగ్ స్పాట్ కు వచ్చాడు. నాని పనితనం అలా ఉంటుంది' అని చెప్పుకొచ్చాడు. ఈ సినిమా కోసం నాని చాలా కష్టపడ్డాడని హిట్-3 చిత్రం డైరెక్టర్ డాక్టర్. శైలేష్ కొలను తెలిపాడు. తాజాగా నానికి గాయం ఘటనను తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు శైలేష్ కొలను. షూటింగ్ లో నాని గాయపడ్డ ఫొటోలు, వీడియోలను తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశాడు. అవి ప్రస్తుతం వైరల్ అయ్యాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం గౌరవం నాని కే దక్కాలి. సినిమాపై మీకున్న ప్రేమ చాలా విలువైనది. అని పోస్ట్ చేశాడు డైరెక్టర్ శైలేష్ కొలను.

# వారం పాటు వర్షాలు

(1వపేజీ తరువాయి)కర్ణాటక వంటి ప్రాంతాలలో గంటకు 40 కిలోమీటర్ల నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచినట్టు వెల్లడించింది. ఈరోజు నుంచి శనివారం వరకు 7రోజులపాటు అనేక ప్రాంతాలలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ, యానం, పుదుచ్చేరిలో వర్షాలు కురుస్తాయని, పిడుగులు కూడా పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

**ఏపీలో భారీ వర్షాలు-కలెక్టర్లు, ఎస్పీల్ని అలర్ట్ చేసిన హోంమంత్రి..!**

ఏపీలో వేసవిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఊదురుగాలులతో కూడిన వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. ఉదయం నుంచి పలు చోట్ల నిరంతరాయంగా వర్షం కురుస్తోంది. దీంతో ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. వర్షాల కారణంగా జనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా హోంమంత్రి వంగలపూడి అనిత నేరుగా కలెక్టర్లు, ఎస్పీలను అలర్ట్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇవాళ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తో ఫోన్ లో మాట్లాడిన హోంమంత్రి అనిత.. వర్షాలపై సమాచారం తీసుకున్నారు. అలాగే తాజా పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం వివిధ జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలను హోంమంత్రి అనిత అప్రమత్తం చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని వారికి సూచించారు. వర్షాల నేపథ్యంలో అవసరమైన మేరకు సహాయక చర్యలు అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్లు, ఎస్పీలను హోంమంత్రి అనిత ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మంత్రి అనిత ఆదేశాలు ఇచ్చారు. తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎక్కడా ఆటంకం లేకుండా చూడాలని కూడా మంత్రి వారిని కోరారు. దీంతో కలెక్టర్లు, ఎస్పీలు స్థానికంగా ఉన్న సిబ్బందిని అలర్ట్ చేస్తూ వర్షాల ప్రభావాన్ని అంచనా వేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అకాల వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులతో ఫోన్ లో మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడు.. వారికి కీలక సూచనలు చేశారు. మామిడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## హైదరాబాద్‌లో వృద్ధ దంపతుల హత్య

**అల్వాల్-నవభూమి:** హైదరాబాద్‌లోని అల్వాల్‌లో వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. వారి ఇంట్లో ఉండాల్సిన రూ.లక్ష నగదు, వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు మాయవ్వడంతో ఈ హత్య తెలిసిన వారి పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం మానిక్యారం గ్రామానికి చెందిన కనకయ్య(70), రాజమ్మ(65) దంపతులు అల్వాల్‌లోని సూర్యానగర్ కాలనీలో మూడేళ్లుగా నివాసముంటున్నారు. కనకయ్య స్థానికంగా నిర్మాణంలో ఉన్న ఒక భవనానికి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు.నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లి తిరిగొచ్చిన కనకయ్య.. స్థానికంగా వడ్డీలకు తిప్పేందుకు రూ.లక్ష తెచ్చాడు. ఈ విషయాన్ని తన పని ప్రదేశంలో మేస్త్రీతోపాటు పలువురికి చెప్పాడు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రించిన కనకయ్య దంపతులు హత్యకు గురయ్యారు. ఆదివారం ఉదయం ఆ ఇంటికి వచ్చిన కుమార్తె లత తల్లిదండ్రులు విగతజీవులుగా ఉండటాన్ని గమనించింది. మంచంపై నిద్రిస్తున్న ఇద్దరి తలలపై దొడ్డు కర్రతో కొట్టినట్లు బలమైన గాయాలు ఉన్నాయి.

## ఉగ్రదాడిలో చైనా పాత్ర?

(1వపేజీ తరువాయి) విచారణ జరగాలని కూడా చైనా కోరింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఈ దాడిని ఖండిస్తూ చేసిన ప్రకటనను బలహీనపరిచేందుకు చైనా మరియు పాకిస్తాన్ తెరవెనుక ప్రయత్నించాయని కూడా వార్తలు వస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే, పహల్గామ్ ఉగ్రదాడిలో చైనా పాత్ర ఏదో ఉందని అనుమానించక తప్పదు. అయితే, ఇది కేవలం సాంకేతిక సహాయం వరకే పరిమితమైందా లేదా వ్యూహాత్మకమైన ప్రమేయం ఉందా అనేది లోతైన విచారణ ద్వారా మాత్రమే తేలుతుంది. భారత భద్రతా దళాలు ఈ కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశాయి. భవిష్యత్తులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

(1వపేజీ తరువాయి) ఇప్పుడు ఎందుకు అమలు పరచడం లేదని గిడుగు రుద్రరాజు ప్రశ్నించారు.

ఆర్టికల్ 15 (5)ను బలహీన వర్గాలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు అమలు పరచాలని గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం సమగ్రమైన కులగణన జరిపిందని చెప్పారు. ప్రజల నుంచి సమగ్ర వివరాలను రేవంత్ ప్రభుత్వం కులగణన ద్వారా తెలుసుకుందని అన్నారు. 2011లో జరిగిన జనాభా లెక్కల వివరాలను పార్లమెంట్ ముందు బీజేపీ ప్రభుత్వం ఎందుకు ఉంచలేదని నిలదీశారు. కోవిడ్ సాకుతో 2021లో మోదీ ప్రభుత్వం జనగణన చేయలేదని అన్నారు. మోదీ ప్రభుత్వం జాతీయ స్థాయిలో సమగ్ర కులగణన జరపాలని కోరారు. మే చివరి వరకు దేశవ్యాప్తంగా సంవిదాన్ బచావో ర్యాలీలో భాగంగా కుల గణనపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కులగణన ఎప్పటి వరకు పూర్తి చేస్తారో మోదీ ప్రభుత్వం స్పష్టం చేయాలని గిడుగు రుద్రరాజు కోరారు.

## కులం కార్డు దిశగా బీజేపీ!

(1వపేజీ తరువాయి) చేయకపోతే ఇబ్బందులు తప్పవని ఆయన చెబుతూ ఉండేవారు. అందుకే రాజకీయం అంటే కులం మతం ప్రాంతం వర్ణం వర్గం ఇలా చాలా లెక్కలు ఉన్నాయి. వాటినే కాంగ్రెస్ చేస్తే తప్పు అన్న బీజేపీ తాను మాత్రం అదే పని చేస్తూ ఒప్పు అనిపించుకోవాలని చూస్తోంది. తాజాగా కుల గణన విషయంలో బీజేపీ ఆలోచనలు మార్చుకుంది. అణుబూచి చూపిస్తూ భారత్‌ను భయపెట్టాలని చూస్తోందా? ఈ డిమాండ్ ని మొదట కాంగ్రెస్ చేసింది. ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ అయితే తరచూ ఇదే విషయం మీద మాట్లాడేవారు. కులాల కుంపట్లు పెట్టి ఒక్కటిగా ఉన్న దేశాన్ని ముక్కలు చేస్తారా అని బీజేపీ తీవ్ర విమర్శలు చేసేది కుల గణన అన్నది అర్థం లేని డిమాండ్ గా కొట్టిపారేసింది కానీ ఇపుడు ఆశ్చర్యకరంగా బీజేపీ అదే తోవను నడుస్తోంది. దానికి కారణం కాంగ్రెస్ కుల గణన పేరుతో బీసీలను మచ్చిక చేసుకుంటోంది బలమైన కులాలకు దగ్గర అవుతోంది. ఫలితంగా ఒక స్ట్రాంగ్ ఓట్ బ్యాంక్ కోసం ప్రయత్నం చేస్తోంది. మతం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తుందని అంతా చెబుతారు. హిందూత్వ అన్నది బీజేపీ రాజకీయ వ్యూహం అని ప్రత్యర్థులు విమర్శిస్తారు. . అదెలా? మరి ఆ వ్యూహాన్ని దెబ్బ తీయాలీ అంటే కులం కార్డుని తేవడమే అన్నది ఇప్పటికి మూడున్నర దశాబ్దాల క్రితం మాజీ ప్రధాని వీపీ సింగ్ ఆచరించి చూపించారు ఆయన బీజేపీ రామ మందిర్ నినాదానికి మండల్ నినాదంతో చెక్ పెట్టారు. ఫలితంగా 1991లో జరిగిన ఎన్నికల్లో హిందూత్వతో అధికారంలోకి వద్దామనుకున్న బీజేపీ చాలా దూరంలో ఉండిపోయింది. ఇక ఇపుడు చూస్తే బీజేపీ మూడు సార్లు వరసగా కేంద్రంలో అధికారంలో ఉంది. ఆ పార్టీ దగ్గర అస్త్రాలు అన్నీ ఒక వైపు అయిపోయాయి. మరో వైపు చూస్తే 2024 ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ కి దగ్గరగా కూడా బీజేపీ రాలేకపోయింది. ఇంకో వైపు కుల గణన డిమాండ్ తో కాంగ్రెస్ బీసీలకు చేరువ అవుతోంది. ఇటీవల జరిగిన గుజరాత్ లోని ఏఐసీసీ సభలలో సైతం కాంగ్రెస్ కుల గణన మీదనే తీర్మానం చేసింది. దాంతో కాంగ్రెస్ వ్యూహాలను పసిగట్టిన బీజేపీ కుల గణనకు జై కొట్టేసింది. ఎటూ అధికారంలో ఉన్న పార్టీ కాబట్టి అడ్వాంటేజ్ ని తీసుకుంది. కుల గణన చేపట్టడం ద్వారా దేశంలో అత్యధికంగా ఉన్న బీసీలు ఓబీసీలను మచ్చిక చేసుకునేందుకే బీజేపీ ఈ ట్రంప్ కార్డుని బయటకు తీస్తోంది అని అంటున్నారు. రానున్న రోజులలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ కుల గణన అన్నది బీజేపీకి ఆ విధంగా ఉపయోగపడుతుంది అని అంటున్నారు. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఆ వచ్చే ఏడాది గుజరాత్ సహా ఇతర రాష్ట్రలా ఎన్నికలు వీటికి మించి 2029లో లోక్ సభ ఎన్నికలు ఉన్నాయి. అందుకే తన ఓటు బ్యాంక్ ని విస్తరించుకుని స్ట్రాంగ్ చేసుకోవడానికే బీజేపీ కుల గణనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది అని అంటున్నారు. కులం కార్డుని తీస్తోంది బీజేపీ. ఒక విధంగా చెప్పాలీ అంటే ఫక్తు రాజకీయ పార్టీ విధానాలనే బీజేపీ అనుసరిస్తోంది. మరి బీజేపీ కుల గణన విషయంలో పై చేయి సాధించే ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకోవాలని చూస్తోది. బీసీలు యాభై శాతం కంటే ఎక్కువ ఉంటారని అందువల్ల రిజర్వేషన్లు కూడా 50 శాతం కంటే ఎక్కువ చేయాలని కొత్త డిమాండ్ బీజేపీ ముందు పెడుతోంది. మరి బీజేపీ దీని మీద ఏమంటుందో చూడాల్సి ఉంది. ఏది ఏమైనా బీజేపీ తన పదునైన వ్యూహాలలో భాగంగానే కుల గణనను హఠాత్తుగా తెర మీదకు తెచ్చింది అని అంటున్నారు.

## ఏఐతో భారత్‌కు అగ్రస్థానం

(1వపేజీ తరువాయి)ఏఐని విరివిగా ఉపయోగిస్తున్నాయి. డెలాయిట్ నివేదిక ప్రకారం.., భారతీయ కంపెనీలు వేగవంతమైన, మెరుగైన ఫలితాల కోసం చిన్నవి, వేగవంతమైన ఏఐ నమూనాలను అవలంబిస్తున్నాయి. అయితే ఈ పరివర్తన అంత సులభం కాదు. దీనికి సురక్షితమైన, విశ్వసనీయమైన, కాలక్రమేణా వృద్ధి చెందగల కొత్త సిస్టమ్ డిజైన్‌లు అవసరం. మరో గ్లోబల్ నివేదికలో గార్ట్‌నర్ ఒక కీలక అంచనా వేసింది. 2024 చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా ఏఐ ద్వారా 3.7 ట్రిలియన్ల వ్యాపార విలువ సృష్టించబడుతుందని , 8.1 బిలియన్ పని గంటలు ఆదా అవుతాయని గార్ట్‌నర్ అంచనా వేసింది. భారతదేశం ఈ బలమైన ఏఐ వాడకం సాంకేతిక రంగంలో దేశం ఎంత వేగంగా పురోగమిస్తుందో స్పష్టంగా చూపిస్తుంది. దైనందిన జీవితాన్ని మెరుగుపరచడానికి ఏఐని ఉపయోగించడంలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా మారుతుందనడానికి ఇది నిదర్శనం. సాంకేతిక విప్లవంలో భారత్ ఇప్పుడు అగ్రస్థానంలో నిలిచి, భవిష్యత్ ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తోంది.

## యుద్ధానికి సన్నద్ధం!

(1వపేజీ తరువాయి)సముద్రంలో నౌకలకు ఈ నావిగేషన్ హెచ్చరిక హెచ్చరికను జారీ చేసింది. భద్రతా కారణాలతో వాణిజ్య నౌకలు ఈ ప్రాంతానికి దూరంగా ఉండాలని సూచించినట్లు ఇందులో తెలిపింది. కీలకమైన సముద్ర మార్గాల్లో తన నౌకాదళం తన విన్యాసాలను ముమ్మరం చేయడంతో పాకిస్తాన్ ఇప్పటికే తన నౌకాదళ హెచ్చరికలను అమలు చేసింది.పాకిస్తాన్ నౌకాదళం గత కొన్ని రోజులుగా అరేబియా సముద్రంలో తీవ్రమైన విన్యాసాలు, లైవ్ ఫైరింగ్‌లను కూడా నిర్వహిస్తోంది.



## జైన మతాచారం 'సంతార'తో మృతి



**భోపాల్-నవభూమి:**మూడేళ్ల బాలికకు బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. శస్త్రచికిత్సతో పాటు చికిత్సలు విఫలమయ్యాయి. దీంతో మరణం అనివార్యమని భావించిన ఆ బాలిక తల్లిదండ్రులు జైన మతాచారాన్ని పాటించారు. స్వచ్ఛంద ఆమరణ నిరాహార దీక్షగా పేర్కొనే 'సంతార' వల్ల ఆ చిన్నారి మరణించింది. మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. పియూష్, వర్ష జైన్ దంపతులు ఐటీ నిపుణులు. వారి మూడేళ్ల కుమార్తె వియానా జైన్‌కు గత ఏడాది డిసెంబర్‌లో బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లుగా వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఆ చిన్నారికి నిర్వహించిన సర్జరీ విఫలమైంది.కాగా, ఆ కుటుంబం ఆధ్యాత్మిక మార్గం వైపు మొగ్గు చూపింది. మార్చి 21న జైన సన్యాసి రాజేష్ ముని మహారాజ్‌ను వారు సందర్శించారు. తల్లిదండ్రులైన పియూష్, వర్ష జైన్ అనుమతితో వారి కుమార్తె వియానా జైన్‌తో 'సంతార' ప్రతిజ్ఞ చేయించారు. దీంతో స్వచ్ఛంద ఆమరణ నిరాహార దీక్ష పాటించిన కొన్ని నిమిషాలకు ఆ చిన్నారి మరణించింది.మరోవైపు 'జైన ఆచారం 'సంతార'ను ప్రతిజ్ఞ చేసిన ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా వియానాను 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' గుర్తించింది. ఈ నేపథ్యంలో స్వచ్ఛంద ఆమరణ నిరాహార దీక్షకు సంబంధించిన ఈ జైన మతాచారం మరోసారి చర్చకు దారి తీసింది. కేవలం మరణానికి దగ్గరగా ఉన్నప్పుడు లేదా బాగా వృద్ధప్యంలో ఉండి మతాచారాలు పాటించలేనప్పుడు, నయం కాని రోగంతో బాధపడుతున్నప్పుడు మాత్రమే 'సంతార'ను ఆచరించాలని జైన మత గ్రంథాలు చెబుతున్నాయి.

## రోడ్డుపై వెళ్తున్న కారు పేలి.. డ్రైవర్ సజీవ దహనం



**రాంచీ-నవభూమి:** రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు చెలరేగాయి. కొన్ని క్షణాల్లోనే ఆ కారులో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది దీంతో మంటల్లో కాలి డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. ఇది చూసి అక్కడున్న జనం షాక్ అయ్యారు. జార?ండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. కద్మా ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు వ్యాపించాయి. దీంతో డ్రైవర్ కారును రోడ్డుపై ఆపాడు. ఆ కారు డిక్కీలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఆ మంటల్లో కారు కాలిపోయింది. కారు డ్రైవ్ చేసిన వ్యక్తి సజీవ దహనమయ్యాడు. ఈ సంఘటన చూసి అక్కడున్న జనం షాక్ అయ్యారు.కాగా, ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసులు, ఫోరెన్సిక్ బృందం అక్కడకు చేరుకున్నారు. మృతుడ్ని సునీల్ అగర్వాల్‌గా గుర్తించారు. కారు పేలిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## లధక్‌లోని ఆర్మీ క్యాంపులో అగ్ని ప్రమాదం..

**లడక్-నవభూమి**కేంద్రపాలిత ప్రాంతం లధక్ లోని ఓ ఆర్మీ క్యాంపులో అగ్ని ప్రమాదం సంభవించింది. లేహ్ పట్టణం లోని డిగ్రీ కాలేజీ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అగ్ని కీలలు ఎగిసిపడటంతో అప్రమత్తమైన ఆర్మీ జవాన్ లు.. ఆర్మీలోని అగ్నిమాపక విభాగానికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను ఆర్పేశారు.

ఫైరింజన్‌ల సాయంతో కొన్ని గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పేశారు. ఆర్మీ అధకారులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని చెప్పారు. ఆర్మీ క్యాంపులో అగ్ని కీలలు ఎగిసిపడుతున్న దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.

## మద్యం తాగొద్దన్నందుకు కొడుకు, కోడలిపై వ్యక్తి కాల్పులు..!



**గోరక్‌పూర్ -నవభూమి:**మద్యం తాగొద్దని చెప్పినందుకు ఓ వ్యక్తి క్షణికావేశానికి లోనయ్యాడు. తన దగ్గర ఉన్న లైసెన్స్‌డ్ తుపాకీతో కొడుకు, కోడలిపై కాల్పులు జరిపాడు. ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్ పట్టణంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గోరక్‌పూర్ పట్టణానికి చెందిన రిటైర్డ్ హెూంగార్డ్ హరియాదవ్‌కు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కోడళ్లు ఉన్నారు.ఈ క్రమంలో హరియాదవ్ రోజూ మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ చేస్తున్నాడు. శనివారం రాత్రి కూడా ఎప్పటిలాగే ఫూటుగా మద్యం సేవించి వచ్చి గొడవకు దిగాడు. దాంతో కొడుకులు, కోడళ్లు గొడవకు దిగొద్దని, అసలు మద్యం తాగడం మానేయాలని హెచ్చరించారు. దాంతో ఆగ్రహించిన హరియాదవ్ తన లైసెన్స్‌డ్ తుపాకీతో కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో హరియాదవ్ పెద్దకుమారుడికి, చిన్న కోడలుకు తీవ్ర గాయాలయ్యాయి.కొడుకు ఛాతీలోకి బుల్లెట్ దూసుకెళ్లగా, కోడలు ఎడమ చేయి, కడుపులోకి బుల్లెట్ వెళ్లాయి. వాళ్లిద్దరూ బీఆర్‌డీ మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆ ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. హరియాదవ్‌ను అరెస్ట్ చేశారు. అతని నుంచి కాల్పులకు వినియోగించిన తుపాకీని సీజ్ చేశారు.

## టెల్ అవీవ్‌పై క్షిపణి దాడి.. ఇజ్రాయెల్‌కు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం దారి మళ్లింపు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఇజ్రాయెల్ ప్రధాన నగరమైన టెల్ అవీవ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో క్షిపణి దాడి జరిగింది. దీంతో ఆదివారం ఢిల్లీ నుంచి ఇజ్రాయెల్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానాన్ని దారి మళ్లించారు. అబుదాబి ఎయిర్‌పోర్ట్‌లో ఆ విమానాన్ని ల్యాండ్ చేశారు. ఆదివారం ఉదయం యెమెన్ నుంచి ప్రయోగించిన క్షిపణి టెల్ అవీవ్ విమానాశ్రయం సమీపంలో పేలింది. ఈ దాడి నేపథ్యంలో ఆ ఎయిర్‌పోర్ట్‌కు విమాన రాకపోకలను కొంతసేపు నిలిపివేశారు.

కాగా, ఆదివారం ఉదయం ఎయిర్ ఇండియా విమానం ఢిల్లీ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరింది. మరో గంటలో ఆ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే ఎయిర్ ఇండియా విమానం జోర్డాన్ గగనతలంలో ఉండగా టెల్ అవీర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో క్షిపణి దాడి జరుగడంతో దానిని మూసివేసినట్లు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఆ విమానాన్ని అబుదాబికి మళ్లించినట్లు ఎయిర్ ఇండియా తెలిపింది. అక్కడి విమానాశ్రయంలో నార్మల్‌గానే ల్యాండ్ చేసినట్లు పేర్కొంది. ఆ విమానం అబుదాబి నుంచి ఢిల్లీకి తిరిగి వస్తుందని వెల్లడించింది.మరోవైపు టెల్ అవీవ్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానాన్ని ఆదివారం రద్దు చేశారు. అలాగే ఈ సంఘటన నేపథ్యంలో ఢిల్లీ, టెల్ అవీవ్ మధ్య విమాన సర్వీసులను మే 3 నుంచి 6 వరకు నిలిపివేసినట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. టిక్కెట్లు బుక్ చేసుకున్న కస్టమర్లకు రీషెడ్యూల్ లేదా ఒకసారి మినహాయింపు లేదా రద్దు చేస్తుకుంటే పూర్తిగా తిరిగి ఇస్తామని పేర్కొంది. కస్టమర్లు, సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎయిర్ ఇండియా పునరుద్ఘాటించింది.

## పాకిస్థాన్‌పై ఇండియా జల యుద్ధం.. దాయాది దేశానికి నీరు నిలిపివేసిన భారత్



**జమ్ము కశ్మీర్:నవభూమి:**పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అమాయకులైన పర్యాటకుల మీద ఉగ్రవాదులు చేసిన దాడిని ప్రపంచదేశాలన్ని ఖండించాయి. ఇక భారత్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా చర్యలు ప్రారంభించింది. టెర్రరిజాన్ని కూకటి వేళ్లతో సహా పెకిలించే దిశగా చర్యలు తీసుకుంటుంది. దానిలో భాగంగా ఉగ్రవాదులకు అడ్డగా మారిన పాకిస్థాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది ఇండియా.

దీనిలో భాగంగా సింధుజలాల ఒప్పందాన్ని రద్దు చేయడమే కాక ఆ దేశ పౌరుల వీసాల రద్దు చేసి వారిని ఇండియా నుంచి వెనక్కి పంపించింది. దౌత్య సిబ్బందిని తగ్గించింది. అటారి సరిహద్దు మూసివేసింది. అలానే పాకిస్థాన్‌కు చెందిన సోషల్ మీడియా అకౌంట్లపై నిషేధం విధించింది. వ్యాపార ఆంక్షలు విధించడంతో పాటుగా.. దౌత్యపరంగా ప్రపంచ దేశాలు మద్దతు కూడగట్టి పాకిస్థాన్‌ను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది ఇండియా.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా.. ఇండియా పాకిస్థాన్ మీద జల యుద్ధం ప్రకటించిన సంగతి తెలసిందే. ఇప్పటికే ఆ దేశంతో కుదుర్చుకున్న సింధు నది జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకుంది.ఇక తాజాగా రెండో దశ చర్యలు ప్రారంభించింది. పాక్ వ్యవసాయరంగానికి మూలాధారమైన నదీజలాల ప్రవాహాలను మన దేశం నుంచి పొరుగు దేశం వెళ్లకుండా కట్టడి చేసే చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా అధికారులు..చినాబ్ నదిపై ఉన్న బాగ్లిహార్ డ్యామ్ వద్ద నీటి ప్రవాహాన్ని కట్టడి చేసే పనులను వేగవంతం చేశారు.బాగ్లిహార్ డ్యామ్‌ని 2008లో చినాబ్ నదిపై నిర్మించారు. 900 మెగావాట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి నిమిత్తం దీన్ని కట్టారు. ఈ డ్యామ్ పొడవు దాదాపు 145 మీటర్లు. సింధు జలాల ఒప్పందం కింద పాకిస్థాన్‌కు అత్యధిక వాటా నీళ్లు లభించే నదుల్లో చినాబ్ కూడా ఒకటి. పాక్‌లోని పంజాబ్ పరిసర ప్రాంతాల్లో పంటలకు సాగునీరు ఈ నదీ ద్వారానే అందుతుంది. ఇప్పుడు ప్రభుత్వం ఈ నీటిని పాకిస్థాన్ వెళ్లకుండా అడ్డుకునే చర్యలు ప్రారంభించింది.అలానే జీలం నదీ జలాల విషయంలోనూ కేంద్రం చర్యలకు సిద్ధమవుతుంది. ఈ నదిపై ఉన్న కిషన్ గంగా డ్యామ్ నుంచి నీరు పాకిస్థాన్ వైపు వెళ్లకుండా చర్యలు తీసుకుంనేందుకు ఇండియా సిద్ధమవుతుంది. ఇప్పటికే మన దేశం సింధు నీటి ఒప్పందాన్ని నిలిపివేయంతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్థాన్‌కు తాజా చర్యలు మరింత పిచ్చి లేపుతాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు అంటున్నారు నిపుణలు.ఇదిలా ఉండగా.. నియంత్రణ రేఖ వెంబడి పాక్ కవ్వింపు చర్యలు కొనసాగిస్తానే ఉంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత నుంచి పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంబడి కాల్పుల విమరణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ కాల్పులు జరుపుతూనే ఉంది. వరుసగా పదోరోజూ.. సరిహద్దు చెకోపోస్టుల సమీపంలో పాక్ రేంజర్లు కాల్పులు జరిపారు. నిన్న అర్ధరాత్రి సరిహద్దు రేఖ సమీపం కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరి, మెంధర్, నౌషెరా, సుం దుర్భని, అక్నూర్ సెక్టార్లలో పాక్ సైన్యం కాల్పులకు తెగబడగా ఇండియన్ ఆర్మీ

## జమ్మూ కశ్మీర్: అదుపుతప్పి లోయలో పడ్డ ఆర్మీ వాహనం



**జమ్ము కశ్మీర్:నవభూమి:**జమ్మూ కశ్మీర్‌లో ఆదివారంఘోర ప్రమాదం సంభవించింది. సైనికులు వాహనం లోయలో పడి ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు కాన్వాయ్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. రాంబన్ జిల్లాలోని బట్టేరే చాష్మా వద్ద జాతీయ రహదారి 44 వద్ద ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో సైనిక వాహనం అదుపుతప్పి.. పక్కనే ఉన్న 700 అడుగుల లోతైన లోయలోకి దూసుకెళ్లింది. దీంతో వాహనం నుజ్జునుజ్జయి.. అందులోని పలువురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురు చనిపోయారని అధికారులు తెలిపారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

మృతిచెందిన సైనికులను అమిత్ కుమార్, సుజీత్ కుమార్, మన్ భదూర్‌గా గుర్తించామని అధికారులు వెల్లడించారు.ఇక, ఈ ప్రమాదం గురించి సమాచారం తెలిసిన వెంటనే.. ఆర్మీ, జమ్మూ కశ్మీర్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, స్థానిక వాలంటీర్లు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఘటనా స్థలిలో బీతావాహ వాతావరణం నెలకుంది. ప్రమాదం ధాటికి వాహనం పూర్తిగా ధ్వంసమైంది. వాహనం పడిపోయిన ప్రదేశంలోకి వెళ్లడం సహాయక బృందాలకు క్లిష్టంగా మారింది. వాహనంలో ప్రమాద సమయానికి ఎంత మంది ఉన్నారనేది సమాచారం లేదు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ప్రహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో మరింత భద్రతను పెంచారు. ఏప్రిల్ 22న బైసరన్ లోయలో పర్యాటకులపై పాకిస్థాన్ ఉగ్రవాదులు కాల్పులు జరిపిన ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడికి పాల్పడినవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఉగ్రవాదుల గురించి కశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నారు. ఎక్కడికక్కడ నిఘాను పెంచి.. ముష్కరుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. దీంతో శ్రీనగర్‌కు జమ్మూ నుంచి బలగాలను తరలిస్తున్నారు. ఈ క్రమంలో సైనిక కాన్వాయ్‌లోని వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. ప్రమాదంపై జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## కేంద్రం అనుమతితోనే పెళ్లి.. పాక్ యువతిని రహస్యంగా పెళ్లాడిన సీఆర్పీఎఫ్ జవాన్



**జమ్ము కశ్మీర్:నవభూమి:**పాకిస్థాన్ మహిళను రహస్యంగా వివాహం చేసుకున్న సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మునీర్ అహ్మద్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అనుమతి తీసుకోకపోవడమే కాకుండా ఈ విషయం దాచిపెట్టినందుకు అతడ్ని ఉద్యోగం నుంచి తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా, దీనిపై మునీర్ అహ్మద్ స్పందించారు. తనపై చర్యలు తీసుకోవడం అన్యాయమని, కోర్టులో సవాల్ చేస్తానని స్పష్టం చేశాడు. అంతేకాదు, తన పెళ్లికి కేంద్రం నుంచి కూడా అధికారిక అనుమతి తీసుకున్నట్టు తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడితో భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకున్న తరుణంలో ఈ ఘటన వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది.జమ్మూలోని ఘరోటా ప్రాంతానికి చెందిన మునీర్ అహ్మద్.. 2017లో సీఆర్పీఎఫ్‌లో చేరారు. అయితే, 2024 మే 24న పాకిస్థాన్‌కు చెందిన యువతి మినాల్ ఖాన్‌తో వీడియో కాల్ ద్వారా ఆన్‌లైన్ నిఖా చేసుకున్నాడు. ఈ వివాహానికి సీఆర్‌పీఎఫ్ ప్రధాన కార్యాలయం నుంచి 2024 ఏప్రిల్ 30న అనుమతి వచ్చిందని మునీర్ వెల్లడించారు. అయితే, పహల్గామ్ ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్ హస్తం ఉందని అనుమానిస్తోన్న భారత్?. ఆ దేశంపై దౌత్యపరమైన ఆంక్షలు విధించింది. పాకిస్థాన్ పౌరులను వెనక్కి పంపాలని భారత్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మునీర్ అహ్మద్.. పాక్ యువతి వివాహ విషయం వెలుగులోకి వచ్చింది.ఫిబ్రవరి 28న మినాల్ వాఘా-అట్టారి సరిహద్దు గుండా భారత్‌లో ప్రవేశించారు. ఆమెకు ఇచ్చిన 15 రోజుల షార్ట్ టర్మ్ వీసా మార్చి 22న ముగిసింది. అయితే, దీర్ఘకాలిక వీసా కోసం మినాల్ ఖాన్ కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. ఇంతలోనే పహల్గామ్ దాడి చోటుచేసుకోవడం డిపోర్టేషన్ ముప్పు ఎదురైంది.సీఆర్పీఎఫ్ ప్రకారం.. మునీర్ తన వివాహాన్ని గోప్యంగా ఉంచడమే కాకుండా.. వీసా గడువు ముగిసిన తర్వాత ఆమెకు ఆశ్రయం కల్పించడం జాతీయ భద్రతకు హానికరమని పేర్కొంటూ ఆయనను సేవల నుంచి తొలగించింది."ఉద్యోగం నుంచి తొలగించిన విషయాన్ని తొలుత మీడియాలోనే చూశాను. తరువాత అధికారికంగా ఉత్తర్వులు వచ్చాయి... ఇది నన్ను, నా కుటుంబాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. నేను అన్ని అధికారిక పత్రాలు సమర్పించి, అనుమతి పొందిన తర్వాతే పెళ్లి చేసుకున్నాను' అని మునీర్ పీటీఐతో ఫోన్‌లో వెల్లడించారు.పెళ్లి అనంతరం తాను 72వ బెటాలియన్ వద్ద అవసరమైన అన్ని పత్రాలను సమర్పించానని, ఫిబ్రవరిలో విజిటింగ్ వీసాపై ఆమె భారత్‌కు వచ్చిన వెంటనే, లాంగ్ టర్మ్ వీసా కోసం దరఖాస్తు చేశారని తెలిపారు. తనను ఉద్యోగం నుంచి అన్యాయంగా తొలగించారని, దీనిపై న్యాయపోరాంటం చేస్తానని పేర్కొన్నారు. 'ఈ చర్యను నేను న్యాయపరంగా సవాల్ చేస్తాను. న్యాయ వ్యవస్థ మీద నాకెంతో నమ్మకం ఉంది' అని మునీర్ చెప్పారు. ఆయన అతి త్వరలో కోర్టును ఆశ్రయించనున్నట్టు తెలుస్తోంది.

## కూలిన ప్రభుత్వ ఆసుపత్రి కారిడార్.. ముగ్గురు రోగులు మృతి, మరికొందరికి గాయాలు

రాంచీ: ప్రభుత్వ ఆసుపత్రి కారిడార్ కూలిపోయింది. ఈ సంఘటనలో ముగ్గురు రోగులు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించారు. జార?ండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో మహాత్మా గాంధీ మెమోరియల్ ఆసుపత్రిలోని రెండో అంతస్తులో శిథిలావస్థకు చేరిన కారిడార్ కూలిపోయింది. దీంతో అక్కడున్న రోగుల్లో ముగ్గురు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. శిథిలాల కింద 15 మంది చిక్కుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టి 12 మందిని రక్షించారు.కాగా, ఈ సంఘటనకు ముందు రోజు ఆ ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఒక బ్లాక్‌లోని రోగులను శిథిలావస్థలో ఉన్న రెండో అంతస్తులోకి తరలించారు. శనివారం అక్కడి బాల్కనీలో కొందరిని ఉంచారు. అది కుప్పకూలి ముగ్గురు రోగులు మరణించడంతో విమర్శలు వెల్లువెత్తాయి. శిథిలావస్థకు చేరిన చోట రోగులను ఎందుకు ఉంచారని వారి బంధువులు నిలదీశారు. అయితే మరమ్మతుల తర్వాత వినియోగానికి కాంట్రాక్టర్ అనుమతి ఇవ్వడంతో

## ఉగ్రదాడితో రగిలిపోతున్న భారతీయులు



**జమ్ము కశ్మీర్:నవభూమి:**జమ్మూ కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లో గత నెల 22న జరిగిన భయానక ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, పహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు భారతదేశం ప్రతీకారం తీర్చుకునే వరకు బొకేలు లేదా జ్ఞాపికలు తీసుకోనని కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటీల్ శపథం చేశారు. గుజరాత్‌లోని సూరత్‌లో జరిగిన పెట్టుబడిదారుల సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి పాటీల్.. అక్కడ తనకు అందించిన బొకేలు, జ్ఞాపికలను సున్నితంగా తిరస్కరించారు. దీనిపై కార్యక్రమ నిర్వాహకుల్లో ఒకరు మాట్లాడుతూ.. "పహల్గామ్ ఘటనకు ప్రతీకారం తీర్చుకునే వరకు స్వాగతం పలికే సమయంలో ఇచ్చే బొకేలు, జ్ఞాపికలు తీసుకోకూడదని మంత్రి నిర్ణయించుకున్నారు' అని తెలిపారు. దీంతో అక్కడ వారి నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. 'ప్రతీకారం తీర్చుకునేవరకు బొకేలు తీసుకోను' అని పాటీల్ గుజరాతీలో వ్యాఖ్యానించారు.

పాకిస్తాన్థాపై చర్యల భాగంగా సింధూ నదీ జలాల ఒప్పందం రద్దుపై పాటీల్.. 'ఇకపై ఒక్క చుక్క నీరు కూడా పాకిస్థాన్‌కు వెళ్లనివ్వం' అన్నారు. 'సింధూ నదీ జలాల ఒప్పందం రద్దు మోదీ ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయం న్యాయసమ్మతమే కాదు, జాతీయ ప్రయోజనాల కోసం కూడా అత్యంత అవసరం... సింధూ నదిలోని నుంచి ఒక్క బొట్టు నీరు కూడా పాకిస్థాన్‌కి వెళ్లకుండా నిరోధిస్తాం' అని ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు.పహల్గామ్ ఉగ్రదాడిపై తీవ్ర స్థాయిలో స్పందిస్తూ.. పాకిస్థాన్‌పై విమర్శలు గుప్పించారు. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు చేసిన దాడిలో 25 మంది పర్యాటకులు సహా 26 మంది మృతి చెందారు. ఈ దాడి తర్వాత భారత్ పాక్‌పై అనేక చర్యలు తీసుకుంది. వాటిలో ముఖ్యమైనవి: అటారి-వాఘా ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్‌ను మూసివేయడం, పాకిస్థానీ పౌరుల వీసాలు రద్దు చేయడం, దేశవ్యాప్తంగా పాకిస్తాన్ హైకమిషన్‌ల ఉద్యోగుల సంఖ్యను కుదించడం.సూరత్ పెట్టుబడుల సదస్సులో భారతదేశ భవిష్యత్ అభివృద్ధిపై పెట్టుబడులు, వ్యాపార అవకాశాలు, వినూత్నత తదితర అంశాలపై గణనీయమైన చర్చలు జరిగాయని కేంద్ర మంత్రి పాటిల్ తెలిపారు. అలాగే, 'నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి చెందిన భారత్ అనే దిశగా దేశం వేగంగా దూసుకుపోతోంది.. ఈరోజు భారత్ కేవలం వినియోగదారునిగా కాకుండా, పెట్టుబడుల రంగంలో ప్రపంచ నేతగా ఎదుగుతోంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.మరోవైపు, పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య, పాకిస్థాన్ నుంచి నేరుగా లేదా పరోక్షంగా చేసుకునే వస్తువుల దిగుమతులపై భారత్ నిషేధం విధించింది. అలాగే, పాకిస్తాన్ నుంచి అన్ని రకాల మెయిల్, పార్సిల్ పంపడం (గాలిమార్గం, భూమార్గం ద్వారా) నిలిపివేసింది. పాక్ జెండాలతో నడుస్తున్న నౌకలకు భారత పోర్టుల ప్రవేశాన్ని నిషేధించడమే కాక, భారత జెండాతో నడిచే నౌకలు పాకిస్థాన్ పోర్టులకు వెళ్లడాన్ని కూడా పూర్ణంగా నిషేధించింది.

## భారతీయులకు ట్రంప్ మరో షాక్.. వాటిపై కూడా పన్ను విధింపు



అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ.. సంచలనాలకు కేరాఫ్ అడ్రెస్‌గా నిలుస్తున్నారు. ఇప్పటికే ప్రతీకార సుంకాల పేరుతో ప్రపంచ దేశాలను అల్లాడిస్తున్న ట్రంప్.. ఇప్పుడు మరో సరికొత్త నిర్ణయం తీసుకుని.. భారతీయులకు అందునా తెలుగు వారికి భారీ షాక్ ఇచ్చాడని చెప్పవచ్చు. కాదేదీ సుంకానికి అనర్హం అన్నట్లు ప్రవర్తిస్తున్న ట్రంప్.. తాజాగా తెలుగు వారి జిహ్వా చాపల్యాన్ని తీర్చే పచ్చళ్లపై కన్ను వేశాడు. ఇకపై పచ్చళ్లపై కూడా పన్ను చెల్లించాలట. ఆ వివరాలు..అమెరికాలో ఉన్న మన వాళ్లు.. ఇండియా నుంచి ఎవరైనా స్నేహితులో, బంధువులో అక్కడకు వస్తుంటే ఫలానా వస్తువులు, తినుబండారాలు, పచ్చళ్లు, పొడులు, బట్టలు, ఇతరాత్ర వస్తువులు వంటివి తీసుకురావాల్సిందిగా కోరుతుంటారు. అయితే ఇలా వ్యక్తిగత స్థాయిలో తెప్పించుకునే ఉత్పత్తుల మీద ఇప్పటి వరకు అమెరికా ప్రభుత్వం పన్నులు వసూలు చేయలేదు. కానీ ఇప్పుడు అక్కడ అధికారంలో ఉంది ట్రంప్ కదా.. దాంతో ఇలాంటి చిన్న చిన్న వ్యవహారాలపై కూడా అమెరికా ప్రభుత్వం తాజాగా దృష్టి సారిస్తోంది. వ్యక్తిగతంగా వ్యక్తుల ద్వారా, సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా తెప్పించుకునే ఉత్పత్తుల మీద ఇక నుంచి అమెరికా అధికారులు నిఘా పెట్టనున్నారు. అలానే ఇలా తెప్పించుకునే వాటి మీద పన్ను వసూలు చేసి ఖజానా నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు అమెరికా అధికారులు. సుంకం చెల్లించకపోతే, భారీ జరిమానాలు విధించి ఇలాంటి మార్గాలను పూర్తిగా కట్టడి చేయాలని అమెరికా అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.భారత్‌లో మాదిరిగానే అమెరికాలో కూడా.. సోషల్ మీడియా హ్యాండిల్స్‌నే వ్యాపార వేదికలుగా మార్చుకుని అనేకమంది బిజినెస్ చేస్తున్నారు. వీరిలో పలువురు తెలుగువాళ్లు, ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. ఇండియా నుంచి వివిధ ఉత్పత్తులను కొరియర్ ద్వారా తెప్పించుకొని..అమెరికాలో సోషల్ మీడియాలో ఆర్డర్లు తీసుకొని కొనుగోలుదార్లకు కొరియర్ ద్వారా డెలివరీ చేస్తుంటారు. అయితే ఇప్పటి వరకు ఇలాంటి వాటి మీద అమెరికా ప్రభుత్వం పన్నులు వసూలు చేసిన దాఖలాలు లేవు. అలానే యాప్‌ల ద్వారా జరిగే వ్యాపారాల మీద కూడా ఎలాంటి పన్నులేదు.కానీ ఇప్పుడు ట్రంప్ సర్కార్ కన్ను ఇలాంటి వారి మీద పడింది. ఇలా ఆన్లైన్, యాప్‌ల ద్వారా విక్రయించేవారితోపాటు, కొనుగోలుదార్ల మీద కూడా సుంకాలు విధించాలని అమెరికా అధికారులు భావిస్తున్నారు. దీనిలో భాగంగా.. భారత్‌లోని రిటైలర్ల నుంచి అమెరికాలో ఉన్న వ్యక్తులు తెప్పించుకుంటున్న షిప్మెంట్లను అధికార వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయి. ఈ మేరకు పలువురికి భారీ జరిమానాలు, న్యాయపరమైన చర్యలకు సంబంధించి నోటీసులు పంపుతున్నాయి.అయితే ఇప్పటి వరకు చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి ఇలా నోటీసులు అందాయి.మరి వ్యక్తిగతంగా అంటే ఎవరైనా బంధుమిత్రులు అమెరికాకు వస్తుంటే వారి ద్వారా పచ్చళ్లు, తినుబండారాలు, దుస్తులు, బంగారు నగలు వంటివి తెప్పించుకుంటే వాటి మీద కూడా పన్ను చెల్లించాలా.. లేదంటే జరిమానాలు విధిస్తారా అనే చర్చ జరుగుతుంది. ఇక ట్రంప్ గనక వీటి మీద పన్ను వేస్తే.. పచ్చళు ్ల, ఇతర వస్తువులు తెప్పించుకునే వారికి ఇది పెను భారంగా మారనుంది. ట్రంప్ సుంకాల ప్రకటన నేపథ్యంలో బంగారం ధర భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. పది గ్రాముల ధర ఏకంగా లక్ష రూపాయలకు చేరి.. ఆ తర్వాత నెమ్మదిగా దిగా రాసాగింది.

## పది పరీక్షల్లో కుమారుడు ఫెయిల్.. సెలబ్రేట్ చేసిన పేరెంట్స్



**బెంగళూరు-నవభూమి:** ఒక విద్యార్థి పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. స్నేహితులు అతడ్ని ఎగతాళి చేశారు. అయితే తల్లిదండ్రులు ఏమాత్రం నిరాశ చెందలేదు. పైగా పరీక్షల్లో కుమారుడి వైఫల్యాన్ని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేశారు. మళ్ళీ ప్రయత్నించి విజయం సాధించాలని భరోసా ఇచ్చారు. కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో ఈ సంఘటన జరిగింది. బసవేశ్వర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి అభిషేక్ పదో తరగతి బోర్డు పరీక్షల్లో తప్పాడు. ఆరు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. 625 మార్కులకు గాను 200 మాత్రమే సాధించాడు.కాగా, అభిషేక్ అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడాన్ని అతడి స్నేహితులు ఎగతాళి చేశారు. అయితే అతడి తల్లిదండ్రులు మాత్రం ఎలాంటి నిరాశ చెందలేదు. కుమారుడ్ని తిట్టడం లేదా కొట్టడం చేయలేదు. అవమానించకపోగా అతడ్ని ఎంకరేజ్ చేసేందుకు ప్రయత్నించారు. పరీక్షల్లో కుమారుడి వైఫల్యాన్ని సెలబ్రేట్ చేశారు. చిన్న వేడుక నిర్వహించారు. అభిషేక్ పేరుతోపాటు అతడు సాధించిన మార్కులతో కూడిన కేక్ కట్ చేయించి అతడికి తినిపించారు. 'నువ్వు పరీక్షలో ఫెయిల్ అయి ఉండవచ్చు. కానీ జీవితంలో కాదు. నువ్వు మళ్ళీ ప్రయత్నించి విజయం సాధించవచ్చు' అని తల్లిదండ్రులు అతడితో అన్నారు.మరోవైపు పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయినప్పటికీ తనను తిట్టకుండా, అవమానించకుండా ఎంకరేజ్ చేసిన తల్లిదండ్రుల తీరు చూసి అభిషేక్ చలించిపోయాడు. 'నేను ఫెయిల్ అయినప్పటికీ, నా కుటుంబం నన్ను ప్రోత్సహించింది. నేను మళ్ళీ పరీక్షలు రాస్తా. ఉత్తీర్ణుడవుతా, జీవితంలో విజయం సాధిస్తా' అని అన్నాడు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్ఫూర్తిగా నిలిచే ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



## భారత్‌తో యుద్ధం వస్తే ఇంగ్లాండ్ పారిపోతా.. పాక్ ఎంపీ



ఇస్లామాబాద్-నవభూమి:పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. దీంతో పాకిస్థాన్‌పై భారత్ యుద్ధం చేస్తుందన్న భయం ఆ దేశ ప్రజలతోపాటు పాక్ నేతలను వెంటాడుతున్నది. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య యుద్ధం జరిగితే తాను ఇంగ్లాండ్‌కు పారిపోతానని పాక్ ఎంపీ అన్నారు. (%ఖుఎఅఖుఅఆ ఫీ%) పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ సభ్యుడు షేర్ అఫ్జల్ ఖాన్ మార్వాట్ మీడియాతో మాట్లాడారు. భారత్‌తో యుద్ధం జరిగితే తుపాకీ చేతపట్టి సరిహద్దుకు వెళ్తారా? అని విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. 'భారతదేశంతో యుద్ధం జరిగితే నేను ఇంగ్లాండ్‌కు వెళ్తా' అని అన్నారు.కాగా, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ వెనక్కి తగ్గవచ్చని మీరు నమ్ముతున్నారా? అన్న ప్రశ్నకు మార్వత్ వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. 'నేను చెప్పగానే వెనక్కి తగ్గడానికి మోదీ నా అత్త కొడుకునా?' అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.మరోవైపు జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) సభ్యుడు షేర్ అఫ్జల్ ఖాన్ మార్వాట్. అయితే గతంలో ఆ పార్టీతో పాటు నాయకత్వంపై పదే పదే ఆయన విమర్శలు చేశారు. దీంతో ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా ఉన్నప్పుడు కీలక పదవుల నుంచి ఆయనను తొలగించారు.

## భూ భారతితో దళితులకు మేలు జరిగేనా

గతంలో 'మాభూమి' పోర్టల్‌లో స్పష్టమైన టిప్పన్, సరైన అక్షాంశ-రేఖాంశాల ఆధారంగా రూపొందించిన ఖని బండల గుర్తులతో కూడిన భూడిజిటల్ భూపటాన్ని మాయం చేసిన 'ఘనత' 'ధరణి'కి దక్కింది. తాజాగా, అందులోని కాడాస్ట్రల్ మ్యాప్ (ఒక నిర్దిష్ట ప్రాంతం ఆస్తి సరిహద్దులు, కొలతలు, యాజమాన్య వివరాలను సూచించే భూమి బ్లూప్రింట్) అదృశ్యం చేసిన ఘనత ఇప్పుడు 'భూభారతి'కి దక్కుతోంది! ప్రభుత్వాలు రోజురోజుకీ ప్రజలకు ప్రభుత్వ రికార్డులను దూరం చేస్తున్నాయి. తెలంగాణ భూ భారతి చట్టంలోని సెక్షన్ 2, ఉప-సెక్షన్ (12)లోని క్లాజు(%వా%) ద్వారా పొందిన అనుభవ హక్కుతో సెక్షన్ 8 ద్వారా భూమి హక్కుల రికార్డుల్లో మార్పులు అంటే మ్యుటేషన్ కోసం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)కి దరఖాస్తు చేసుకోవటం అనే నిబంధన ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మ్యుటేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆర్డీఓ నిర్ణయం తీసుకుంటారని చట్టం చెబుతున్నా, రికార్డులో మార్పును తిరస్కరించే ముందు దరఖాస్తుదారుడికి వివరణ ఇచ్చే అవకాశం కల్పించడం, ప్రభావితమయ్యే వారికి నోటీసులు జారీ చేసి, వారి అభ్యంతరాలను పరిశీలించాలనే నిబంధన ఆచరణలో ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకం. ఈ ప్రక్రియ కేవలం కాగితాలకే పరిమితమైతే పేదలకు న్యాయం ఎలా జరుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అసైన్డ్, లావని పట్టా భూములు ఎవరి ఆధీనంలో ఉంటే వారు ఈ ఆర్‌ఓఆర్ పోర్టల్‌లో ఆర్డీఓకి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే, రికార్డుల్లో మార్పులు చేయవచ్చని ఈ సెక్షన్ 8 చెబుతోంది. ఆర్డీఓ ఈ దరఖాస్తులను ఎలా పరిశీలిస్తారు, గతంలోని రక్షణలను పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది ప్రశ్నార్థకం.ఈ విధానం ద్వారా అసైన్డ్, లావని పట్టా భూములు సులువుగా పట్టా పొందే అవకాశం ఉంది. తెలంగాణ అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్%-% పీవోటీ) యాక్ట్, 1977 ప్రకారం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ బదలాయించడానికి వీల్లేదు. పేదల ఆర్థిక, సామాజిక భద్రత కోసమే ఈ పీవోటీ చట్టం చేశారు. కానీ, కొత్త చట్టంలోని సెక్షన్ 8లో ఆ భూముల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. బలహీనవర్గాల ప్రజలకు కేటాయించిన భూములు, ప్రభుత్వానికి చెందిన లావణి భూములు ఇతరుల చేతుల్లో ఉంటే, వారు ఈ సెక్షన్‌ను అడ్డుపెట్టుకుని రికార్డుల్లో మార్పులు చేసుకునే ప్రమాదం ఉంది. నోటీసులు జారీ చేసినప్పటికీ, చాలా మంది పేద ప్రజలకు తమ హక్కుల గురించి సరైన అవగాహన ఉండకపోవచ్చు లేదా అభ్యంతరాలు తెలిపేందుకు అవసరమైన వనరులు లేకపోవచ్చు. భూభారతి చట్టంలోని సెక్షన్ 2, ఉప-సెక్షన్ (12)లోని క్లాజు ఆసరాగా చేసుకుని భూస్వాములు, ఇతర బడా వ్యక్తులు అసైన్డ్, లావని పట్టా, ప్రభుత్వ భూములను తమ పేరు మీదకు మార్చుకునే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వం కేవలం అభ్యంతరం తెలిపే అవకాశం ఇస్తామని చెబుతున్నప్పటికీ, నిరక్షరాస్యులైన, బలహీన వర్గాల ప్రజలు తమ భూముల హక్కుల కోసం ఎలా పోరాడగలరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చట్టంలోని చిక్కులు, నోటీసుల ప్రాముఖ్యత గురించి వారికి ఎంతవరకు అవగాహన ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనివల్ల అసైన్డ్ భూములు, తరతరాలుగా సాగుచేసుకుంటున్న లావని పట్టా భూములు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భూ భారతి చట్టంలోని సెక్షన్ 8 పేదల భూములను పరిరక్షించాలనే ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది. అసైన్డ్ భూముల విషయంలో ప్రత్యేక నిబంధనలు ఎందుకు చేర్చలేదనేది ప్రధానంగా వినిపిస్తున్న వాదన. 1977 నాటి అసైన్డ్ ల్యాండ్స్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి మార్పులు జరిగినా వాటిని తిరస్కరించేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసైన్డ్, ప్రభుత్వ భూములకు ప్రత్యేక రక్షణ కల్పించేలా నిబంధనలు చేర్చాలని, చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా జరిగే మ్యుటేషన్లను తిరస్కరించే అధికారం అధికారులకు ఉండాలని విశ్లేషకుల వాదన. సెక్షన్ 8 అమలులోకి వస్తే... పీవోటీ చట్ట స్ఫూర్తి దెబ్బతింటుంది. అంతేకాకుండా, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు కూడా ఇది విరుద్ధంగా మారే అవకాశం ఉంది. పేదల సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టానికి విరుద్ధంగా ఈ సెక్షన్ ఎలా అమలవుతుందో, అలాగే ఈ అంశంపై ప్రభుత్వం ఎలాంటి వివరణ ఇస్తుందో వేచి చూడాలి. సెక్షన్ 8 అమలులో ప్రత్యేకంగా భూ భారతి చట్టంలోని సెక్షన్ 2, ఉప%-%సెక్షన్ (12)లోని క్లాజు( విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే, గతంలో పేద ప్రజలకు కల్పించిన భూ హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. కాబట్టి, ప్రభుత్వం ఈ విషయంలో మరింత స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాల్సిన అవసరం ఉంది.

# సమన్వయ కుటుంబం - పచ్చని కుటుంబం



ఇటీవలే ఒక పెద్ద మనిషితో జరిగిన ఇష్టా గోష్టిలో... సదురు పెద్దమనిషి ఒక స్టేట్మెంట్ ఇచ్చాడు..... అదేమంటే.. ఇంట్లో ఉండే గొడవలే ఒంట్లో నలతలకు, వ్యక్తిగత కలతలకు కారణం అన్నాడు. దీని గూర్చే ఆలోచిస్తూ ఈ వ్యాసాన్ని రాస్తున్నాను. అవును ఆయన గారు చెప్పింది కరెక్ట్. ఇల్లు చక్కగ, సవ్యంగ నిర్వహించబడితే ఇల్లే మనకు స్వర్గసీమ అనిపిస్తుంది. ఈ విషయంలో నిశితంగా గమనిస్తే, ఇల్లు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడే... ఆ ఇంటి వారు వేరే ప్రాంతాలకు పనిపై వెళ్లినవారు మరియు ఆయా డ్యూటీలను వారు నిర్వహించిన అనంతరం వెంటనే ఇంటికి చేరుకోవాలనే తపన కలిగి ఉంటారు. దీనికి విరుద్ధ పొకడ ఉంటే - ఇక అనాసక్తితో ఏదో రొటీన్ గా, మొక్కుబడిగ రావడం చేస్తుంటారు. గృహంలో కుటుంబం ఉంటుంది. సదరు కుటుంబం సక్రమంగా నిర్వహించబడితేనే మాదిరి గృహంగా గమనించబడుతుంది. గృహ పరిస్థితిని కుటుంబ పరిస్థితులే వెల్లడి చేస్తుంటాయి. కొన్ని గృహాలు మాదిరికరంగా నిర్వహించబడుతూ ప్రశాంతమైన వాతావరణాన్ని కలిగి ఉంటాయి. కొన్ని రణగొణ ధ్వనులతో, కేకలతో, అరుపులతో అస్తవ్యస్తమైన వాతావరణాన్ని కలిగి ఉంటాయి. కొన్ని గృహాలలో అందరూ ఉన్నా, ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నం అవ్వడంతో చాలా కూల్ గా ఉంటాయి. కొన్నింటిలో ఇద్దరు ముగ్గురే ఉన్నా, సఖ్యత లేని కారణంగా అరుపులు,



పెడబొబ్బలతో ఉంటాయి. ఇంట్లో గొడవలకు సాధారణంగా, ఎవరికివారు ఇగోలకు పోవడమే ప్రధాన కారణంగా ఉంటుంది. ఆర్థిక సమస్యలు, మనస్పర్ధలు, వ్యసనాలు, ఆస్తితగాదాలు, నేనే గొప్ప నాదే నడవాలనే అహంకార ధోరణిలు ఇలా పలు కారణాలుగా ఉంటాయి. అయితే గమనించాలి, ఇంట్లో గొడవలు ఖచ్చితంగా పిల్లల చదువు, వారి ప్రవర్తనలపై ప్రభావాన్ని చూపుతాయి. ఈ మేరకు నిత్యజీవితంలో గమనించగలము. అందుచేతనే ఇల్లు, సంసారం, జీవితాలు సవ్యంగా నిర్వహించబడాలి. చదివే పిల్లలుడే ఇళ్లు ప్రశాంతంగా నిర్వహించబడితే ఇక పిల్లలు చక్కగా చదువుకుంటారు. గృహం - కుటుంబం - అందలి సభ్యులు వేరువేరుగా కాకుండా అంతా ఒక్కటే అనే భావంతో ప్రశాంతమైన వాతావరణాన్ని కలిగిస్తూ అన్యోన్యత, ప్రేమానురాగాలను కలిగి ఉండాలి. భార్య భర్తలు కేవలం పిల్లల్ని కనడం మాత్రం కాదు, వారు ఆదర్శవంతంగా జీవిస్తూ తమ పిల్లల్ని ఉత్తమ పౌరులుగా తయారు చేయాలి అప్పుడే కుటుంబ లక్ష్యం నెరవేరుతుంది. అన్ని మానవ సమూహాలలో కుటుంబం అతి ముఖ్యమైన ప్రాథమిక సమూహం. తండ్రి, తల్లి వారి పిల్లలతో కూడిన చిన్న ప్రాథమిక సమూహమే కుటుంబం. క్లుప్తంగా చెప్పాలంటే, కుటుంబం అనేది వివాహం ద్వారా దాని ఒప్పందాల పై నిర్వహించబడే ఒక ప్రాథమిక సమముహం. ఈ ప్రాథమిక సమూహంలో తల్లిదండ్రులు మరియు వారి సంతానం ఉంటారు. కుటుంబంలో విధులు, హక్కులు, భాధ్యతలు పరస్పరం గౌరవించబడుతూ ఆమోదించబడుతూ ఉంటే సదరు కుటుంబం పచ్చని కుటుంబం వలె నిర్మలంగా ప్రశాంతంగా నిర్వహించబడుతుంది. దీనికి విరుద్ధంగా ఉంటే....? ఊహించండి.

అఖండమేధావులైన అరిస్టాటిల్, ప్లేటోలు పితృ స్వామిక కుటుంబ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అంటే తండ్రియే పూర్తి బాధ్యతగా నిర్వహించబడేది. అలాగే బ్రీస్టాల్ట్ అనే మేధావి మాతృ స్వామిక కుటుంబ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఇక్కడ తల్లే పూర్తి బాధ్యత వహిస్తుంది. వారు ఏవిధంగా ప్రతిపాదించినా- రెండు ప్రతిపాదనల ఉమ్మడి సమిష్టి పనితనం బ్రహ్మాండంగా పనిచేస్తుంది. తల్లి,తండ్రి వీరు ఇరువురు ఉమ్మడి పనితనంతో తమ తమ విధులను తమ బాధ్యతలను సమిష్టిగా ఏక మనసుతో నిర్వహిస్తే సదరు గృహం స్వర్గసీమగ గుర్తించబడుతుంది. బండి నడిచేటప్పుడు జోడేడ్లు ఎలా సమన్వయంతో నడుస్తాయో అలా నడిస్తే ఇక తిరిగే లేదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, కుటుంబం అంటే భార్యా భర్త, వారి సంతానం, వారి వారి బాధ్యతలను తెలుసుకుంటూ స్పష్టత కలిగి పరస్పర సంబంధాలను శాశ్వతంగా కలిగి ఉండడమే కుటుంబం అవుతుంది. ఈ పోకడ గమనించబడకపోవడం వల్లనే అనేక సమస్యలు గమనించబడుతున్నాయి. ఉమ్మడిగా, ఏకతత్వంతో పని చేస్తే కుటుంబం ఖచ్చితంగా రాణిస్తుంది. కుటుంబానికి స్పష్టంగా కొన్ని విధులు పేర్కొనబడ్డాయి. అది ప్రత్యుత్పత్తి విధి, శ్రమ విభజన, ఆదాయం సమకూర్చుకోవడం, ఆస్తిని కాపాడుకోవడం, సామాజికీకరణ, సామాజిక నియంత్రణ, వారసత్వమార్పిడి, విద్యావిధులు మొదలైనవి ముఖ్యమైనవి. ప్రతి కుటుంబం కొంత ఆస్తిని కలిగి ఉంటుంది. సదరు ఆస్తి కాపాడబడేలా వృద్ధి చెందేలా ప్రవర్తించాలి. కుటుంబం సమాజంలో ప్రాథమిక సంస్థ అంటే సమాజంలో బాధ్యతయుతమైనది కావున విలువలను కలిగి ఉంటూ సమాజ ప్రమాణాలను పాటించాలి. అలాగే సాంప్రదాయాలను, విలువలను, ఆదర్శాలను ఒక తరం నుండి మరొక తరానికి అందించేది కుటుంబమే. మరి ముఖ్యంగా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యత కూడా కుటుంబాన్నిదే. విద్యా విషయంలో కుటుంబం ముఖ్యమైన విద్య ఏజెన్సీగా పరిగణించబడింది. ఈ వాస్తవాలను గుర్తెరిగి ప్రవర్తిస్తే కుటుంబం సమాజంలో రాణిస్తూ- మార్గదర్శిగా నిలుస్తుంది. కుటుంబ నిర్వహణ అనేది ఆషామాషీ వ్యవహారం కాదు. ఉమ్మడి భావంతో, తమ బాధ్యతలను సమన్వయంతో నిర్వహిస్తేనే గృహమే స్వర్గసీమగా ఉంటుంది. గృహ నిర్వహణ అనేది సమాజంలో ప్రతిబింబిస్తుంది.

డాక్టర్ ప్రభుదయాల్
మాజీ సెనేట్ మెంబర్ - కాకతీయ యూనివర్సిటీ
శాశ్వత సభ్యుడు - ఐఎటిఇ
మండల విద్యాశాఖ అధికారి - కొత్తగూడెం



# నా వీలునామా

ముస్లిం రచయితల సంఘం సభ్యులకు, ఇస్లాంవాద కవులకు, అబాబీలు కవులకు,సమస్త సాహిత్య ప్రపంచానికి మురసం వ్యవస్థాపకునిగా, తెలుగు సాహిత్యంలో ఇస్లాంవాదం ఆవిష్కర్తగా,అబాబీలు కవితా ప్రక్రియ రూపకర్తగా నా వీలునామా .

....కవి కరీముల్లా

ముస్లిం రచయితల సంఘం (మురసం)ఎందుకు స్థాపించానంటే?

తెలుగు భాషలో అనేక సాహిత్యోద్యమాలు వికాసం చెందాయి.ప్రతి దానికీ ఓ బలమైన చారిత్రక నేపథ్యం ఉంది.అనివార్యంనుండి ఏర్పడిన పరిస్థితులున్నాయి.ఏ సమాజమైనా సాంస్కృతికంగా చైతన్యవంతం చెందకుండా సామాజికంగా చైతన్యం చెందజాలదు.ప్రతి సమాజం ఆధునిక కాలాన్ని అర్థం చేసుకుంటూ మానవ వ్యక్తిత్వ,సమాజ నిర్మాణాన్ని ప్రోది చేసుకుంటూ,సశాస్త్రీయ,హేతుబద్ధమైన ఆలోచనల్ని ఆకళింపు చేసుకుంటూ ముందుకు సాగాలి.అప్పుడే ఏ సమాజమైనా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంది.సాహిత్యం ఏదైనా వరదలా పొంగి వరదలా అంతర్ధానం కాకూడదు.నిత్య సజీవ చలనశీలత కలిగిన ప్రవాహంలా ముందుకు సాగాలి.నిత్యం ప్రగతిశీల పరిణామం చెందుతూ బాహ్య, అంతర్గత సంస్కరణలు చేసుకుంటూ,సమస్యల్ని పరిష్కరించుకుంటూ బలమైన సాహిత్యోద్యమంగా కొనసాగాలి.దీనికో బలమైన సైద్ధాంతిక, తాత్విక భూమిక కావాలి.ముస్లింలకు ఇస్లాంను మించిన బలమైన సైద్ధాంతిక, తాత్విక భూమిక ఏముంది? అందుకే ఇస్లాంను మా సైద్ధాంతిక తాత్విక భూమికగా ప్రకటిస్తూ ఓ వైపు ఇస్లాంవాదాన్ని ఆవిష్కరిస్తూ ముస్లిం రచయితల సంఘం స్థాపించాను.ఇదే నేపథ్యం నుండి అబాబీలు అనే నూతన వచన కవితా ప్రక్రియనూ సృష్టించాను.ఈ మూడు ఘట్టాలు నా సాహిత్య జీవితంలో కీలకమైన ఘట్టాలు.అల్హాందులిల్లాహ్.నేను విద్యార్థి దశలో ఉన్నప్పుడు వామపక్ష భావజాల విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించిన అనుభవం ముస్లిం రచయితల సంఘం స్థాపనలోనూ,నిర్మాణంలోనూ నాకు ఉపకరించాయి.నాకు ఎప్పటికీ మతం కన్నా మానవత్వమే ముఖ్యం.ఇస్లాంను నేను ఓ మతంగా భావించను.సఫలీకృతమైన జీవన విధానంగా భావిస్తాను.నిజమైన ముస్లిం విశ్వమానవుడు.దేశంలో సామాజిక సమానత్వాన్ని కోరుకునే దళిత, బహుజన శక్తులన్నా, ఆర్థిక సమానత్వం కోరుకునే సోషలిస్టు శక్తులన్నా నాకెంతో ఇష్టం.ఈ రెండు భావనలు ముస్లింలకు చాలా సహజమైనవి.ఎందుకంటే మా ఇస్లామియా విశ్వాసంలో అవి అంతర్భాగాలే.అంతే గాక సాహిత్యంలో ఏ రోటికా పాట పాడే విధంగా సాగుతున్న కొందరు ముస్లిం సాహిత్యకారుల ఆలోచనలకు దిశానిర్దేశం చేయాలనే సత్సంకల్పం సంఘ స్థాపనలో మరో ఉద్దేశం.నానాటికీ ముస్లింలకు,ఇతర సమాజాలకు పెరుగుతున్న దూరం,ఒంటరౌతున్న ముస్లిం సమాజం కళ్ల ముందు కదలాడాయి.దేశంలో కనుమరుగవుతున్న లౌకిక, మతసామరస్యవిలువలు కాపాడుకోవాల్సిన ఈ తరుణంలో ముస్లిం రచయితల సంఘం కీలక పాత్ర పోషిస్తుంది.విభిన్న వర్గాల మధ్య సామరస్యం సాధించటం, ఇస్లాంపై, ముస్లింలపై నెలకొన్న అపోహలు తొలగించటం మా లక్ష్యంలో ఒక భాగమే.ప్రపంచ పెత్తందారీ, దోపిడీ శక్తులకు,వారి సామ్రాజ్యవాద ఆధిపత్యాలకు తలవంచని ముస్లిం సమాజం ఆటంకంగా మారింది.దీనికి మూలకారణం అల్లాహ్ కు తప్ప ప్రపంచంలోని మరే ఆధిపత్య శక్తికీ తలవంచరాదనే వీరి మూల విశ్వాసం.అందుకే వీరు దోపిడీ కుట్రలతో జియోనిస్టు శక్తులతో కుమ్మక్కయి దాదాపు అన్ని దేశాలలోనూ తమ మీడియా ద్వారా,యన్జీవో సంఘాల ద్వారా ఇస్లామోఫోబియా, ముస్లిం ఫోబియాతో ముస్లింలపై ద్వేషం పెంచి పోషిస్తుంటారు.మరీ ముఖ్యంగా తాయిలాలను,ఇస్లాంను విమర్శిస్తే అప్పనంగా వచ్చే కీర్తిప్రతిష్టల ఎరచూపి ముస్లిం విశ్వాసాలపై, సంస్కృతిపై ముస్లింల చేతే విభిన్న సాహిత్య, సాంస్కృతిక రూపాలలో దాడి చేయిస్తుంటారు.అలా దాడి చేసే వారిని సంస్కరణవాదులని ఆకాశానికెత్తి ప్రచారం కల్పిస్తుంటారు.ఇటువంటి జియోనిస్టు కుట్రలు తెలుగు సాహిత్యంలోనూ కొనసాగుతున్నాయి.అవసరమైతే ముస్లింలలో లేని కుల వ్యవస్థను సృష్టించి షియాలని,సున్నీలని, దూదేకులని, ఉర్దూ ముస్లింలని,ధోభీలని,ఘోడే వాలాలని,సయ్యదులుగా, షేకులుగా, మొఘలులుగా, పఠాన్ లుగా విడదీసి ముక్కలు చెక్కలు చేసి బలహీన వర్గాలని వీరి కుతంత్రం.ఈ కుట్రల్ని ముస్లిం రచయితల సంఘం ఆమోదించదు.ఇప్పటికీ సామ్రాజ్యవాదానికీ,దాని సంస్కృతికి లొంగకుండా పోరాడుతున్న సమాజం ముస్లిం సమాజం.అంతర్జాతీయ సామ్రాజ్యవాదం, దేశీయ మతతత్వ ఫాసిజం, పెట్టుబడిదారీ విధానం, ఆర్థిక దోపిడి,శ్రమ దోపిడీ, అంటరానితనం,కుల,మత వివక్షతలు మా ప్రధాన శత్రువులు.సమసమాజాన్ని, సామాజిక సమానత్వాన్ని ఆకాంక్షించే ప్రతి సోషలిస్టు, సెక్యులరిస్టు, బహుజన శిబిరాలు మాకు మిత్ర శిబిరాలే.మేం ఎవ్వరికీ వ్యతిరేకం కాదు.మా పట్ల వారి వైఖరి ఎలా ఉంటుందనేది మాకనవసరం.మాదైన దృష్టి కోణం నుండి ఏకీభావం ఉన్న అంశాలపై కల్సి పని చేస్తాం.అయితే మేం స్వతంత్రులం.ఎవ్వరికీ ఉపాంగాలము కాము.

మా లక్ష్యం విశ్వమానవ సౌభ్రాతృత్వం,ఆకలి, దోపిడీ లేని రాజ్యం.,పాలనలో కులమత వ్యత్యాసాల్లేని నిజమైన లౌకిక రాజ్యం.

సంస్కరణలకు మేం వ్యతిరేకం కాదు:

ముస్లింలలో పరలోకం తప్ప ఇహలోకం గురించి ఆలోచించని మత ఛాందసానికి మేం వ్యతిరేకం.ఇహలోకపు ఆచరణను బట్టే పరలోకం ఉంటుదని ఇస్లాం చెప్తోంది.చుట్టూ సమస్యలు ఉన్నప్పుడు వాటిని గాలి కొదిలి దుఆ చేస్తే దైవం కూడా క్షమించదు.నిత్యం హేతువుతో ఆలోచిస్తూ ముస్లిం సమాజం విద్యా, వైజ్ఞానిక రంగాలలో ప్రగతి సాధించాలనేది నా కోరిక.

"తనను తాను మార్చుకోనంత వరకూ అట్టి జాతి స్థితిని అల్లాహ్ కూడా మార్చడు"'-పవిత్ర ఖుర్‌ఆన్‌కనుక ముస్లింలు కేవలం దుఆలకే పరిమితం గాక అన్ని రంగాలలో స్వావలంబన సాధించే విధంగా , సామాజిక చైతన్యం సాధించే విధంగా కృషి చేయాలి.ఈ సామాజిక, సాహిత్య స్ఫూర్తిని విభిన్న సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో, సెమినార్ల రూపంలో మురసం కొనసాగిస్తుంది.మరీ ముఖ్యంగా" మహిళల హక్కుల విషయంలో మీరు దైవానికి భయపడండి .అని "ధర్మం ప్రకారం పురుషునికి గల అన్ని హక్కులు మహిళలకూ ఉన్నాయి...అని దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించారు.అంతేకాదు జ్ఞానార్జన స్త్రీ పురుషుల విధియై ఉన్నది అని పవిత్ర ఖుర్‌ఆన్ చెప్తోంది.కనుక మురసం చైతన్యంలో స్త్రీ మూర్తులది ప్రధానమైన పాత్రే.హిజాబ్ ముస్లిం స్త్రీల సాంస్కృతిక చిహ్నం కనుక దాన్ని నిషేధించి మెజారిటీ మత సంస్కృతిలో విలీనం చేసి ముస్లింల అస్థిత్వాన్ని చెరిపేయాలని పరివార్ శక్తులు కోరుకుంటున్నాయి.హిందూత్వ ప్రచార ప్రభావాలకు లోనై ఇస్లామోఫోబియా వల్ల కొన్ని ప్రగతిశీల భావాలు ఉన్న వారిగా నటిస్తున్న వారూ ఇదే కోరుకుంటున్నారు.ముస్లిం సంస్కృతిని అణిచివేసే క్రమంలో వీరిద్దరి మధ్య ఏకీభావం ఉంది.మేం విచ్చలవిడి సంస్కృతిని వ్యతిరేకిస్తాం.పటిష్టమైన మానవ సంబంధాలను, కుటుంబ వ్యవస్థను కోరుకుంటాం.ఇస్లాం వాదం హిజాబ్ అనేది స్త్రీల వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయంగా భావిస్తుంది..ఇస్లాం స్త్రీలకైనా,పురుషులకైనా నిండైన వస్త్రధారణ సూచిస్తుంది.ఎవరు ఏ వస్త్రధారణ చేసుకోవాలి,చేసుకోగూడదు అనే విషయం వారిష్టం.హిజాబ్ ధరించని కారణంగా ఎవరైనా ముస్లిం పురుషుల చేత దాడులకు గురైతే మురసం, ఇస్లాంవాదం బాధితుల పక్షం వహిస్తాయి.

"ధర్మం విషయంలో బలాత్కారానికి తావు లేదు"'-పవిత్ర ఖుర్‌ఆన్.ఎవరు ఏం తినాలి?ఏం తొడగాలి?ఎలా ఉండాలి అనేది ఆయా వ్యక్తుల ఇష్టం.వాటిల్లో బలవంతం అప్రజాస్వామికం.భిన్న మతాలు, కులాలు,జాతుల, సంస్కృతులున్న ఈ దేశం అందరిదీ.మేం కట్టుబొట్టు, దళిత, ఆదివాసీ, గిరిజన సంస్కృతుల్ని గౌరవిస్తాం.పుట్టిన కులం,మతం,ప్రాంతం,భాష కారణంగా మేం ఎవ్వరినీ ద్వేషించం.సమాజాన్ని వెనుకబాటుతనం వైపుకు నడిపించి హాని చేసే వాటిని తప్ప మేం దేనినీ వ్యతిరేకించం.ముస్లిం స్త్రీలు, పురుషుల ధరించే హిజాబ్, టోపీ,గడ్డం అస్థిత్వ చిహ్నాలు.ఇవి పాటించేవారు వెనుకబాటుతనం ఉన్న వారిగా భావించటం ఓ రకమైన ఉన్మాదం.పౌరసత్వ సమస్యలపై ముందుగా షాహిన్ బాగ్ లో కదం తొక్కింది ఈ హిజాబ్ ధరించిన మహిళలే.నాడు దేశ స్వాతంత్ర్యం కోసం కదం తొక్కింది ఈ హిజాబ్ మహిళలే.దేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న కారణంగా బ్రిటీష్ వారి చేతిలో చెట్లకు ఉరి తీయబడ్డ 3000 మంది మౌల్వీలు నాడు ఇస్లాం స్ఫూర్తితోనే బ్రిటిష్ వారిపై పోరాడారు.కనుక అందర్నీ ఒకే గాటన కట్టేసి మతఛాందసులని నిందించటం వెర్రితనం.హిందూ స్త్రీలు ధరించే చీర కాళ్లకడ్డం పడే బేడీలని,నన్స్ ధరించే డ్రెస్సులు హిజాబ్ వంటివేనని వచ్చే విమర్శల్ని సైతం మేం వ్యతిరేకిస్తాం.కానీ విచిత్రంగా ముస్లింల దగ్గరకు వచ్చేసరికి చాలామంది విమర్శలకు దిగుతారు.యూరప్ సృష్టించిన ఇస్లామోఫోబియా వీరి మెదళ్లలో తిష్ట వేసింది..కనుక ముస్లింల తిండి,ఆచార వ్యవహారాలు,తొడిగే బట్టలు ముస్లింల ఇష్టం.ఎప్పుడేది అవసరమో కాలానికి తెల్సు.అవసరమైన వాటిని చేర్చుకుంటుంది .అవసరం లేని వాటిని తిరస్కరిస్తుంది.ముస్లిం సమాజం శిలాసదృశ్యమైన సమాజమేమీ కాదు.చైతన్యరహిత సమాజం అంతకన్నా కాదు.ఇక విద్య విషయానికొస్తే

ముస్లిం రచయితల సంఘం మదరసాలలో ఆధునిక విద్యా వికాసాలను కోరుకుంటుంది.ధర్మాచరణకు సంబంధించిన నైతిక పాఠాలు నేర్పే ఓ పీరియడ్ కొనసాగిస్తూనే అన్ని భాషల్లోనూ,సైన్స్, సామాజిక శాస్త్రాలు బోధించాలని కోరుకుంటుంది.మరీ ముఖ్యంగా కుల మతాలకు అతీతంగా బహుజన మదరసాలు ఏర్పడాలనేది నా కోరిక.ఇందులో ఇస్లామియా బోధనలకు సంబంధించిన విషయంలో ముస్లిమేతర విద్యార్థులకు మినహాయింపు ఇవ్వాలి.అంటే కేవలం మదరసాలు లౌకికంగా నడవాలి.దీని వల్ల విద్యార్థులు ఒకరి సంస్కృతిని ఒకరు ఆకళింపు చేసుకుంటారు.పరస్పరం సోదరుల్లా కల్సి ఉంటారు.

"మీరు విద్య కోసం భూమి చివరి అంచులు వరకైనా వెళ్లండి"'-దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.ఉవాచ.పవిత్ర ఖుర్‌ఆన్లో మొదటి వాక్యం ఇఖ్రా (చదువు).అంటే ఇస్లాం విద్యకు ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో అర్థం చేసుకోవాలి.ముస్లిం సమాజం సంస్కరించుకోవాల్సిన కీలకమైన అంశాలపై కూడా ముస్లిం రచయితల సంఘం దృష్టి పెడుతుంది.తెలుగు,ఉర్దూ ముస్లింల మధ్య ఉన్న వివక్షతను తొలిగించే క్రమంలో పని చేస్తుంది.నీతులు, సూక్తులు చెప్పటం వేరు.ఆచరణ వేరు.ఆచరించటంలోనే నిజాయితీ ఉంటుంది.తెలుగు నూర్బాషా ముస్లింలతో వియ్యమందకుండా మనం చెప్పే నీతులు ఏమిటి?మహాప్రవక్త ముహమ్మద్ (స)కాలంలో నల్లగా ఉండే నీగ్రోలు అగ్రవర్ణ అరబ్బుల కింద బానిసలుగా ఉండేవారు .నీగ్రోలతో అరబ్బుల వివాహబంధాలను ప్రవక్త ప్రోత్సాహించారు.కానీ మనం మాత్రం సాకులు వెతుకుతున్నాం.చుట్టూ ఉన్న మనువాద వ్యవస్థ ప్రభావానికి గురై మురికిలోంచి దులపరించి లేచినా కంపు జాడల్ని పోగొట్టుకోలేని మన నటనల్ని ఇస్లాం ఆమోదించదు.ఈ విషయంలో జమాత్లు పూనుకోవాలి.ఈ క్రమంలో జమాత్ ల కృషి జరుగుతోంది.మరింత వేగవంతం కావాలి.ముస్లింలు నివసించే ప్రతి గ్రామంలో,పట్టణంలో జుమ్మా ప్రసంగం తెలుగులో జరిగే ఒక మస్జిదైనా ఖచ్చితంగా ఉండేటట్లు జమాఅత్లు పూనుకోవాలని నా విన్నపము.దామాషా ప్రకారం ముస్లింల హక్కుల విషయంలో పోరాడేటప్పుడు ముస్లింలందరి ఉమ్మడి పోరాటం ఉండాలి.ఉర్దూ భాషను తెలుగు ముస్లింలపై బలవంతంగా రుద్దరాదు.తెలుగు ముస్లింల హక్కులు వేరు.ఉర్దూ ముస్లింలు హక్కులు వేర్వేరు కాదు.ఇప్పుడు కావాల్సింది ప్రత్యేక పోరాటాలు కాదు.ఉమ్మడి పోరాటాలు.ఈ క్రమంలో వివక్షతను రూపుమాపే సాహిత్య పోరాటం ముస్లిం రచయితల సంఘం చేస్తుంది.మరొక ముఖ్యమైన అంశం ప్రతి జమాఅత్ ఎవరి కార్యాచరణను వారు చేసుకుంటూనే ఓ ఉమ్మడి జమాఅత్ గా ఏర్పడాలి.జమాఅత్లు తమ మధ్య ఉన్న సైద్ధాంతిక విభేధాలను పక్కన పెట్టి ఐక్యతపై, సామాజిక సమస్యలపై దృష్టి పెడితే సమాజంలో ఐక్యత పెరిగి సమస్యలు పరిష్కారం అవుతాయి.మన ఇజ్తెమాలు కేవలం ఆధ్యాత్మిక విషయాల చుట్టూరే కాకుండా సామాజిక విషయాల పట్ల కూడా అవగాహన కలిగించే విధంగా ఉండాలి.దీనికి సంబంధించిన సాహిత్య, సాంస్కృతిక చైతన్యాన్ని ముస్లిం రచయితల సంఘం పెంపొందిస్తుంది

తెలుగు భాషలో ముస్లింలు మరింత ముందుకు దూసుకెళ్లాలి.తుపాకీ శరీరాన్ని వశం చేసుకుంటుంది.కానీ భాష ఆత్మను వశం చేసుకుంటుంది.ఒక్క తెలుగే కాదు ఈ భూమండలంపై ఉన్న సమస్త భాషలు మనవే.నిజమైన ముస్లింకు కులం,మతం,భాష,ప్రాంతం లేవు.

కొంతమంది బ్రాహ్మణులు, యూదులు దైవజనులని నమ్ముతారు.కానీ ఇస్లాం సమస్త ప్రజలు దైవజనులని అని చెప్తుంది.కనుక తెలుగును నిర్లక్ష్యం చేయడం అంటే ప్రపంచంలో ఉన్న 15 కోట్ల మంది ప్రజల్ని నిర్లక్ష్యం చేయడమే.

"భూమిపై ప్రవక్తలను పంపని జాతి లేదు "అని ఇస్లాం బోధిస్తుంది. స్వయాన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తన సహచరులకు ప్రాంతీయ భాషలు నేర్చుకోమని ప్రోత్సహించారు. ఈ ఇస్లామియా విశాలతత్వాన్ని వదిలి భాషా చట్రాల్లో కూరుకుపోయాం.అందుకే ముస్లిం రచయితల సంఘం తెలుగు భాషలో తెలుగు సాహిత్యకారుల్ని తయారు చేసుకునే గొప్ప సాహిత్య సంఘంగా రూపాంతరం చెందుతుంది.ఈ కృషి ఫలితంగానే తెలుగు సాహిత్యంలో ఎందరో ఇస్లాంవాద కవులు, రచయితలు, అబాబీలు కవులు తయారయ్యారు.ఈ విషయంలో కవిగానూ, వ్యక్తిగతంగానూ జీవితంలో కొన్ని కోల్పోవాల్సివచ్చినప్పటికీ రేపటి తరాన్ని తయారు చేయాలనే బలమైన ఆకాంక్ష వల్ల ఈ కార్యక్రమం కొనసాగుతోంది. అల్హాందులిల్లాహ్.ముస్లిం రచయితల సంఘం అన్ని రకాల పీడనలకు వ్యతిరేకం.పీడితుని ఆర్తనాదానికి భయపడండి అని ప్రవక్త (స) చెప్పారు.మేం రాజ్యహింసను వ్యతిరేకిస్తాం.కులమత దౌర్జన్యాలను నిరసిస్తాం.ఈ విషయంలో ముస్లింల వైపు తప్పు జరిగినా ఖండించడానికి వెనుకాడం."అన్యాయంగా ఏ వ్యక్తి ఏ వ్యక్తిని హత్య చేసినా అతను సమస్త మానవ జాతిని హత్య చేసినట్లే.ఏ వ్యక్తి ఏ వ్యక్తిని రక్షించినా అతను సమస్త మానవ జాతిని రక్షించినట్లే"'-పవిత్ర ఖుర్‌ఆన్‌ఇంకా ముస్లిం రచయితల సంఘం ప్రజా కళలను నిర్మిస్తుంది.అక్షరమేదైనా అక్షరమే కావచ్చు.కళ ఏదైనా కళే కావచ్చు.కానీ అన్నీ ఒకటి కావు.పాలకులకు, దోపిడీకీ ముస్లిం రచయితల సంఘం వంత పాడదు.మా అక్షరాలన్నీ పేద ప్రజల పక్షం.పీడితుల పక్షం.మేం ప్రతి వేదికను,సన్నివేశాన్ని మా భావ వ్యక్తీకరణకు ఉపయోగించుకుంటాం.శాంతితో,క్రాంతితో, ఓర్పుతో, నేర్పు తో మా ప్రయాణం సాగుతుంది.ముస్లిం రచయితల సంఘం స్థాపించటంలో నా ఉద్దేశ్యాలు, లక్ష్యాలు ఇవి.ముస్లిం రచయితల సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడిగా నా భావనలు ఇవి.దీన్ని అందిపుచ్చుకునే భావి తరం ఈ ఆశయాలకు అనుగుణంగా ముస్లిం రచయితల సంఘంను ముందుకు తీసుకెళ్లాలని నా ఆకాంక్ష.ఇది తెలుగు ముస్లిం సమాజానికి, సాహిత్య ప్రపంచానికి, ఇస్లాంవాద కవులు రచయితలు, అబాబీలు కవులకు నేను రాసే వీలునామా...

- కవి కరీముల్లా



శిరోజాల రాలడం, చుండ్రు వంటి సమస్యలకు బియ్యం నీళ్లు మంచి పరిష్కారంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఫెర్మెంటెడ్ బియ్యం నీటిని వారానికి రెండుసార్లు ఉపయోగిస్తే కురులు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరుగుతాయని సూచిస్తున్నారు.ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.
ఇలా తయారు చేసుకోవాలి...ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.

## బియ్యం నీళ్లు చేసే అద్భుతం..

బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
సోమవారం
05 . మే . 2025


# భార్యాభర్తల మధ్య ఏజ్ గ్యాప్ ఎంతుండాలి..



ఇదివరకటి రోజుల్లో పెళ్లిళ్లు పెద్దలు కుదిర్చేవారు. తల్లిదండ్రులు ఎవర్నీ పెళ్లి చేసుకోమంటే వారినే చేసుకునేవారు. కానీ, ఇప్పుడు ఇష్టమైన వారిని చేసుకుంటున్నారు. అదేవిధంగా, వయసు అనేది ఇదివరకూ భార్యకంటే భర్త కనీసం ఐదేళ్లపైనే పెద్దగా ఉండేవారు. కానీ, ఇప్పుడు అసలు వయసుతో సంబంధమే లేదు. అసలు భార్యాభర్తల మధ్య ఏజ్ గ్యాప్ ఎంతుండాలి.
భార్యాభర్తల మధ్య ఏజ్ గ్యాప్ ఎంతుండాలి, పెద్ద వయసున్న వారిని పెళ్లిచేసుకోవడం సరైనదేనా
భార్యాభర్తలు మధ్య వయసు తేడా అనేది ఒకేలా ఉండదు. కొందరికీ 2 సంవత్సరాల తేడా ఉంటే కొందరికీ 5, ఇంకొంతమందికి 10 ఏళ్ల గ్యాప్ కూడా ఉంటుంది. సాధారణంగా ఆడవారి కంటే మగవారు ఎక్కువ వయసు ఉండాలంటారు. కానీ, ఇప్పుడు చాలా మంది దీనిని పట్టించుకోవడమే లేదు. భార్యల కంటే భర్తల వయసు తక్కువగా ఉన్నా పెళ్ళిళ్లు చేసేసుకుంటున్నారు. ఈ విషయంలో చాలా మంది ఎన్నో డిస్కషన్స్ పెడుతుంటారు. వయసు తేడా అనేది ఎంతుండాలని పెద్ద పెద్దగా చర్చలు చేస్తుంటారు.

**10 కంటే ఎక్కువ వయసు తేడా**

20 సంవత్సరాలు అలా తేడా ఉండడం అస్సలు మంచిది కాదు. దీని వల్ల అభిప్రాయాల్లో, ఆశయాల్లో, లక్ష్యాల్లో చాలా తేడాలు వస్తాయి. అన్నింటికంటే ఎక్కువగా పిల్లల్ని కనడంలో చాలా సమస్యలొస్తాయి. వారి ఆలోచనా విధానంలో తేడా ఎక్కువగా ఉంటుంది.

**10 సంవత్సరాల తేడా**

భార్యాభర్తల మధ్య 10 సంవత్సరాల తేడా ఉంటే ప్రేమ, అండర్‌స్టాండింగ్ బాగుంటుంది. వారి జీవిత లక్ష్యాలు, ఆశయాలు, దృక్పథాలు కలిసిఉన్నప్పుడు 10 సంవత్సరాల అంతరం తేడాగా ఉండకపోవచ్చు. కొని కొంతమందికి ఇది నచ్చకపోచ్చు. ఎదుటివారు అర్థం చేసుకున్నప్పటికీ వారిని తక్కువ చేసి చూడొచ్చు. దీని వల్ల సమస్యలొచ్చే అవకాశం ఉంది.



**వయసు తేడా ఉంటే**

వయసు తేడా ఉన్న జంటల మధ్య తక్కువగా గొడవలు, వాదనలు, అపార్థాలు వస్తుంటాయి. ఎందుకంటే ఆల్రెడీ పెద్దవయసు ఉన్నవారు సమస్యని అర్థం చేసుకుని కాపురం కాపాడుకునే ప్రయత్నం చేస్తారు. వయసు తేడా ఉన్నవారు ఒకర్నొకరు త్వరగా అర్థం చేసుకుంటారు.

**తక్కువ వయసు తేడా అంటే ఏం కాదు**

నిజానికి తక్కువ వయసు తేడా ఉంటే పెద్దగా సమస్య రాదు. కానీ, 10 కంటే ఎక్కువగా, 20 సంవత్సరాలు అలా తేడా ఉంటే చాలా సమస్యలొస్తాయి. సాధారణంగా పెద్దలు కుదిర్చిన పెళ్లిలో 3, 5 సంవత్సరాల తేడా ఉంటుంది. కానీ, ప్రేమ పెళ్లిళ్లలో మాత్రం భార్య, భర్తల వయసు సమానంగా ఉంటుంది. కొన్నిసార్లు భార్యే పెద్దగా ఉంటుంది. అయితే, ఇద్దరి మధ్య అవగాహన, ప్రేమ ఉంటే మాత్రం ఈ వయసుతో గొడవలు రావని కొంతమంది చెబుతున్నారు.

# అల్లంతో ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు!




ఆరోగ్యాన్ని ఎంతగానో పరిరక్షించే అల్లంను ) తీసుకోవడం అందరికి అంతగా ఇష్టం ఉండదు. కానీ ఆరోగ్యపరంగా అల్లం చేసే మేలు అంతా ఇంతా కాదు. అల్లంలో ఎన్నోఔషధ గుణాలు దాగున్నాయి. సాధారణంగా మన వంటింట్లో అల్లం ఓ ముఖ్య మైన పదార్థం. ఈ వర్షాకాలంలో అల్లంను సేవించడం వలన జలుబు, దగ్గు, ఆయాసం నుంచి ఉపశమనం పొందుతారు. ఈ అల్లం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం..
అల్లంలో ఉండే యాంటీ ఇన్ ఫ్లమ్మేటరీ గుణాలు ఆర్థ్రయిటీస్ నొప్పుల నుంచి ఉపశమనాన్ని ఇస్తాయి.
వేవిళ్ల కారణంగా వాంతులతుంటే చిన్న అల్లం ముక్క బుగ్గన పెట్టుకుని రసం మింగుతుంటే ఆ ఇబ్బంది తొలగిపోతుంది.
మైగ్రేన్ తలనొప్పితో బాధ పడేవారు రోజూ ఆహారంలో అల్లం ఉండేలా చూసుకోండి. మైగ్రేన్‌కి కారణమైన ప్రోస్టాగ్లాండిన్ల ఉత్పత్తిని అల్లం సమర్థంగా అడ్డుకుంటుంది.
అల్లాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి ఉప్పు కలిపి కొద్ది రోజుల పాటు ఊరనివ్వండి. ఆ తర్వాత ఆ ముక్కలను రోజుకు రెండు మూడు చొప్పున తింటే జీర్ణ శక్తి, ఆకలి పెరుగుతాయి.
అల్లం టీ తాగుతే రుతుస్రావ సమయంలో కడుపునొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
కడుపులో మంటకూ ఉదరక్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్.పైలోరి బ్యాక్టీరియా అల్లం ఉన్న చోట ఉండలేదు.
మిచిగాన్ యూనివర్సిటి తాజా పరిశోధనల ప్రకారం అల్లంలో గర్భాశయ క్యాన్సర్ నిరోధక గుణాలున్నాయి.
అల్లం తీసుకోవడం ద్వారా ఒత్తిడిని తగ్గించడంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.




# కురులంటే కేర్‌లెస్సా!?

'వేసవి'లో చర్మ సంరక్షణకే అధిక ప్రాధాన్యత ఇస్తారు. సన్‌స్క్రీన్ లోషన్స్, మాయిశ్చరైజర్స్ అంటూ ఎన్నెన్నో టిప్స్ ఫాలో అవుతుంటారు. కురుల విషయంలో మాత్రం కేర్‌లెస్‌గా ఉంటారు. అయితే.. వేసవి వేడి వెంట్రుకల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని సౌందర్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెమట వల్ల కుదుళ్లలో సమస్యలు వస్తాయని చెబుతున్నారు. ఇక ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం వాడే కూలర్లు, ఏసీలు జుట్టును నిర్జీవం చేస్తాయని అంటున్నారు. అందుకే.. వేసవిలోనూ జుట్టు సంరక్షణ చూసుకోవాలని సలహా ఇస్తున్నారు.ఉసిరి : ఎండకు జుట్టు పొడి బారుతుంది. చివర్లు చిట్లడంతోపాటు జుట్టు కూడా ఎక్కువగా రాలుతుంది. ఈ సమస్యకు ఉసిరి సమర్థంగా చెక్ పెడుతుంది. గుప్పెడు ఉసిరికాయలను తీసుకుని మెత్తగా రుబ్బుకోవాలి. ఈ ముద్దను కుదుళ్లకు పట్టించి.. మృదువుగా రుద్దుకోవాలి. తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయాలి. ప్రతి తలస్నానానికి ముందు ఇలా చేస్తే.. జుట్టు రాలే సమస్య అదుపులోకి వస్తుంది.తేనె : పావు కప్పు తేనెను ఒక గిన్నెలో తీసుకొని.. సన్నని మంటపై గోరువెచ్చగా వేడిచేయాలి. అందులో పావు కప్పు ఆలివ్ లేదా కొబ్బరినూనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టేలా బాగా అప్లయి చేయాలి. తర్వాత వేడినీటిలో ముంచిన టవల్‌ను నెత్తికి చుట్టుకోవాలి. అరగంట తర్వాత తక్కువ గాఢత కలిగిన షాంపూతో తలస్నానం చేయాలి. ఈ ప్యాక్.. పొడిబారిన జుట్టుకు తిరిగి జీవం పోస్తుంది.మినపపప్పు : అర కప్పు మినపపప్పులో ఒక టీస్పూన్ మెంతులు కలిపి మెత్తని పొడిలా చేసుకోవాలి. దీనికి అర కప్పు పెరుగు కలిపి.. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించాలి. అరగంట అలాగే వదిలేసి.. తక్కువ గాఢత ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. వెంట్రుకల చివర్లు చిట్లడాన్ని తగ్గించడంలో మెంతులు సాయపడతాయి. ఇక మినపపప్పు.. కుదుళ్లను బలంగా మార్చడంతోపాటు జుట్టు పొడవుగా పెరిగేలా చేస్తుంది.కోడిగుడ్డు : ఒక గిన్నెలో కోడిగుడ్లలోని ఒక తెల్లసొన, రెండు పచ్చసొనలు తీసుకోవాలి. దీనికి ఒక టీస్పూన్ నిమ్మరసం, ఒక టీస్పూన్ తేనె జోడించి.. బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు రాసుకొని.. పావుగంట తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి. కోడిగుడ్డు జుట్టుకు పోషణనిస్తే.. కురులు కోల్పోయిన తేమను తేనె తిరిగి అందిస్తుంది.



# క్యాన్సర్లను తరిమికొట్టే దానిమ్మ!



దానిమ్మ పండును క్రమం తప్పకుండా తినడం అంటే క్యాన్సర్‌ను దూరంగా తరిమికొట్టడమే. దానిమ్మలో ఉండే ప్యూనికలాజిన్ అనే అత్యంత శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఇందుకు కారణం. దానిమ్మలో విటమిన్ కె విటమిన్ బి5లతో పాటు విటమిన్ సి ఎక్కువ. ఫలితంగా దీన్ని తినడం వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, కోలన్ క్యాన్సర్, లుకేమియా వంటి అనేక క్యాన్సర్లు నివారితమవుతాయి. క్యాన్సర్ నివారణ మాత్రమే కాకుండా దానిమ్మతో ఇంకా అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వాటిల్లో ఇవి కొన్ని...
?దానిమ్మలో ఫ్లేవనాయిడ్స్, పాలీఫీనోల్స్, అనేక యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్నాయి. ఇవన్నీ మనకు శక్తిమంతమైన రోగనిరోధక శక్తిని సమకూరుస్తాయి.
?దానిమ్మలో పీచుపదార్థం సమ ృద్ధిగా ఉంటుంది. అది జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మలబద్ధకం వంటి సమస్యలను దరిచేరనివ్వదు.
?డయాబెటిస్ రోగులకు ఎన్నో పండ్ల మీద ఆంక్షలుంటాయిగానీ.. దానిమ్మ విషయానికి వస్తే డయాబెటిస్ రోగులు దానిమ్మ తినాలంటూ డాక్టర్లే సూచిస్తారు.
?బరువు తగ్గించుకోవాలనుకున్నవారికి దానిమ్మ మంచి పండు. అది కొవ్వులను అదుపులో ఉంచి బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది.
?కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుతుంది. రక్తప్రసరణను మెరుగుపరచడం ద్వారా ఇది ఇస్కిమిక్ కరోనరీ హార్ట్ డిసీజ్ వంటి గుండెజబ్బులను నివారిస్తుంది. గుండె సంబంధ సమస్యలతో బాధపడుతున్న వాళ్లు రోజూ ఒక గ్లాసు దానిమ్మరసం తీసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి.
-ఇది అధిక రక్తపోటు, అర్థరైటిస్, కీళ్లనొప్పులు, గుండెజబ్బులను నివారిస్తుంది.
-దానిమ్మ వల్ల చర్మానికి మంచి నిగారింపు వస్తుంది. చర్మకణాల ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. వయసు పెరిగేకొద్దీ కనపడే ముడతలు, మచ్చలు, గీతలను నివారిస్తుంది. అందుకే దానిమ్మపండు తినేవారు దీర్ఘకాలం యౌవనంతో కనిపిస్తారు.

# జలుబుకు ఏ సూప్ మంచిదంటే!



వాతావరణంలో మార్పులు మన శరీరం మీద ప్రభావం చూపుతాయి. అవి, జలుబు, ఒళ్ళు నొప్పులతో కూడిన జ్వరం, దగ్గు రూపంలో బాధిస్తాయి. ఈ సమస్యల నుంచి ఉపశమనానికి, రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ఇంట్లోనే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, జ్వరం, దగ్గు సమస్యల ఉపశమనానికి...
చికెన్ సూప్: ఉల్లికాడలు, ఉల్లిపాయలు, మిరియాల పొడి కలిపి తయారుచేసుకున్న చికెన్ సూప్ జలుబు, జ్వరం, దగ్గు వంటి సమస్యలకు త్వరగా ఉపశమనం ఇస్తుంది.
మష్రూమ్/పాల కూర సూప్: శాకాహారులు పుట్టగొడుగులు, పాలకూరలతో సూప్‌లను తయారుచేసుకోవచ్చు. దీంట్లోనూ ఉల్లికాడలు, మిరియాలు, వెల్లుల్లి, జిలకర్ర కలిపి తయారుచేసుకొని సేవించాలి.
సూప్‌లు ఏ సమయంలోనైనా వేడి వేడిగా తీసుకుంటే రుచిగానూ ఉంటాయి. అనారోగ్యసమస్యల నుంచి సత్వర ఉపశమనం లభిస్తుంది.

**వ్యాధి నిరోధక శక్తి పెరగాలంటే...**

రోజూ ఉదయం అల్పాహారంతో పాటు ఒక గ్లాసు ఆరెంజ్ జ్యూస్ తీసుకోవాలి. దీంట్లో ఉండే 'సి' విటమిన్, యాంటీయాక్సిడెంట్లు రోగనిరోధకశక్తిని పెంచుతాయి.
ఈ సీజన్‌లో నీటి కాలుష్యం ఎక్కువ. వడకట్టడం, మరిగించి చల్లార్చిన నీళ్లు తాగడం వంటి జాగ్రత్తలు తీసుకోకపోతే విరేచనాలు అవుతుంటాయి. ఈ సమస్య దరిచేరకుండా ఉండాలంటే పెరుగు, మజ్జిగ వంటి ద్రవాలు తీసుకుంటూ ఉండాలి.
వారానికి ఒకరోజు లేదా 15 రోజులకొకసారి ఉపవాసం ఉండాలి. అంటే పూర్తిగా ఆహారం తీసుకోకుండా కాదు. ఆ రోజు మొత్తం కూరగాయలు, పండ్లు, పళ్ల రసాలు, నీళ్ల మీదే ఉండాలి. వేరే ఇతర ఆహార పదార్థాలేవీ తీసుకోకూడదు. దీని వల్ల శరీరంలో మలినాలు తొలగి, జీర్ణవ్యవస్థ పనితీరు చురుకు అవుతుంది. శరీరానికి అవసరమయ్యే మంచి బ్యాక్టీరియా శాతం పెరిగి అనారోగ్యసమస్యలు దరిచేరవు.
ఆరెంజ్ జ్యూస్, దానిమ్మ జ్యూస్‌లు ఈ కాలం చాలా మంచివి.
ఈ కాలం మూత్రవ్యవస్థకు సంబంధించిన సమస్యలు, ఇన్ఫెక్షన్లు అధికంగా వస్తుంటాయి. అలాగే - ఊపిరితిత్తులు, ముక్కుకు సంబంధించినవి, మలబద్ధకం సమస్యలకు అవకాశాలు ఎక్కువ. రోజులో 2-3 లీటర్లు శుభ్రమైన నీళ్లు సేవిస్తే యూరిన్ ఇన్ఫెక్షన్ల సమస్య ఉండదు. పీచు పదార్థాలు ఎక్కువ ఉండే పదార్థాలు తినడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే విరేచనం సాఫీగా అవుతుంది.
కాయగూరల్లో బీట్‌రూట్, క్యారెట్ వంటి సూప్‌లను ఎర్రకందిపప్పును ఉపయోగించి తయారుచేసుకోవాలి. ఇది సలాడ్‌లా తయారుచేసుకొని భోజనంలా కూడా తినవచ్చు. టొమాటో రసం, టొమాటో పప్పు.. టొమాటోతో కూడిన వంటకాలు ఎక్కువ తీసుకుంటే ఆరోగ్యకరం.
జీర్ణకోశం నుంచే రోగనిరోధక కణాలు పుడుతూ ఉంటాయి. అందుకని జీర్ణకోశాన్ని ఎంత జాగ్రత్తగా ఉంచుకుంటే ఈ కాలం అంత ఆరోగ్యంగా ఉంటాం అనే విషయాన్ని విస్మరించకూడదు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in


# ఎస్‌బీఐ లాభం రూ.18,642 కోట్లు




**న్యూఢిల్లీ-నవభూమి:** మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఎస్‌బీఐ స్టాండ్‌ఎలోన్ నికర లాభం రూ.18,642 కోట్లకు పరిమితమైంది. 2023 -24 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.20,698 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం తగ్గింది. మొండి బాకీలు, ఇతర అవసరాల కోసం కేటాయింపులు గణనీయంగా పెరగడంతో పాటు నికర వడ్డీ మార్జిన్ తగ్గ డం ఇందుకు ప్రధాన కారణం. బ్యాంకు మొత్తం ఆదాయం మాత్రం రూ.1,28,412 కోట్ల నుంచి రూ.1,43,876 కోట్లకు పెరిగింది. అందులో వడ్డీ ఆదాయం రూ.1,11,043 కోట్ల నుంచి రూ.1,19,666 కోట్లకు ఎగబాకింది. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) వార్షిక ప్రాతిపదికన 2.7 శాతం వృద్ధితో రూ.42,774.55 కోట్లకు చేరగా.. నికర వడ్డీ మార్జిన్ (ఎన్‌ఐఎం) మాత్రం 0.32 శాతం తగ్గి 3.15 శాతానికి పరిమితమైంది. గత 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.15.90 డివిడెండ్ ప్రకటించింది. గడిచిన 12 ఏళ్లలో ఎస్‌బీఐ చెల్లించబోయే అత్యధిక డివిడెండ్ ఇదే. మరిన్ని ముఖ్యాంశాలు..

క్యూ4లో ఎస్‌బీఐ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 8 శాతం తగ్గి రూ.19,600 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.1,79,562 కోట్లకు పెరిగింది.



## ఆర్డినెన్స్ కంపెనీల్లో ఉద్యోగుల లీవులు రద్దు




**న్యూఢిల్లీ-నవభూమి:** హహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో భారత్‌లో రక్షణ సంబంధిత వస్తువులను ఉత్పత్తి చేసే కంపెనీలు ( అప్రమత్తమయ్యాయి. నిరంతరాయ ఉత్పత్తి, సన్నద్ధతకు తగిన చర్యలు చేపడుతున్నాయి. తమ ఉద్యోగుల దీర్ఘ కాల సెలవులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లాలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఖమరియా (ఓఎఫ్‌కే) తమ అధికారులు, ఉద్యోగులకు రెండు రోజులకు మించి సెలవులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఉత్పత్తి టార్గెట్ల దృష్ట్యా లాంగ్ లీవ్స్ రద్దు చేస్తున్నట్టు పేర్కొంది. భారత సాయుధ బలగాలకు ఆయుధ సామగ్రిని సరఫరా చేసే అతిపెద్ద యూనిట్లలో ఇది ఒకటి. ఇందులో 4,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఉత్పత్తి లక్ష్యాల దృష్ట్యా తాము తీసుకున్న ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వచ్చినట్టు ఓఎఫ్‌కే పీఆర్‌ఓ అవినాష్ శంకర్ ధ్రువీకరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో, ఏప్రిల్‌లో తాము ఇంకా టార్గెట్ రీచ్ కాలేదని, ఇందుకు అవసరమైన సిబ్బంది, పర్యవేక్షణల దృష్ట్యా సెలవులను రద్దు చేయాలని హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదేశాలు వచ్చినట్టు చెప్పారు. మహారాష్ట్రలోనూ..జబల్‌పూర్ తరువాత మహారాష్ట్రలోని చంద్రపూర్‌లోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కూడా ఇదే తరహా ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగుల లీవులు తక్షణం రద్దు చేశామని, సాధ్యమైనంత త్వరగా ఉగ్యోగులు విధుల్లోకి చేరాలని చీఫ్ జనరల్ మేనేజర్ ఒక ఉత్తర్వులో పేర్కొన్నారు. మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అదేశాల మేరకు సెలవులు రద్దు చేశామని, తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపారు. జాతీయ భద్రత, ఆపరేషనల్ అర్జెన్సీ దృష్ట్యా ఈ ఆదేశాలు జారీ చేశామని, వీటిని తూ.చ. తప్పకుండా పాటించాల్సి ఉంటుందని, లేని పక్షంలో దీనిని తీవ్రంగా పరిగణించడం జరుగుతుందని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

## అయ్యో.. భారతీయ డిజిటల్ కంటెంట్ క్రియేటర్ల పరిస్థితి ఇదా.. తాజా నివేదికలో కీలక వివరాలు



**న్యూఢిల్లీ-నవభూమి::** ప్రస్తుతం భారత్‌లో కంటెంట్ క్రియేటర్ల హవా నడుస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా వీరిని రకరకాల కార్యక్రమాలతో ప్రోత్సహిస్తోంది. అనేక మంది యూట్యూబ్, ఇన్‌స్టా వంటి వేదికల ద్వారా డబ్బు సంపాదించడానికి ఉవ్విళ్లూరుతూ ఈ రంగంలో కాలుపెడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత కంటెంట్ క్రియేటర్ల సంపాదనపై బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ఓ నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం, భారత్‌లో సుమారు 2.5 మంది డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు నిత్యం వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే వీరిలో కేవలం 8 నుంచి 10 శాతం మంది మాత్రమే తమ కంటెంట్‌ను సరిగ్గా మానెటైజ్ చేసుకుని ఆదాయం పొందగలుగుతున్నారు. మిగతా అందరూ చాలా స్వల్పస్థాయిలో ఆదాయం పొందుతున్నారు. కొందరికి రిక్తహస్తాలే మిగులుతున్నాయి. కంటెంట్ క్రియేటర్లు ఎక్కువైపోవడమే ఈ పరిస్థితికి కారణం. వ్యూవర్స్‌ను ఆకర్షించేందుకు మిలియన్ల కొద్దీ కంటెంట్ క్రియేటర్లు ప్రయత్నిస్తున్నా కొందరు మాత్రమే సుస్థిర ఆదాయాన్ని పొందగలుగుతున్నారు. చాలా మందికి యాడ్‌లు, బ్రాండ్ స్పాన్సర్‌షిప్స్‌యే ప్రధాన ఆదాయ మార్గాలు. కానీ ఇవి టాప్ కంటెంట్ క్రియేటర్లకు ఎక్కువగా అందుబాటులో ఉంటున్నాయి.

కంటెంట్ క్రియేటర్ల మధ్య ఆదాయంలో తేడాలు కూడా భారీగా ఉంటున్నాయి. అధికశాతం కంటెంట్ క్రియేటర్లు ప్రస్తుతం నెలకు రూ.18 వేలు సంపాదిస్తున్నారు. చిన్న స్థాయి కంటెంట్ క్రియేటర్ల వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ3.8 లక్షలు. ఇక మిలియన్ మంది కంటే ఎక్కువ సబ్‌స్క్రైబర్లు ఉన్న వారు వీక్షకులను బాగా ఆకట్టుకుంటున్నారు. తమ కంటెంట్‌తో జనాలను కట్టిపడేస్తూ బ్రాండ్ అండార్స్‌మెంట్స్, ఇతర మార్గాల్లో నెలకు రూ.50 వేల కంటే ఎక్కువే సంపాదిస్తున్నారు. కానీ ఇలాంటి కంటెంట్ క్రియేటర్ల సంఖ్య చాలా తక్కువ. భారత్‌లో ప్రతి 1000 వ్యూస్‌కు యాడ్ ద్వారా వచ్చే ఆదాయం రూ.50 నుంచి రూ.200 మధ్య ఉంటోంది. అంటే లక్ష వ్యూస్ వచ్చినా కూడా ఆదాయం మాత్రం రూ.5500 నుంచి రూ.20 వేల మధ్యే ఉంటున్నట్టు నివేదికలో తేలింది.

## సెలవుల సంతోషానికి సురక్షిత రక్షణ..ట్రావెల్ ఇన్సూరెన్స్

**న్యూఢిల్లీ-నవభూమి:**సాధారణంగా అనేక మంది కూడా వీకెండ్ వస్తే చాలు టూర్లకు ప్లాన్ చేస్తుంటారు. మరికొంత మంది ప్రతి నెలలో కూడా లాంగ్ టూర్లకు వెళ్తుంటారు. అలాంటి సమయాల్లో అప్పుడప్పుడు ప్రమాదాలు కూడా జరుగుతుంటాయి. రోడ్డు లేదా అగ్ని ప్రమాదం వంటివి జరుగుతుంటాయి. కానీ ఇలాంటి సమయంలో ముందుగానే ట్రావెల్ ఇన్సూరెన్స్ తీసుకుంటే ఎలాంటి భయాందోళన లేకుండా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం ద్వారా అనేక సౌకర్యాలను పొందవచ్చని అంటున్నారు. ఈ క్రమంలో ఫ్లైట్ ఆలస్యం,లగేజ్ మిస్సింగ్, వైద్య అత్యవసర పరిస్థితి వంటి సమస్యలు ఎప్పుడైనా తలెత్తవచ్చు. ఇటువంటి సందర్భాల్లో ట్రావెల్ ఇన్సూరెన్స్ మీకు రక్షణ కల్పిస్తుందని చెబుతున్నారు. చాలా మంది పర్యాటకులు దీనిని పట్టించుకోకపోయినా ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇది చక్కగా ఉపయోగపడుతుంది. ట్రావెల్ ఇన్సూరెన్స్ మీ ప్రయాణంలో మనశ్శాంతిని అందిస్తుంది. ఇది కేవలం మీ ట్రావెల్ ఇన్వెస్ట్‌మెంట్‌ను రక్షించడమే కాకుండా, అనుకోని పరిస్థితుల్లో మీకు ఆర్థిక భద్రతను కూడా అందిస్తుంది. ట్రావెల్ ఇన్సూరెన్స్ ద్వారా మీ జీవితంలో అనుకోనివి జరిగినప్పుడు మీకు రక్షణ కవచం పనిచేస్తుంది. కాబట్టి, మీ బ్యాగ్‌లు సిద్ధం చేసుకునే ముందు ట్రావెల్ ఇన్సూరెన్స్‌ను మీ ప్రయాణ ప్రణాళికలో భాగం చేసుకోండి. కొంచెం ప్లాన్ చేయడం ద్వారా మీరు భవిష్యత్తులో పెద్ద ఒత్తిడుల నుంచి తప్పించుకోవచ్చు.

# మహిళలకు మంచి ఛాన్స్.. బంగారం ధర భారీగా తగ్గింది.. ఈరోజు రేట్లు ఇవే..!



**హైదరాబాద్ - నవభూమి:**మన దేశ ప్రజలకు బంగారం అంటే ఎంతో ఇష్టం. ముఖ్యంగా మహిళల్లో పసిడిపై మక్కువ ఎక్కువ. బంగారం ఆభరణాలు ధరించేందుకు ఇష్టపడతారు. కొత్త కొత్త డిజైన్లలో బంగారు నగరు ధరించాలని కలలుగంటుంటారు. అందుకోసం ఎప్పటికప్పుడు బంగారం కొంటుంటారు. దీంతో దేశీయంగా పసిడికి ఏడాది పొడవునా గిరాకీ ఉంటుంది. ప్రతి సంవత్సరం మన దేశంలోకి టన్నుల కొద్ది బంగారం దిగుమతి అవుతుంటుంది. అయితే, ఈ ఏడాది ప్రారంభం నుంచి బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు బంగారం ధరలు భారీగా పెరిగేందుకు కారణమవుతున్నాయి. దీంతో తులం బంగారం ఇటీవలే లక్ష మార్క్ దాటింది. అయితే, ఆ తర్వాత వరుసగా తగ్గుతూ వస్తోంది. క్రితం రోజు వరకు బంగారం ధర భారీగా తగ్గింది. ఇవాళ స్థిరంగా ఉంది. ఈ క్రమంలో మే 4వ తేదీన హైదరాబాద్ మార్కెట్లో బంగారం రేట్లు తెలుసుకుందాం.

**గ్లోబల్ మార్కెట్లో గోల్డ్ రేట్లు..**

అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ధరలు దిగివస్తున్నాయి. ప్రస్తుతం స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 3241 డాలర్ల వద్ద ఉండగా.. స్పాట్ సిల్వర్ రేటు ఒక ఔన్సుకు చూస్తే 32.02 డాలర్ల వద్ద అమ్ముడవుతోంది. మరోవైపు.. ఇండియన్ రూపాయి మారకం విలువ కాస్త తగ్గి ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూ.84.608 వద్ద అమ్ముడవుతోంది.

హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధరలు గత నాలుగైదు రోజుల నుంచి వరుసగా తగ్గుతూ వస్తున్నాయి. తులం పసిడి ఏకంగా రూ. 2500 మేర తగ్గింది. ఇవాళ అదే రేటు వద్ద స్థిరంగా ఉంది. కొనుగోలుదారులకు ఇదే మంచి అవకాశం. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములకు రూ.95,510 వద్ద ఉంది. అలాగే 24 క్యారెట్ల ఆభరణాల గోల్డ్ రేటు ఏ మార్పు లేకుండా రూ.87 వేల 550 వద్ద ఉంది.స్థిరంగానే వెండి రేటు..

బంగారంతో పాటుగా వెండి రేటు సైతం స్థిరంగానే ఉంది. అయితే క్రితం రోజు కిలో వెండి రేటు రూ.2000 మేర పెరిగిన సంగతి తెలిసిందే. దీంతో మళ్లీ రికార్డ్ గరిష్ఠాల వైపు పరుగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు ఇవాళ రూ. 1,09,000 వద్ద అమ్ముడవుతోంది. ఈ కథనంలో పేర్కొన్న బంగారం, వెండి ధరలు మే 4వ తేదీ ఆదివారం రోజు ఉదయం 7 గంటల సమయంలో ఉన్నవి. అయితే, మధ్యాహ్నానికి బంగారం ధరలు మారవచ్చు. ప్రాంతాలను బట్టి ట్యాక్సులు వేరు వేరుగా ఉంటాయి. దీంతో బంగారం ధరలు మారుతుంటాయి. కొనుగోలు చేసే ముందే తెలుసుకోవడం మంచిది.

# ట్రంప్ రాకతో 'హైదరాబాద్ రియాల్టీ'కి కొత్త జోష్



**హైదరాబాద్ - నవభూమి:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీ భారత్‌లోని పలు నగరాలకు విస్తరిస్తోంది. ఇప్పటికే ముంబై, పుణె, గుర్గావ్, కోల్‌కతా వంటి నగరాల్లో ట్రంప్ టవర్లను నిర్మించారు. ఈ క్రమంలోనే దక్షిణ భారత్‌లోకి అడుగు పెట్టేందుకు స్థానిక నిర్మాణ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటోంది. దక్షమాదిలో రూ.6-7 వేల కోట్లు పెట్టుబడి పెట్టాలని ట్రంప్ కంపెనీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. అందుకు తగినట్లుగానే హైదరాబాద్ లోని కోకాపేటలో ట్రంప్ టవర్ల నిర్మాణానికి స్థానిక సంస్థ ఐరా రియాల్టీతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంది. కోకాపేటలో ట్రంప్ టవర్లు నిర్మించేందుకు అనుమతుల కోసం దరఖాస్తు చేసినట్లు ఐరా రియాల్టీ తెలిపింది. రెండు వారాల్లో అనుమతి వచ్చే అవకాశం ఉందని, ఆ తర్వాత పూర్తి వివరాలు బహిర్గతం చేస్తామని కంపెనీ వర్గాల ద్వారా తెలిసింది. మొత్తం 63 అంతస్తుల్లో జంట టవర్లను నిర్మించనున్నారని, అవి నగరంలోనే అత్యంత ఎత్తైనా టవర్లుగా నిలవనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కోకాపేటలో అత్యంత ఎత్తైన భవనం 57 అంతస్తులతో ఉంది. ఇదే స్థాయిలో నిర్మించేలా మరిన్ని కంపెనీలు అనుమతుల కోసం దరఖాస్తు చేసినట్లు సమాచారం. మరోవైపు.. అపర కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సైతం హైదరాబాద్‌లోకి అడుగుపెట్టాలని భావిస్తు న్నారుప. పశ్చిమ హైదరాబాద్‌లో వివాదాలు లేని భూమి కోసం అన్వేషిస్తున్నారట. భూమి కలిగిన స్థానిక రియల్ ఎస్టేట్ కంపెనీలతోనూ ఆయన చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. చర్చలు సఫలమైతే అంబానీ టవర్లు సైతం హైదరాబాద్ రియాల్టీని సరికొత్త శిఖరాలకు చేర్చనున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ట్రంప్ టవర్లు, అంబానీ టవర్లు హైదరాబాద్‌లో నిర్మిస్తున్నా రంటే అది కచ్చితంగా మార్కెట్లో జోష్ తీసుకొస్తుందని తెలిపాయి. అలాగే ఇతర నగరాల్లో భారీ ప్రాజెక్టులు పూర్తి చేసిన ప్రముఖ రియాల్టీ కంపెనీలు సైతం హైదరాబాద్ మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని పలు నివేదికలు చెబుతున్నాయి. నేరుగా కాకుండా ఇక్కడి స్థానిక సంస్థల భాగస్వామ్యంతో ప్రాజెక్టులు చేపట్టేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. భారీ ప్రాజెక్టులు చేపట్టిన అనుభవం, మార్కెటింగ్ సిబ్బంది దృష్ట్యా ఆయా కంపెనీలతో చేతులు కలిపేందుకు స్థానిక సంస్థలు సైతం సుముఖంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

### రూ.25తో మొదలై రూ.800 కోట్లకు..

# అంబికా దర్బార్ బత్తి సక్సెస్ స్టోరీ!




**హైదరాబాద్ - నవభూమి:**అంబికా దర్బార్ అగర్బత్తి అంటే తెలుగు ప్రజలకు సుపరిచితమే. భగవంతునికీ, భక్తునికి అనుసంధానమైనది అంబికా దర్బార్ బత్తి అనే క్యాప్షన్ ప్రత్యేకమైన అనుబంధాన్ని సూచిస్తుంది. తెలుగు వారి లోగిళ్లలో అంబికాకు ప్రత్యేక స్థానం ఉంది. అంబికా అగర్బత్తి ఉపయోగించడని తెలుగు వారు ఉండరేమో. అంతలా అది తెలుగువారికి దగ్గరైంది. 25 రూపాయల పెట్టుబడితో మొదలైన అంబికా దర్బార్ బత్తి కంపెనీ ఇప్పుడు వందల కోట్ల టర్నోవర్ సాధిస్తోంది. ఈ కంపెనీ సక్సెస్ స్టోరీ గురించి ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. అంబికా దర్బార్ బత్తి వ్యవస్థాపకులు అంబికా కృష్ణ గారు పశ్చిమ గోదావరి జిల్లాలో జన్మించారు. వీరి కుటుంబంలో 30 మంది సభ్యులు ఉంటారు. అతిపెద్ద ఉమ్మడి కుటుంబం అని చెప్పవచ్చు. ఆయిన తండ్రి పేరు ఆలపాటి రామచంద్రరావు. ఆయనకు నలుగురు కుమారులు. అందులో 2వ వాడే ఈ అంబికా కృష్ణ. ఆయన 10వ తరగతి వరకు ఏలూరు మునిసిపల్ స్కూల్‌లో చదువుకున్నారు. చదువు పూర్తి చేసుకున్న తర్వాత తన తండ్రి వద్ద ప్రోడక్షన్ మెన్, స్లెస్మాన్ గా పని చేశారు. ప్రస్తుతం కోట్లాది రూపాయల సామ్రాజ్యానికి అధిపతిగా ఉన్నారు.

అంబికా అగర్బత్తులకు మూలం..

అంబికా కృష్ణ గారి తాతగారు ఆయుర్వేద మందులను తయారు చేసేవారు. ఆయన మరణానంతరం వాళ్ల నాన్నగారికి ఆయుర్వేద మూలికలతో పొగ వచ్చే అగర్బత్తులను తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. అలా అంబిగా జాబాజి బత్తి, నిర్మల హెయిర్ ఆయిల్ తయారు చేశారు. ఆ తర్వాత 1946లో ఆయుర్వేద మూలికలతో అంబికా దర్బార్ బత్తిని తయారు చేశారు. ఆయనే భగవంతునికీ భక్తునికీ అనుసంధానమైనది అంబికా దర్బార్ బత్తి అనే క్యాప్షన్ పెట్టారట. అంబికా కృష్ణ గారు ఒక వ్యానులో ప్రతి శుక్రవారం అగర్బత్తులు అమ్మేందుకు వెళ్లేవారు. అప్పట్లో మస్తానీ దర్బార్ బత్తి ప్రసిద్ధి. దానికి పోటీగా మార్కెట్లోకి తీసుకొచ్చినందుకన ప్రతి ఊరు, ప్రతి దుకాణానికి వెళ్లి అంబికా విశిష్టతను చెప్తూ ప్రజలకు అలవాటు చేశారు. ఇప్పుడు అమ్మని మర్చిపోలేం, అంబికానీ మర్చిపోలేము అంటూ కొత్త టైటిల్ తో ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఈ అంబికా దర్బార్ బత్తిలో 63-70 మూలికలు ఉపయోగిస్తారని చెబుతారు. ప్రస్తుతం ఈ కంపెనీలో 2000 మంది కార్మికులు పని చేస్తున్నట్లు సమాచారం. అంబికా అగర్బత్తుల టర్నోవర్ రూ.800 కోట్లుగా ఉంటుందని అంచనా. రూ.25 పెట్టుబడితో మొదలై వందల కోట్లకు చేరుకున్నారు. సినీ పరిశ్రమలోకీ ఎంట్రీ.. 1975లో అంబికా కృష్ణ గారి తండ్రి పశ్చిమ గోదావరి జిల్లాలోనే మొట్టమొదటి ఏసీ డీలక్స్ థియేటర్ నిర్మించారు. దిగ్గజ నటుడు, హీరో కృష్ణ గారితో అంబికా కృష్ణ గారికి మంచి పరిచయం ఉండేది. అలా సినీ పరిశ్రమపై ఆసక్తి కలిగినట్లు చెబుతారు. ఆయన మొదట సినిమాకి డిస్ట్రిబ్యూషన్ చేసేవారు. ఆ తర్వాత నిర్మాణంలోకి అడుగుపెట్టారు. ఈవీవీ సత్యనారాయణతో కలిసి కన్యాదానం చిత్రం నిర్మించారు. అది హిట్ కావడంతో మరిన్ని సినిమానాలు నిర్మించారు. అలాగే వైజాగ్, చెన్నైలో హొటళ్ల వ్యాపారం సైతం చేస్తున్నారు.

# వారెన్ బఫెట్ సంచలన నిర్ణయం



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ దిగ్గజ ఇన్వెస్టర్, ట్రేడింగ్ మాంత్రికుడు వారెన్ బఫెట్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బెర్క్ షైర్ హాత్‌వే సీఈఓ పదవిని త్వరలోనే వీడుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తన రిటైర్మెంట్ ప్రణాళికలను ప్రకటించారు. మే 3, 2025 రోజున బెర్క్ షైర్ హాత్ వే కంపెనీ వార్షిక వాటాదారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా సంచలన నిర్ణయాలు ప్రకటించారు. 2025 చివరి నాటికి సీఈఓ పదవి నుంచి తాను వైదొలుగుతున్నట్లు వారెన్ బఫెట్ వెల్లడించారుఇకపై బెర్క్ షైర్ హాత్ వే కంపెనీ ఛైర్మన్‌గా తన రెండో కుమారుడు హువర్డ్ బఫెట్ బాధ్యతలు చేపడతానిరి వారెన్ బఫెట్ ప్రకటించారు. అలాగే కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా గ్రెగ్ అబెల్ విధులు నిర్వర్తిస్తారని ప్రకటించారు. కంపెనీకి సీఈఓగా గ్రెగ్ అబెల్‌ను ఎంపిక చేయాలనే నిర్ణయాన్ని వార్షిక సమావేశంలోనే వెల్లడించి అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు. తన పదవీ విరమణ, తన స్థానంలో గ్రెగ్ అబెల్‌ను కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించాలనే నిర్ణయాలు తన కుటుంబ సభ్యులకు తప్ప ఇప్పటి వరకు గ్రెగ్ అబెల్‌కు కూడా తెలియవని బఫెట్ చెప్పడం గమనార్హం.

బెర్క్ షైర్ హాత్ వే కంపెనీని నడిపించేందుకు గ్రెగ్ అబెల్ సరిగ్గా సరిపోతారని చాలా మంది పెట్టుబడిదారులు నమ్ముతున్నారని కంపెనీ వర్గాలు తెలిపాయి. అయితే, అతను పెట్టుబడులను ఎలా డీల్ చేయగలడనే అనుమానాలను లేవనెత్తారు. ఈ క్రమంలో అతని పని తీరుపై తనకు పూర్తి నమ్మకం ఉందని భరోసా కల్పించారు వారెన్ బఫెట్, తన సంపదను కంపెనీలో పెట్టుబడిగా ఉంచుతానని హామీ ఇచ్చారు. తాను సీఈఓగా ఉన్నప్పటి కంటే గ్రెగ్ అబెల్ నేతృత్వంలో బెర్క్ షైర్ హాత్ వే అవకాశాలు మరింత మెరుగ్గా ఉంటాయని తాను నమ్ముతున్నట్లు చెప్పుకొచ్చారు. తమ కంపెనీ వాటాదారుల్లో కొత్త సీఈఓ గ్రెగ్ అబెల్ పై నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేశారు వారెన్ బఫెట్. అలాగే యువ ఇన్వెస్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల్లో ట్రేడింగ్ స్ట్రాటజీల గురించి వివరించారు.

గ్రెగ్ అబెల్ ఎవరు? :

62 ఏళ్ల గ్రెగ్ అబెల్ రెండు దశాబ్దాలకు పైగా బెర్క్‌షైర్‌లో కీలక వ్యక్తిగా ఉన్నారు. ఇప్పుడు, బఫెట్ ఎంచుకున్న వారసుడిగా కంపెనీ బాధ్యతలను చేపట్టనున్నారు. అబెల్ కెనడాలోని ఆల్బెర్టాలోని ఎడ్మంటన్‌లో జన్మించారు. ఆయనకు చిన్నతనం నుంచే కష్టపడి పనిచేసేవారు. చిన్నతనంలో బాటిళ్లు సేకరించడం, అగ్నిమాపక యంత్రాలను సర్వీసింగ్ చేయడం వంటి వివిధ కూలీ పనులు చేసేవారు. అబెల్ కష్టపడి పనిచేసే స్వభావం, అంకితభావం వంటి లక్షణాలే ఆయన్ను ఈ స్థాయికి ఎదిగేలా చేశాయి. 1984లో ఆల్బెర్టా యూనివర్సిటీ నుంచి ఆనర్స్ డిగ్రీని పొందారు. అబెల్ తన కెరీర్‌ను ప్రైస్‌వాటర్ హౌస్‌కూపర్స్‌లో ప్రారంభించారు. ఆ తరువాత కాల్‌ఎనర్జీకి మారారు. అక్కడ ఆయన 1999లో ఫ్యూయల్ కంపెనీకి అధ్యక్షుడయ్యారు. అదే ఏడాదిలో బెర్క్‌షైర్ హాత్వే కంపెనీలో నియంత్రణ వాటాను సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఆ కంపెనీకి బెర్క్‌షైర్ హాత్వే ఎనర్జీగా పేరు మార్చారు. కంపెనీ అభివృద్ధికి అబెల్ కీలక పాత్ర పోషించారు. అబెల్ బెర్క్‌షైర్ హాత్వేలో యుటిలిటీలు, రైల్‌రోడ్స్ తయారీతో సహా వివిధ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు.

## ఇప్పటికీ జనాల వద్ద రూ.2 వేల నోట్లు.. ఆర్బీఐ తాజా అప్‌డేట్ ఏంటంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** సుమారు రెండేళ్ల క్రితం భారతీయ రిజర్వ్ బ్యాంకు రూ.2 వేల నోటును ఉపసంహరించింది. అయితే, ఇప్పటికీ జనాల వద్ద రూ.6,266 కోట్ల విలువైన రూ.2 వేల నోట్లు ఉన్నట్టు ఆర్‌బీఐ పేర్కొంది. 2023 మే 19న ఆర్బీఐ ఈ నోట్లను ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ఆర్‌బీఐ తెలిపిన వివరాల ప్రకారం, నోటు ఉపసంహరణ ప్రకటన సమయంలో ప్రజల వద్ద రూ.3.56 లక్షల విలువైన రూ.2 వేల నోట్లు ఉన్నాయి. ఏప్రిల్ 30 నాటికి అవి రూ.6,266 కోట్లకు పడిపోయాయి. చెలామణిలో ఉన్న మొత్తం రూ.2 వేల నోట్లలో రూ.98.24 శాతం ప్రజలు తిరిగిచ్చేశారని ఆర్‌బీఐ వెల్లడించింది. ఈ నోట్లను బ్యాంకుల్లో మార్చుకునే అవకాశం 2023 అక్టోబర్ 7తోనే ముగిసింది. అయితే, ఆర్బీఐ ఆఫీసుల్లో ఈ నోట్లను మార్చుకుని తమ అకౌంట్లల్లో డిపాజిట్ చేసుకునే అవకాశం ఇప్పటికీ ఉంది. మొత్తం 19 ఆర్‌బీఐ కేంద్ర కార్యాలయాల్లో ఈ సదుపాయం ఉంది. ప్రజలు తమ వద్ద ఉన్న నోట్లను రూ.2 వేల నోట్లను ఇండియన్ పోస్టు ద్వారా ఆర్బీఐకి పంపించే అవకాశం కూడా ఉంది. నోట్ల డీమోనెటైజేషన్‌లో భాగంగా భారతీయ రిజర్వ్ బ్యాంకు 2016 నవంబర్ 8న రూ. వేల నోట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. బ్లాక్ మనీ, అవినీతి, నకిలీ కరెన్సీలకు బ్రేకులు వేసేందుకు ప్రభుత్వం నోట్ల రద్దు ప్రకటించింది. అయితే, నోట్ల రద్దుతో వచ్చే కరెన్సీ కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం ఈ కొత్త పెద్ద నోట్లను ప్రవేశపెట్టింది. కొత్త మహాత్మా గాంధీ సిరీస్ నోట్లలో భాగంగా అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో ఈ నోటును ప్రభుత్వం విడుదల చేసింది. దేశ అవసరాలకు సరిపడా ఇతర డినామినేషన్‌ల కరెన్సీ నోట్లు అందుబాటులో ఉండటంతో ప్రభుత్వం రూ.2 వేల నోటును సర్క్యులేషన్ నుంచి ఉపసంహరించుకుంది. మరోవైపు, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు కూడా అనేక చర్యలు తీసుకుంది. ప్రస్తుతం యూపీఐ ఆధారిత చెల్లింపులు వేగంగా పెరుగుతున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఈ విధానానికి ఇతర దేశాల్లో కూడా ప్రాచుర్యం కల్పించేందుకు ప్రయత్నిస్తోంది.

## షాకింగ్..రూ.7 వేలు పెరిగిన వెండి..కానీ గోల్డ్ మాత్రం..





**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో గత కొన్ని రోజులుగా పెరుగుతూ, తగ్గుతూ వచ్చిన బంగారం, వెండి ధరలకు బ్రేక్ పడింది. ఆదివారం (మే 4, 2025న) రోజు వీటి ధరలు స్థిరంగా ఉన్నాయి. అయితే గత వారం రోజుల్లో వీటి ధరలు తగ్గాయా లేదా పెరిగాయా, తగ్గితే ఎంత తగ్గాయనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. ప్రస్తుతం వీటి ధరలు (మే 4న) గుడ్?రిటర్న్ వెబ్?సైట్ ప్రకారం ఉదయం హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 95,551గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 87,541 ఉంది. ఇదే సమయంలో గత వారం అంటే ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.98,210 కాగా, 22 క్యారెట్ల బంగారం రూ.90,010గా ఉంది. అంటే గత వారం రోజుల్లో వీటి ధరలు రూ.270 తగ్గాయి. ఇక వెండి విషయానికి వస్తే గత వారం రోజుల్లో భారీగా పెరగడం విశేషం. అంటే మే 4, 2025న హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,09,000గా ఉండగా, గత వారం ఏప్రిల్ 27, 2025న కేజీ వెండి ధర రూ.1,01,900గా ఉంది. ఈ క్రమంలో వారం రోజుల్లో ఏకంగా రూ.7100 పెరిగింది. ఈ నేపథ్యంలో బంగారం ధరతో పోలిస్తే వెండి రేటులో పెద్ద ఎత్తున మార్పు వచ్చింది. అంతేకాదు వెండి ధరలు భవిష్యత్తులో పెరుగుతాయని నిపుణులు హెచ్చరించడంతో అనేక మంది బంగారం కంటే ఎక్కువగా వెండిపై పెట్టుబడులు చేశారు. దీంతో వీటి ధరలు గోల్డ్ రేట్లను బీట్ చేశాయి.

## బజాజ్ ఫిన్‌సర్వ్ కొత్త ప్యాసివ్ ఫండ్స్




**న్యూఢిల్లీ-నవభూమి:**బజాజ్ ఫిన్‌సర్వ్ రెండు కొత్త తరం ప్యాసివ్ ఫండ్స్‌ను ప్రారంభించింది. దీర్ఘకాలంలో మంచి లాభాలు ఆర్జించేలా తక్కువ పెట్టుబడి వ్యయ ఆప్షన్లతో ఈ ఫండ్స్‌ను రూపొందించింది. బజాజ్ ఫిన్‌సర్వ్ నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ ఫండ్, నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్ పేరుతో వీటిని తీసుకువచ్చింది. నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ ఫండ్‌కు నిఫ్టీ నెక్ట్స్ 50 టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్‌ఐ) బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ ముగిం పు తేదీ ఈ నెల 6. కాగా నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్‌కు నిఫ్టీ 50 టీఆర్‌ఐ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 9. ఈ రెండు ఫండ్స్ కనీస పెట్టుబడి రూ.500.



## ప్రముఖ యోగా గురువు శివానంద స్వామి కన్నుమూత



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ యోగా గురువు, పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వామి శివానంద కన్నుమూశారు. వారణాసి లోని తన నివాసంలో స్వామి తుదిశ్వాస విడిచినట్లు ఆయన సన్నిహితులు వెల్లడించారు. ప్రస్తుతం శివానంద స్వామి వయసు 128 సంవత్సరాలు. 1896 ఆగస్టు 8న అవిభక్త భారత్‌లోని సిల్హెట్ జిల్లాలో, నిరుపేద కుటుంబంలో ఆయన జన్మించారు. ప్రస్తుతం సిల్హెట్ జిల్లా బంగ్లాదేశ్‌లో ఉంది.శివానంద స్వామికి ఆరేళ్ల వయసులోనే ఆయన తల్లిదండ్రులు చనిపోయారు. దాంతో ఆయన పశ్చిమ బెంగాల్‌లోని ఓ ఆశ్రమంలో పెరిగారు. గురు ఓంకారానంద గోస్వామి ఆయనను పెంచి పెద్ద చేయడమేగాక, యోగా వంటి ఆధ్యాత్మిక విషయాలను బోధించారు. ఈ క్రమంలోనే తన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేసిన స్వామి శివానంద.. గత 50 ఏళ్లుగా పూరిలో 400-600 కుష్టు రోగులకు సేవచేశారు.యోగా రంగానికి ఆయన చేసిన కృషికిగాను 2022లో శివానంద అప్పటి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. తెల్లటి ధోవతి, కుర్తా ధరించి.. కాళ్లకు చెప్పులు లేకుండా అత్యంత సామాన్యంగా వచ్చి ఆయన పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించడం అప్పట్లో అందరి దృష్టిని ఆకర్షించింది.

## కేంద్రం షాకింగ్ నిర్ణయం.. ఐఎంఎఫ్ బోర్డు సభ్యుడి తొలగింపు!



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ ద్రవ్య నిధి బోర్డు సభ్యుడిగా ఉన్న కృష్ణమూర్తి సుబ్రమణియన్‌ను కేంద్ర ప్రభుత్వం అర్థాంతరంగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. యన పదవీకాలం మరో ఆరు నెలలు మిగిలి ఉండగానే తొలగించడం విస్మయానికి గురిచేస్తోంది. ఐఎంఎఫ్ బోర్డు కీలక సమావేశానికి కొద్ది రోజుల ముందే ఈ చర్య తీసుకుంది. ఆ సమావేశంలో పాకిస్థాన్‌కు కొత్తగా 1.3 బిలియన్ డాలర్లు ఉద్దీపన రుణాన్ని మంజూరు చేయాలా? వద్దా? అనేది నిర్ణయం తీసుకోనుంది. పహల్గామ్ దాడి అనంతరం పాకిస్థాన్ ఆర్థిక మూలాలను భారత్ దెబ్బకొట్టి.. దాయాదిని అష్టదిగ్బంధనం చేస్తోంది. ఈ క్రమంలో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (%ూణదీ%) వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి పాకిస్థాన్‌కు ఆర్థిక సహాయం అందకుండా చర్యలు చేపడుతోంది. ఇదే సమయంలో ఐఎంఎఫ్ రుణం కూడా దాయాదికి అందకుండా చేయాలని భావిస్తోంది. ఇప్పటికే ఈ అంశంపై ఫిర్యాదు చేసిన భారత్.. త్వరలో జరగబోయే సమావేశంలో రుణం మంజూరు ఆమోదం పొందకుండా ప్రయత్నాలు చేస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

తనను ఐఎంఎఫ్ బోర్డు సభ్యుడిగా తొలగించడంపై సుబ్రమణియన్ ఇంకా స్పందించలేదు. ప్రధాని మంత్రి మాజీ ఆర్థిక సలహాదారు అయిన కృష్ణమూర్తి సుబ్రమణియన్ ఐఎంటఫ్ డేటాసెట్‌లపై ప్రశ్నలు లేవనెత్తడంతోనే ఆయనను సభ్యుడిగా తొలగించాలనే నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఐఎంఎఫ్‌తో ఆయనకు గతంలోనూ కొనసాగిన విబేధాలు కూడా కారణం కావచ్చని తెలుస్తోంది. ఇటీవల India @100: Envisioning Tomorrow%µ%s Economic Powerhouse పేరుతో ఆయన రాసిన పుస్తకంలో ఐఎంఎఫ్‌పై ఆరోపణలు చేశారు. సుబ్రమణియన్ ప్రస్తుతం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో ప్రొఫెసర్‌గా ఉన్నారు.

ఆయన స్థానంలో జూన్ చివర్లో పదవీ విరమణ చేయనున్న ఆర్థిక కార్యదర్శి అజయ్ సేథ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మూడేళ్ల పదవీకాలానికి నవంబర్ 2022లో %IMF% ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సుబ్రమణియన్ బాధ్యతలు చేపట్టారు. భారత ప్రభుత్వం ఇండియా, భూటాన్, బాంగ్లాదేశ్, శ్రీలంక దేశాలకు ఒక సంయుక్త ప్రతినిధిని %×వీఖీ% బోర్డుకు నామినేట్ చేస్తుంది.

అధికారిక వెబ్‌సైట్‌లో ఐఎంఎఫ్ పేర్కొన్న ప్రకారం.. హరిశ్చంద్ర పహత్ కుమ్బురే గెదరా ప్రస్తుతం ఆల్టర్నేట్ డైరెక్టర్‌గా ఉన్నారు. గతంలోనూ సుబ్రమణియన్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై ఐఎంఎఫ్ అసంతృప్తి వ్యక్తం చేసింది. చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ పదవీకాలం 2021లో ముగిసింది.కాగా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవస్థాయికి చేరుకున్నాయి. ఈ తరుణంలో భారత భూభాగంలోకి చొరబడిన పాకిస్థాన్ రేంజర్‌ను బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) అదుపులోకి తీసుకుంది. పాక్ రేంజర్‌ను రాజస్థాన్‌లోని భారత-పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు వద్ద బీఎస్ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు అధికార వర్గాలు శనివారం వెల్లడించాయి.

## డీజీపీపై తీవ్ర వ్యాఖ్యలు.. ప్రపంచ యాత్రికుడు అన్వేష్‌పై కేసు



**న్యూఢిల్లీ-నవభూమి:** కాలం మారింది. ప్రజలు ఎంచుకునే మాధ్యమాలు మారుతున్నాయి. మీడియాను హైజాక్ చేసిన సోషల్ మీడియా ఎంట్రీ తర్వాత.. వెలుగులోకి వస్తున్న సమాచారం రూపురేఖలు పూర్తిగా మారిపో యాయి. మన చుట్టూ జరిగే చాలా అంశాలకు సంబంధిం చిన వివరాల కంటే వ్యాఖ్యా నాలు ఎక్కువ అవుతున్నాయి. వ్యాఖ్యానం తప్పు కాదు. కాకుంటే.. నోటికి వచ్చినట్లుగా చెబుతూ.. చెప్పాల్సిన సమచారానికి భిన్నంగా వివరాలు అందించటంతోనే అసలు చిక్కంతా. ప్రపంచ యాత్రికుడు ట్యాగ్ తో దేశ దేశాలు తిరుగుతూ.. తనదైన విలక్షణ మాడ్యులేషన్ తో స్వల్ప వ్యవధిలోనే పేరు ప్రఖ్యాతుల్ని సొంతం చేసుకున్న యూట్యూబర్ అన్వేష్. ఇటీవల కాలంలో ఇతగాడు చేస్తున్న వ్యాఖ్యలు.. తనకు తెలిసిన సమాచారాన్ని తెలిసినట్లుగా కాకుండా.. నోటికి వచ్చినట్లుగా వివరాలు అందిస్తున్న తీరు విమర్శలకు గురి చేస్తోంది. అదే సమయంలో అతడిపై కేసులు నమోదు చేసేలా చేస్తోంది. తాజాగా అలాంటి ఉదంతమే మరొకటి చోటు చేసుకుంది. అన్వేష్ పై తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. తెలంగాణ డీజీపీ జితేందర్.. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి.. ఐఏఎస్ అధికారులు శాంతకుమారి.. దానకిశోర్.. వికాస్ రాజు తదితరులు హైదరాబాద్ మెట్రోలో బెట్టింగ్ యాప్ ల ప్రచారం పేరుతో రూ.300 కోట్లు కొట్టేశారంటూ ఓ వీడియో ద్వారా తప్పుడు ప్రచారం చేసిన వైనంపై సైబర్ పోలీసులు సుమోటోగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రజల్లో గందరగోళాన్ని క్రియేట్ చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ అధికారుల చట్టబద్ధమైన సంస్థల ప్రతిష్టను దెబ్బ తీయటం.. పరువుకు భంగం వాటిల్లేలా వీడియోలు చేయటాన్ని తీవ్రంగా పరిగణిస్తూ.. కేసు నమోదు చేశారు. తప్పుడు సమాచారానని వ్యాప్తి చేసేలా వీడియో కంటెంట్ క్రియేటర్ మీద చర్యలు తీసుకోవటానికి సైబర్ పోలీసులు సమాయుత్తమవుతున్నారు.

## రాజస్థాన్‌లోని ఝున్‌ఝునులో కంపించిన భూమి

**న్యూఢిల్లీ-నవభూమి:**రాజస్థాన్ రాష్ట్రంలోని ఝున్‌ఝును పట్టణంలో ఆదివారం ఉదయం స్వల్ప భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.1 గా నమోదైంది. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ మీడియాకు వెల్లడించింది.ఎన్‌సీఎస్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో భూమి కంపించింది. భూ ఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రం నమోదైంది. కాగా శనివారం మధ్యప్రదేశ్‌లో కూడా స్వల్ప భూకంపం సంభవించింది. బేతుల్ పట్టణంలో వచ్చిన ఆ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.8 గా నమోదైంది.

## జమ్ముకశ్మీర్‌పై తప్పుడు ప్రచారం.. ఇమ్రాన్ ఖాన్, బిలావల్ భుట్టో ఎక్స్ ఖాతాలు బ్లాక్



**శ్రీనగర్--నవభూమి:**పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ కు వ్యతిరేకంగా భారత్ అనేక చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రాజకీయ నాయకులు, క్రీడాకారులు సహా పలువురి సోషల్ మీడియా ఖాతాలను ఇండియాలో బ్లాక్ చేసింది. తాజాగా పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆ విదేశాంగశాఖ మాజీ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో ల ఎక్స్ ఖాతాలను నిలిపేసింది.ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అధికారిక ఎక్స్ ఖాతాను కూడా బ్లాక్ చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్ముకశ్మీర్‌పై వారు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న కారణంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా మహమ్మద్ అసిఫ్ ఎక్స్ ఖాతాను భారత్ నిలిపేసింది. పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న పలు యూట్యూబ్ ఛానళ్లు, న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్‌కు సంబంధించిన 16 ఛానెళ్లపై కూడా వేటుపడింది.పహల్గాం ఉగ్రదాడిపై ఇటీవల ఇమ్రాన్ ఖాన్ మీడియాతో మాట్లాడుతూ.. కశ్మీర్ విషయంలో భారత్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ పాక్‌పై దాడులకు దిగితే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. పాక్ మాజీ విదేశాంగ మంత్రి భిలావల్ భుట్టో సైతం ఇదే విధంగా భారత్‌పై నోరు పారేసుకున్నారు. సింధూ నదిలో నీరు పారకపోతే రక్తం పారుతుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో దేశంలో ఆ ఇద్దరి ఖాతాలను భారత్ బ్లాక్ చేసింది.

## పాక్ మహిళ సీమా హైదర్ ఇంట్లోకి చొరబడిన వ్యక్తి.. తనపై చేతబడి చేసిందని ఆరోపణ

లక్నో-నవభూమి: పాకిస్థాన్ మహిళ సీమా హైదర్ ఇంట్లోకి ఒక వ్యక్తి చొరబడ్డాడు. ఆమె తనపై చేతబడి చేసిందని ఆరోపించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. గుజరాత్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ సంఘటన జరిగింది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో పాకిస్థాన్ మహిళ సీమా హైదర్ ఇంట్లోకి ఒక వ్యక్తి ప్రవేశించాడు. ఆమె తనపై చేతబడి చేసిందని ఆరోపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు.కాగా, నిందితుడ్ని గుజరాత్‌కు చెందిన తేజస్‌గా పోలీసులు గుర్తించారు. జనరల్ కోచ్ టికెట్‌తో రైలులో ప్రయాణించిన అతడు గుజరాత్ నుంచి ఢిల్లీకి చేరుకున్నాడని తెలుసుకున్నారు. అక్కడి నుంచి బస్సులో నోయిడాకు వచ్చి సీమా హైదర్ ఇంటికి వెళ్లాడని పోలీస్ అధికారి తెలిపారు. అతడి మొబైల్ ఫోన్‌లో సీమా హైదర్ ఫొటో స్క్రీన్ షాట్ ఉందని చెప్పారు. అతడ్ని ప్రశ్నించగా ఆమె తనపై చేతబడి చేసినట్లు ఆరోపించాడని అన్నారు. ఆ వ్యక్తి మానసిక పరిస్థితి సరిగా లేనట్లుగా తెలుస్తున్నదని పోలీస్ అధికారి వెల్లడించారు.మరోవైపు పాకిస్థాన్ సింధ్ ప్రావిన్స్‌లోని జాకోబాబాద్‌కు చెందిన 32 ఏళ్ల సీమా హైదర్ 2023 మేలో తన పిల్లలతో కలిసి ఇంటి నుంచి పారిపోయింది.

## భారత సరిహద్దుల్లోకి ప్రవేశించి.. బీఎస్ఎఫ్‌కు చిక్కిన పాకిస్థాన్ సైనికుడు



**శ్రీనగర్--నవభూమి:**జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడితో సరిహద్దుల్లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ తరుణంలో భారత భూభాగంలోకి చొరబడిన పాకిస్థాన్ రేంజర్‌ను బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) అదుపులోకి తీసుకుంది. పాక్ రేంజర్‌ను రాజస్థాన్‌లోని భారత-పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు వద్ద బీఎస్ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు అధికార వర్గాలు శనివారం వెల్లడించాయి. జమ్మూ కశ్మీర్‌లోని ఏప్రిల్ 22న 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయిన ఉగ్రదాడి ఘటనతో భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్ రేంజర్‌ను బీఎస్ఎఫ్ రాజస్థాన్ ఫ్రంటియర్ అధికారులు అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. అతడి వివరాలు ఏంటి? అనేది మాత్రం వెల్లడించలేదు. అరెస్ట్ సమయంలో అతడి నుంచి ఎటువంటి ప్రతిఘటన ఎదురుకాలేదని అధికారులు తెలిపారు. పాక్ రేంజర్ గూఢచర్యం కోసమే భారత భూభాగంలోకి వచ్చాడా? అనే అనుమానం వ్యక్తమవుతోంది.

ఏప్రిల్ 23న పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద పొరపాటున పాక్ భూభాగంలోకి ప్రవేశించిన బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణం కుమార్ షా ప్రస్తుతం పాకిస్థాన్ చెరలో ఉన్న విషయం తెలిసిందే. అతడ్ని వదిలిపెట్టాలని భారత బలగాలు తీవ్ర నిరసన వ్యక్తం చేసినప్పటికీ, పాక్ మాత్రం ఇప్పటి వరకూ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. పైస్థాయిలో అనుమతి లేనిదే విడుదల చేయడం కుదరదని పాక్ ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ తరుణంలో పాక్ రేంజర్ బీఎస్ఎఫ్‌కు చిక్కడం గమనార్హం. మరి ఈ విషయంలో భారత్ ఎలా స్పందిస్తుందో చూడాలి. బీఎస్ఎఫ్ జవాన్‌ను విడిపించుకోడానికి పాక్ రేంజర్‌ను పావుగా వాడుకునే అవకాశం ఉంది.మరోవైపు, పహల్గామ్ ఉగ్రదాడి దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇదే సమయంలో పాకిస్థాన్‌కు వరుస షాక్‌లు ఇస్తూ.. ఆ దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేసేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో భారత్ నుంచి ఆ దేశానికి వెళ్లే అన్ని రకాల వస్తు ఎగుమతులను నిలిపివేసి వాణిజ్యపరంగా ఆంక్షలు విధించింది. అదే విధంగా దౌత్య పరంగా పాక్‌ను భారత్ ముప్పు తిప్పలు పెడుతోంది. అంతేకాకుండా ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ నుంచి వచ్చే రుణాలను ఆపేందుకు ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు.. ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్ట్‌లోకి మళ్లీ పాక్ వెళ్లేలా ఒత్తిడి తీసుకువస్తోంది. ఈ క్రమంలోనే పాకిస్తాన్‌తో సముద్ర రవాణా మార్గాలను మూసివేసిన భారత్.. పాక్ ఓడలను మన జలాల్లోకి రాకుండా, మన ఓడలు పాక్

## ఇండియా కూటమి 243 సీట్లలో పోటీ.. సీఎం ఎవరో చెప్పకనే చెప్పిన ఆర్జేడీ



**పాట్నా-నవభూమి:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకు వ్యతిరేకంగా మహాకూటమి 243 స్థానాల్లోనూ పోటీ చేస్తుందని రాష్ట్రీయ జనతాదళ్ (ఎంపీ మనోజ్ ఝా శనివారంనాడు ప్రకటించారు. మహాకూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ (ఎంఎల్), వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) ఉన్నాయి. శనివారంనాడిక్కడ కూటమి నేతలతో జరిగిన కీలక సమావేశానంతరం మీడియాతో మనోజ్ ఝా మాట్లాడుతూ, ఎన్డీయేను ఓడించేందుకు ఇండియా కూటమి భాగస్వాములంతా బూత్ స్థాయి నుంచి కలిసికట్టుగా పనిచేయనున్నట్టు చెప్పారు. "మేం ఐక్యంగా ఉన్నాం. ప్రతి సీటుకూ గట్టిపోటీ ఇస్తాం. ఎన్డీయేను ఓడిస్తాం" అని చెప్పారు. కార్మికుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా మే 20న జరుగనున్న వర్కర్స్ స్ట్రైక్‌కు ఇండియా కూటమి మద్దతిస్తుందని, సంఘీభావం తెలుపుతుందని తెలిపారు.బీహార్ మహాకూటమికి నాయకత్వం విషయంలో వస్తున్న ఊహాగానాలను మనోజ్ ఝా కొట్టివేశారు. తేజస్వి యాదవ్ నాయకత్వం విషయంలో ఎలాంటి వివాదం లేదన్నారు. సరైన సమయంలో ప్రకటన వెలువడుతుందని, ఇందుకు అందరూ కట్టుబడి ఉన్నారని చెప్పారు. కులగణనపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, అది తమ కూటమి ప్రధాన డిమాండ్ అని చెప్పారు. ఈరోజుకూ అది తమ ప్రధాన అంశమేనని అన్నారు. కులగణన జరిగేంతవరకూ తమ ఫోకస్ దానిపైనే ఉంటుందని, షేర్ చేసిన డాటా సరైనదేనా అనే విషయంలో ఒక కన్నేసి ఉంచుతామని వివరించారు.

## యువతకు వారెన్ బఫెట్ అమూల్యమైన సలహాలు



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచ దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ యువతకు కీలక సూచనలు చేశారు. మే 3, 2025న జరిగిన బెర్క్‌షైర్ హాత్వే వార్షిక వాటాదారుల సమావేశంలో యువతకు విలువైన సలహాలు ఇచ్చారు. యువత ఎప్పుడూ మార్కెట్ మీదే దృష్టి పెట్టవద్దని సూచించారు. యువ నిపుణులు ఆర్థిక మార్కెట్లపై తక్కువ దృష్టి పెట్టాలని.. నైతిక వృద్ధి, జీవితకాల అభ్యాసాన్ని ప్రేరేపించే వ్యక్తులతో గడపడంపై ఎక్కువ దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు. కేవలం డబ్బు సంపాదనే లక్ష్యంగా కాకుండా విలువలు, తమ.. తమ అభిరుచులను పరిగణలోకి తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "మీ కంటే మెరుగైన" వ్యక్తులతో నడవాలని, "ఇతరులు అందించే ఏదైనా సహాయాన్ని తిరిగి ఇవ్వాలి" అని కూడా ఆయన చెప్పారు. %వి%100 బిలియన్లకు పైగా నికర విలువ కలిగిన పెట్టుబడిదారుడు, పేలవమైన రోల్ మోడల్‌లను అనుసరించకూడదని కూడా హెచ్చరించారు, "మీరు జీవితంలో కూడా మంచి ఉద్దేశాలు.. తదనుగుణంగా ప్రవర్తనతో ముందుకు సాగాలి." అని పేర్కొన్నారు. "మీరు ఎవరితో క్లోజ్ గా మూవ్ అవుతారో.. అది చాలా ముఖ్యమైనది" అన్న బఫెట్.. "మీరు పనిచేసే, మీరు ఆరాధించే, మీ స్నేహితులుగా మారే వ్యక్తులను బట్టి మీ జీవిత పురోగతి ఉంటుంది." అని అన్నారు.నిజమైన వృత్తిపరమైన విజయం కేవలం లాభాల గురించే కాకుండా, అంతర్గతంగా ప్రేరేపించే పనిని ఎంచుకోవడంలో ఉందని బఫెట్ నొక్కి చెప్పారు. అధిక జీతం కంటే ఉత్సుకత, నిరంతర అభ్యాసం..ఇంకా ఆలోచనాత్మక కెరీర్ ఎంపికలు ముఖ్యమని ఆయన అన్నారు. "మీరు పని చేయడానికి అద్భుతమైన వ్యక్తులను కనుక్కుంటే, అదే మీకు సగం విజయం." అని ఆయన సలహా ఇచ్చారు.

## భారత్ దాడిచేస్తే.. అణుబాంబులకు వెనుకాడం: పాక్ రాయబారి బెదిరింపులు



**శ్రీనగర్-నవభూమి:**పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. భారత్ తమపై ఏక్షణమైనా దాడి చేయొచ్చని.. దీనికి తాము దీటుగా సమాధానం చెబుతామని పాకిస్థాన్‌కు చెందిన మంత్రులు కవ్విస్తున్నారు. తాజాగా, రష్యాలోని పాక్ రాయబారి మహమ్మద్ ఖలీద్ జమాలీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్ దాడి చేస్తే గట్టిగా బదులిస్తామని, అవసరమైతే అణ్వాయుధాలు కూడా ఉపయోగిస్తామని ప్రగల్భాలు పలికారు. పాక్ భూభాగంపై భారత్ దాడి చేస్తుందనేందుకు తమ దగ్గర కచ్చితమైన ఆధారాలు ఉన్నాయని ఆయన తెలిపారు. పాక్ మంత్రి హానీఫ్ అబ్బాసి కూడా అణ్వాయుధాలతో దాడి చేస్తామని బెదిరింపులకు దిగారు. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేస్తే యుద్ధం తప్పదని ఆయన హెచ్చరించారు. మరో పాక్ మంత్రి అతుల్లా తరార్ 24 నుంచి 36 గంటల్లో భారత్ దాడి చేయొచ్చని రెండు రోజుల కిందట వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు.రష్యా టెలివిజన్‌తో పాకిస్థాన్ రాయబారి మహమ్మద్ ఖలీద్ జమాలీ మాట్లాడుతూ.. భారత్ దాడి చేసే అవకాశం ఉందని అన్నారు. 'భారత్ దాడి చేస్తే గట్టిగా బదులిస్తాం... అన్ని ఆయుధాలను ఉపయోగిస్తాం. అవసరమైతే అణ్వాయుధాలను కూడా ప్రయోగిస్తాం' అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించాడు. భారత్ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని పిచ్చిప్రేలాపన చేశాడు. సైనిక బలగాల గురించి మాట్లాడకూడదని ఆయన అన్నారు. భారత్‌పై పోరాటానికి పాకిస్థాన్ ప్రజల మద్దతు తమ సైన్యానికి ఉంటుందని ఆయన తెలిపారు. పహల్గామ్ దాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని భారత్ బలంగా నమ్ముతోంది.

అణుబాంబులు సిద్ధం చేశాం.. భారత్‌కు పాక్ మంత్రి బెదిరింపులుఇటీవల పాక్ మంత్రి హానీఫ్ అబ్బాసి. భారతదేశంపై అణ్వాయుధాలతో దాడి చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డాడు. 'మా దగ్గర ఘోరి, షాహీన్, గజినీ వంటి క్షిపణులు ఉన్నాయి. 130 అణ్వాయుధ వార్‌హెడ్‌లు భారత్ కోసమే సిద్ధంగా ఉంచాం' అని ఆయన హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తే భారత్ యుద్ధానికి సిద్ధంగా ఉండాలని రొచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు.మరో పాక్ మంత్రి అతుల్లా తరార్ మాట్లాడుతూ.. 24 నుంచి 36 గంటల్లో భారత్ దాడి చేయొచ్చని అన్నారు. ఒకవేళ భారత్ దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని సైన్యానికి అప్పగించారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని అందరూ ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం వరుసగా పది రోజూ కూడా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. భారత పోస్ట్‌లపై పాక్ రేంజర్లు కాల్పులు జరిపి.. కవ్వింపులకు పాల్పడుతున్నారు.

## పాక్ కౌంటర్ ఎటాక్.. భారత నౌకలకు ఓడరేవుల్లో నో ఎంట్రీ!



**శ్రీనగర్--నవభూమి:**ఉగ్రవాదానికి సపోర్ట్ చేస్తున్నందుకు పాకిస్తాన్ నుంచి డైరెక్ట్‌గా, ఇన్‌డైరెక్ట్‌గా వచ్చే దిగుమతులపై బ్యాన్ విధిస్తూ భారత్ ఆర్డర్స్ జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో పాకిస్తాన్ రివర్స్ గేర్ వేసింది. భారత జెండా ఉన్న నౌకలు తమ పోర్టులను ఉపయోగించుకోవడాన్ని బ్యాన్ చేస్తున్నట్లు అనౌన్స్ చేసింది. అంతేకాదు, భారత్ నుంచి దిగుమతి చేసుకునే కొన్ని వస్తువులపై కూడా బ్యాన్ చేస్తున్నట్లు చెప్పింది. పాక్ నౌకలు కూడా ఇండియాలోని పోర్టులకు వెళ్లడానికి వీల్లేదని అక్కడి పెద్ద అధికారులు రూల్స్ పెట్టారు. న్యూఢిల్లీతో కొనసాగ ుతున్న టెన్షన్ల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాకి స్తాన్ సముద్ర వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

పాకిస్తాన్‌పై మరిన్ని ఆంక్షలు

పాకిస్తాన్ నుంచి వచ్చే దిగుమతుల మీద బ్యాన్ విధిస్తున్నట్లు భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ శనివారం ఒక నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. పాకిస్తాన్ నుంచి మన దేశానికి వచ్చే అన్ని రకాల ప్రొడక్ట్స్‌కు ఈ బ్యాన్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాకిస్తాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ క్లోజ్ చేసింది. ఆ దేశ జెండాతో ఉన్న షిప్స్ ఇండియన్ పోర్టుల్లోకి రాకుండా సెంట్రల్ గవర్నమెంట్ బ్యాన్ విధించింది. మర్చెంట్ షిప్పింగ్ చట్టం, 1958లోని 411 సెక్షన్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రూల్స్ వెంటనే అమల్లోకి వస్తాయని చెప్పింది. అటు ఇండియన్ షిప్స్ కూడా పాకిస్తాన్ పోర్టుల్లోకి వెళ్లకూడదని తేల్చి చెప్పేసింది. ఇదివరకే పాకిస్తాన్ ఫ్లైట్స్‌కు మన ఎయిర్‌స్పేస్‌ను క్లోజ్ చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఆ దేశం నుంచి ఇండియాకు వేర్వేరు మార్గాల్లో వచ్చే అన్ని రకాల లెటర్స్, పార్సిల్స్ రవాణాను కూడా ఆపేస్తున్నట్లు పోస్టల్ డిపార్ట్‌మెంట్ అనౌన్స్ చేసింది.

2019లో పుల్వామా టెర్రరిస్ట్ అటాక్ తర్వాత పాకిస్తాన్ దిగుమతులపై 200శాతం ట్యాక్స్ వేసింది సెంట్రల్ గవర్నమెంట్. దాంతో అవి చాలా వరకు తగ్గిపోయాయి. పహల్గామ్ టెర్రరిస్ట్ అటాక్, బోర్డర్‌లో కవ్వింపు చర్యల నేపథ్యంలో ఇప్పుడు ఇతర దేశాల ద్వారా పాకిస్తాన్ నుంచి వచ్చే దిగుమతులను కూడా ఆపేసింది. దీంతో ఇండియాకు ఎక్స్‌పోర్ట్స్‌పైనే ఆధారపడుతున్న పాకిస్తాన్‌లోని కొన్ని ఇండస్ట్రీలపై బాగా ఎఫెక్ట్ పడే ఛాన్స్ ఉండడంతో ఆ దేశం రివర్స్ యాక్షన్ తీసుకుంటోంది.

## క్షిపణుల వర్షం కురిస్తే.. మాజీ దౌత్యవేత్త ఏమన్నారంటే

**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్ దుశ్చర్యపై భారత ప్రజానీకంలో తీవ్ర భావోద్వేగాలు కనిపిస్తున్నాయి. దెబ్బకు దెబ్బ తీయాలనే అభిప్రాయం బలంగానే వినిపిస్తోంది. భారత్ సైతం పాక్‌పై వరుస కఠిన చర్యలు తీసుకుంటోంది. సైన్యానికి పూర్తి స్వేచ్ఛను కూడా ఇస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ప్రజల భావోద్వేగ స్థితి ఒక్కటే యుద్ధాన్ని నిర్దేశించడానికి సరిపోతుందా అనే దానిపై నిపుణులు ఏమంటున్నారు? 2017-2023 మధ్య పాకిస్థాన్‌కు భారత హైకమిషనర్‌గా పనిచేసిన అజయ్ బిసరియా దీనిపై కీలక అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధాన్ని ప్రజల మానసిక స్థితి నిర్దిశించకూడదని అన్నారు. ప్రజాభిప్రాయం ఎలా ఉందనే అంశం ఆధారంగా యుద్ధం టైమింగ్ ఉండకూడదని చెప్పారు.ఏ ఆపరేషన్ విజయంవంతం కావాలన్నా మూడు అంశాలు ముఖ్యమని, స్పీడ్ (వేగం), సర్‌ప్రైజ్(అనూహ్యం), సీక్రెసీ (గోప్యత) అనేవి చాలా ముఖ్యమని బిసారియా చెప్పారు. యుద్ధమే అనివార్యమైతే సొంతంగానే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. "సొంత నిర్ణయంతోనే యుద్ధం చేయాలి. అప్పుడు ఎంత తీవ్ర పరిస్థితినైనా ఎదుర్కోవాల్సి వస్తుంది, అదుపుతప్పితే పూర్తి స్థాయిలో యుద్ధం చేయాల్సి వస్తుంది. అందుకు తగిన సామర్థ్యం, పట్టుదల, రాజకీయ సంకల్పం, జాతి సంకల్పం కావాలి" అని ఆయన విశ్లేషించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | సోమవారం | 05। మే । 2025



# సుధీర్‌తో గొడవలపై ఎట్టకేలకి స్పందించిన రష్మీ గౌతమ్

బుల్లితెరపై మంచి క్రేజ్ తెచ్చుకున్న జంటలలో సుడిగాలి సుధీర్, రష్మీ జంట ఒకటి. సుడిగాలి సుధీర్, రష్మి గౌతమ్ అంటే కేరాఫ్ జబర్దస్త్ కామెడీ షో అనే చెప్పాలి. వీళ్ళకు గుర్తింపు తీసుకొచ్చింది ఈ షోనే. అంతకుముందు సుధీర్, రష్మి అంటే ఎవరో కూడా ఎవరికీ పెద్దగా తెలియదు. జబర్దస్త్‌లోకి అడుగుపెట్టిన తర్వాత రష్మీ, సుధీర్‌లకి ప్రత్యేక ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. వీరిద్దరు రియల్ లవర్స్ అన్న మాదిరిగా బిల్డప్ ఇవ్వడంతో త్వరలో పెళ్లి కూడా చేసుకుంటారని నెట్టింట అనేక ప్రచారాలు జరుగుతూ ఉన్నాయి. గత తొమ్మిదేళ్లుగా ఈ ఇద్దరు తమ ఫ్యాన్స్‌ని ఎంతగానో ఎంటర్‌టైన్ చేస్తూ ఉన్నారు. ఇద్దరూ ఒక షోలో కనిపించినా, ఇద్దరూ కలిసి ఈవెంట్ చేసినా, ఈ ఇద్దరి మీదే ఈవెంట్ చేసినా అది సూపర్ హిట్ కావల్సిందే.మంచి క్రేజ్ తెచ్చుకున్న ఈ జంట ఇటీవల ఎక్కడా కూడా కలిసి కనిపించడం లేదు. మల్లెమాల, ఈటీవీ ప్రోగ్రాంలలో రష్మీ సుధీర్ జంటగా కనిపించింది చాలా తక్కువ. జబర్దస్త్, ఢీ షోలలో ఇంతకు ముందు ఈ ఇద్దరూ కలిసి ప్రేక్షకులను అలరించేవారు. అయితే ఇప్పుడు మాత్రం సుధీర్ రష్మీ కలిసి ఏ ప్రోగ్రాం చేయడం లేదు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు వచ్చాయని, ఒకరంటే ఒకరికి పడదం లేదనే ప్రచారాలు కూడా సాగాయి. రష్మీ గౌతమ్ ఎన్ని సార్లు ఫోన్ చేసిన కూడా సుధీర్ పట్టించుకోవడం లేదని, హీరో అయ్యాక సుధీర్.. ఆమెని దూరం పెట్టాడని ఎన్నో ప్రచారాలు సాగేవి. వీటిపై తాజాగా రష్మీ స్పందించింది.మా ఇద్దరి మధ్య ఎలాంటి గొడవలు లేవు. ఏదైనా ఈవెంట్ ఉంటే మాత్రమే తప్పక కలుస్తాము. అప్పుడు ప్రొఫెషనల్ గానే ఉంటామని చెప్పుకొచ్చింది.

నవచిత్ర



# బుట్టబొమ్మని గట్టెక్కించేది ఆ ఇద్దరేనా?



ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత మంది క్రేజ్ ఎంత రాకెట్ స్పీడుతో పెరుగుతుందో అంతే స్పీడుగా పడిపోతుంటుంది. ఇలియానా, శ్రీలీల ఇప్పుడు బుట్టబొమ్మ పూజా హెగ్డే. ఈ ముగ్గురు టాలీవుడ్‌లో ఎంత స్పీడుగా ఎదిగారో అంతే స్పీడుగా ఫ్లాపుల్ని ఎదుర్కొన్నారు. ఇప్పటికీ ఎదుర్కొంటున్నారు. దానికి కారణం వారు ఎంచుకున్న సినిమాలే. ఇలియాన రాకెట్ స్పీడుతో ఎదిగి అంతే స్పీడ్‌తో తెరమరుగైపోయింది. ఇప్పుడు ఆ పరిస్థితిని బుట్టబొమ్మ పూజాహెగ్డే ఎదుర్కొంటోంది. డీజే దువ్వాడ జగన్నాథం మూవీతో బిగ్ డైరెక్టర్ల దృష్టిని ఆకర్షించిన పూజా హెగ్డే అనతికాలంలోనే వరుసగా క్రేజీ ఆఫర్లని దక్కించుకుని టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచింది. బన్నీ అలవైకుంఠపురం వరకు అదే హవాని కొనసాగిస్తూ భారీగా డిమాండ్ చేసిన పూజా హెగ్డే ఆ తరువాత నుంచి వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొంటూ కెరీర్ పరంగా ఎదురీదుతోంది. రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య, బాలీవుడ్‌లో సర్కస్, కిసీకి భాయ్ కిసీకి జాన్, దేవ వంటి సినిమాలతో వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొని షాక్ ఇచ్చింది. ఈ సినిమాలతో పూజా హెగ్డే వరుసగా రికార్డు స్థాయిలో 7 ఫ్లాపుల్ని దక్కించుకోవడం గమనార్హం. తాజాగా సూర్య, కార్తీక్ సుబ్బరాజ్‌ల రెట్రోతోనూ ఫ్లాప్‌ని ఎదుర్కోవడంతో బుట్టబొమ్మ కెరీర్ ఇక అంతేనా అనే అనుమానాలు మొదలయ్యాయి. తాజా పరిణామాల నేపథ్యంలో పూజా హెగ్డేకు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో అవకాశాలు తగ్గే అవకాశం ఉందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తనని, తన కెరీర్ ని కాపాడేది ఆ ఇద్దరే అనే చర్చ మొదలైంది. ఆ ఇద్దరు దళపతి విజయ్, రాఘవ లారెన్స్. విజయ్ తన చివరి సినిమా జన నాయగన్ చేస్తున్న విషయం తెలిసిందే. హెచ్.వినోద్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో విజయ్‌కి జోడీగా బుట్టబొమ్మ నటిస్తోంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ మూవీని వచ్చే ఏడాది జనవరి 9న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా ఫలితంపైనే పూజా హెగ్డే కెరీర్ ఆధారపడి ఉంది. ఇక ఈ మూవీ తరువాత పూజా హెగ్డే హారర్ థ్రిల్లర్ కాంచన 4లో నటిస్తోంది. కాంచన ఫ్రాంచైజీలో భాగంగా రాఘవ లారెన్స్ రూపొందిస్తున్న ఈ మూవీ కూడా పూజా హెగ్డేకు కీలకంగా మారింది. తొలి సారి తను చేస్తున్న హారర్ థ్రిల్లర్ కావడం, కాంచన సీక్వెల్ కావడంతో అందరి దృష్టి ఈ ప్రాజెక్ట్‌పై పడింది. బుట్టబొమ్మకు ఈ రెండు సినిమాలు హిట్ ని అందిస్తే మరిన్ని సినిమాలు వచ్చే అవకాశం ఉంది. లేదంటే ఇక కెరీర్ ముగిసినట్టే అని ఇన్ సైడ్ టాక్.

# దేవర-2కు ఆ మార్పులు చేయాల్సిందే




సంచలన పాన్ ఇండియా మూవీతో ఎన్టీఆర్ వరల్డ్ వైడ్‌గా భారీ పాపులారిటీని దక్కించుకున్నాడు. ఈ మూవీలో ఎన్టీఆర్ నటనకు ముగ్ధులైన హాలీవుడ్ డైరెక్టర్స్ కొందరు తనతో సినిమా చేయడానికి ఆసక్తిగా ఉన్నామని కూడా స్టేట్మెంట్‌లు ఇవ్వడం తెలిసిందే. ఇదిలా ఉంటే ఈ మూవీ తరువాత ఎన్టీఆర్ నటించిన భారీ యాక్షన్ డ్రామా దేవర. స్టార్ డైరెక్టర్ కొరటాల శివ తెరకెక్కించారు. రెండు భాగాలుగా తెరపైకి రానున్న ఈ మూవీ ఫస్ట్ పార్ట్ గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రేక్షకు ముందుకొచ్చింది. మ్యాజిక్‌ని మాత్రం రీక్రియేట్ చేయలేకపోయింది. ఒక విధంగా చెప్పాలంటే తో ఎన్టీఆర్ దక్కించుకున్న క్రేజ్‌ని దేవర తగ్గించిందని చెప్పక తప్పదు. ఎన్టీఆర్ లాంటి పవర్ హౌస్‌ని దేవరలో కొరటాల శి కరెక్ట్‌గా వాడుకోలేదని, ఆడియన్స్‌తో పాటు సగటు సినీ లవర్ కోరుకున్న విధంగా ఎన్టీఆర్‌ని ప్రజెంజ్ చేయడంతో దర్శకుడు కొరటాల ఫెయిల్ అయ్యారని కామెంట్‌లు వినిపించాయి. సినిమాలో పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో ఎన్టీఆర్‌ని ప్రజెంట్ చేయకపోవడమే దీనికి ప్రధాన కారణంగా నిలచింది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకున్న కొరటాల శివ పార్ట్ 2 విషయంలో ఇలాంటి తప్పులకు ఛాన్స్ ఇవ్వకూడదని గట్టిగా ప్లాన్ చేస్తున్నాడట. క్యాస్టింగ్ విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్న కొరటాల కథని మరింత పవర్‌ఫుల్‌గా మార్చి ఏదీ మిస్సవకుండా తెరపైకి తీసుకురావాలనుకుంటున్నాడట. ఇప్పటికే కథలో భారీ మార్పులు చేసినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఆ మార్పులకు తగ్గట్టుగానే క్రేజీ ఆర్టిస్ట్‌లని కూడా రంగంలోకి దించబోతున్నట్టుగా తెలుస్తోంది. దేవర పార్ట్ 1కు మరింత పవర్ ఫుల్‌గా పార్ట్ 2ని తెరపైకి తీసుకురానున్న కొరటాల శివ రెండవ భాగాన్ని వచ్చే ఏడాది సెట్స్ పైకి తీసుకెళుతున్నారట ఈ విషయాన్ని హీరో కల్యాణ్ రామ్ ఇటీవల వెల్లడించారు. ఈ మూవీని యువ సుధా ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై సుధాకర్ మిక్కిలినేని, నందమూరి కల్యాణ్‌రామ్ భారీ స్థాయిలో నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ప్రస్తుతం జరుగుతున్నాయి. అన్ని పక్కా కుదిరిన తరువాత దేవర పార్ట్ 2%-%కు సంబంధించిన అప్ డేట్‌ని మేకర్స్ అధికారికంగా వెల్లడించే అవకాశం ఉందని తెలిసింది.

# శ్రీలీల మూడో దత్త కూతురు కాదు



అందంతో పాటు మంచి మనసున్న హీరోయిన్ శ్రీలీల. ఈమె ఇప్పటికే ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్న విషయం తెల్సిందే. వారి సంరక్షణ బాధ్యతలు చూసుకుంటూ, వారితో ఉన్న ఫోటోలను అప్పుడప్పుడు షేర్ చేస్తూ ఉండే శ్రీలీల ఇటీవల ఒక చిన్న పాపతో ఉన్న ఫోటోను షేర్ చేసింది. ఈ పాప రాకతో తమ ఫ్యామిలీ మరింత పెరిగింది. మా కుటుంబంలోకి కొత్త వ్యక్తి వచ్చింది అంటూ శ్రీలీల సోషల్ మీడియా ద్వారా లవ్ ఈమోజీలను షేర్ చేసి మరీ పోస్ట్ చేసింది. దాంతో చాలా మంది శ్రీలీల మరో పాపను దత్తత తీసుకుంది అనుకున్నారు. పలు మీడియా సంస్థలు కూడా అదే విషయాన్ని ధృవీకరించాయి. ఇండస్ట్రీకి చెందిన వారు కూడా సోషల్ మీడియా ద్వారా శ్రీలీల మూడో దత్త కూతురు అన్నట్లుగా ప్రచారం చేశారు. సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం అంతా ఇంతా కాదు. శ్రీలీల గొప్పతనం గురించి మరోసారి, ఆమె మంచితనం గురించి మరోసారి ప్రముఖంగా చర్చ జరిగింది. శ్రీలీల ఇటీవల షేర్ చేసిన పాప ఫోటోల గురించి ఫ్యాక్ట్ చెక్ చేసిన సమయంలో అసలు విషయం బయటకు వచ్చింది. శ్రీలీల ఇటీవల షేర్ చేసిన ఫోటోలో ఉన్న పాప ఎవరో కాదు తన సోదరి కూతు రు. అంతే తప్ప ఆ పాపను శ్రీలీల దత్తత తీసుకోలేదు. తన సోదరి కూతురు రాకతో పిన్నిగా శ్రీలీల చాలా సంతోషంగా ఉందట. అందుకే తమ ఫ్యామిలీ పెరిగింది, మా ఆనందానికి అవధులు లేవు అన్నట్లుగా కాస్త భారమైన, బలమైన పదాలతో శ్రీలీల తన సంతోషంను వ్యక్తం చేసిందో! శ్రీలీల ఇప్పటికే ఇద్దరు పిల్లలను దత్తత తీసుకుని వారి బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెల్సిందే. ఇప్పుడు మరో పాపను దత్తత తీసుకోవడం అంటే నిజంగా గొప్ప విషయం అని అంతా అనుకున్నారు. కానీ ఆమె దత్తత తీసుకోలేదు. ఆమె సినిమాలతో చాలా బిజీగా ఉండటం వల్ల ఆమె ఎక్కువ సమయం కేటాయించే పరిస్థితి లేదు. అందుకే ఆమె ఈ సమయంలో దత్తత ఆలోచన చేయక పోవచ్చు. ప్రస్తుతం తన ఆధ్వర్యంలో ఉన్న ఇద్దరు పిల్లలను సాధ్యం అయినంత వరకు ఆనందంగా చూసుకునేందుకు ప్రయత్నింస్తూ ఉంటుంది. శ్రీలీల ఆ ఇద్దరు పిల్లలను దత్తత తీసుకోవడం కూడా చిన్న విషయం ఏమీ కాదు. కోట్ల పారితోషికాలు తీసుకునే వారు చిన్న సాయం చేసేందుకు ముందుకు రారు. అలాంటిది శ్రీలీల ఇద్దరు పిల్లలను దత్తత తీసుకోవడం గొప్ప విషయం. ఇక శ్రీలీల సినిమాల విషయానికి వస్తే పుష్ప 2 సినిమాలో కిస్సిక్ అంటూ ఐటెం సాంగ్ చేయడంతో ఒక్కసారిగా పాన్ ఇండియా రేంజ్ పాపులారిటీని సొంతం చేసుకుంది. దాంతో హిందీ సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. కేవలం హిందీ సినిమా మాత్రమే కాకుండా తమిళ్ సినిమాలోనూ ఈమెకు నటించే అవకాశం దక్కింది. ఇక తెలుగులో ఈమె జోరు కంటిన్యూ అవుతోంది. రవితేజ తో ధమాకా సినిమా తర్వాత మరో సినిమాను చేసేందుకు ఈమె రెడీ అయింది. త్వరలోనే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. మరో వైపు కన్నడ సినిమా ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఆఫర్‌లను కూడా ఈమె తిరస్కరించకుండా ఓకే చెప్పేం దుకు రెడీగా ఉంది. ఒక్క భాషలో అని కాకుండా అన్ని భాషల్లోనూ ఈ అమ్మడు నటిస్తూ దూసుకు పోతుంది.

# ఇమ్రాన్ హష్మీ మాటలతో పవన్ ఫ్యాన్స్ నిరాశ



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చేతిలో ప్రస్తుతం రెండు సినిమాలున్నాయి. అందులో ఒకటి హరిహర వీరమల్లు కాగా, రెండోది ఓజీ. ఈ రెండింటిలో ముందుగా వచ్చే సినిమా వీరమల్లు అని అందరికీ తెలిసినప్పటికీ పవన్ ఫ్యాన్స్ మాత్రం సమయం సందర్భం లేకుండా ఓజి ఓజి అంటూ దాని గురించే అడుగుతూ వస్తున్నారు. అయితే అసలు మే లో రిలీజ్ అని చెప్పిన హరిహర వీరమల్లు రిలీజ్ ఎప్పుడనే విషయంలోనే క్లారిటీ లేకపోతే ఇక ఎప్పుడొస్తుందో తెలియని ఓజి గురించి ఫ్యాన్స్ అస్తమానం అడగడమేంటో ఎవరికీ అర్థం కావడం లేదు. వాస్తవానికి ఓజి సెప్టెంబర్ లో వస్తుందన్నారు కానీ ఈ విషయంలో మేకర్స్ మాత్రం క్లారిటీ ఇవ్వలేకపోతున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల గ్రౌండ్ జీరో మూవీ ప్రమోషన్స్ లో భాగంగా ఇమ్రాన్ హష్మీ ఓజి గురించి ఇచ్చిన అప్డేట్ ఫ్యాన్స్ గుండెల్లో బాంబుని పేల్చింది. ఇమ్రాన్ హష్మీ ఓజిలో విలన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటివరకు పవన్ కళ్యాణ్, ఇమ్రాన్ హష్మీ కాంబినేషన్ లో ఒక్క సీన్ ను కూడా డైరెక్టర్ సుజిత్ షూట్ చేయలేదని ఆయన చెప్పాడు. మరో నెల రెండు నెలల్లో సుజిత్ ఆ సీన్స్ ను తీసే అవకాశముందని ఇమ్రాన్ హష్మీ చెప్పడం చూస్తుంటే ఓజి షూటింగ్ చాలానే పెండింగ్ ఉందని స్పష్టంగా తెలుస్తోంది. ఇమ్రాన్ హష్మీ లాంటి కీలక పాత్రతోనే పవన్ కాంబినేషన్ సీన్స్ తీయలేదంటే ఇక ఆ సినిమా షూటింగ్ పూర్తవడానికి, దాని పోస్ట్ ప్రొడక్షన్ కు, ఆ తర్వాత సెన్సార్, ప్రమోషన్స్ కు చాలానే టైమ్ పడుతుంది. పోనీ ఇమ్రాన్ కు ఓజిలో తక్కువ ప్రాధాన్యత ఉన్న క్యారెక్టరా అంటే కాదు. ఆయన సినిమాలో విలన్ పాత్ర పోషిస్తున్నాడు. పవన్ సినిమాలో విలన్ క్యారెక్టర్ అంటే ఆ పాత్ర హీరో పాత్రకు సమానంగా ఉంటుంది. ఇమ్రాన్ హష్మీ చెప్పిన ఈ మాటలతో పవన్ ఫ్యాన్స్ కు దిమ్మ తిరిగినంత పనైంది. ప్రియాంక అరుళ్‌మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాను డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో డీవీవీ దానయ్య నిర్మిస్తుండగా, తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు.

# వీరమల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన పవన్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా హరిహర వీరమల్లు. గత ఐదేళ్లుగా ఈ సినిమా ప్రొడక్షన్ లోనే ఉంది. వాస్తవానికి ఈ సినిమా ఎప్పుడో షూటింగ్ పూర్తి చేసుకుని రిలీజవాల్సింది కానీ వీరమల్లు షూటింగే ఇంకా పూర్తి కాలేదు. కనీసం సినిమా ఎప్పుడు పూర్తవుతుంది? ఎప్పుడు రిలీజవుతుందనే విషయాలను కూడా ఎవరూ చెప్పలేకపోతున్నారు. మొదట్లో వీరమల్లు మూవీ సెట్స్ పైకి వెళ్లినప్పుడు విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్న ఈ సినిమాకు ఇప్పుడు కనీస బజ్ కూడా లేదు. ఇన్నేళ్ల పాటూ సినిమా నిర్మాణంలో ఉండటంతో పాటూ పలుమార్లు రిలీజ్ వాయిదా పడటమే దానికి కారణం. ఆఖరికి పవన్ ఫ్యాన్సే ఈ సినిమా గురించి, రిలీజ్ గురించి ట్రోల్స్ చేస్తున్నారంటే వీరమల్లు పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎప్పుడు వీరమల్లు పూర్తవుతుంది? రిలీజ్ ఎప్పుడవుతుందని ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్ననేపథ్యంలో వీరమల్లు షూటింగ్ గురించి ఓ అప్డేట్ వినిపిస్తోంది. ఆదివారం నుంచే పవన్ కళ్యాణ్ వీరమల్లు సెట్స్ లో అడుగుపెడుతున్నారని తెలుస్తోంది. వీలైనంత త్వరగా ఆయన పార్ట్ షూటింగ్ ను పూర్తి చేసి తన బాధ్యతను నిర్వర్తించాలని చూస్తున్నాడట పవన్. పవన్ ఐదారు రోజుల కాల్షీట్స్ ఇస్తే మొత్తం షూటింగ్ పూర్తయ్యే నేపథ్యంలో ఇవాళ నుంచి వారం రోజుల పాటూ పవన్ తన డేట్స్ ను అడ్జస్ట్ చేసి వీరమల్లు షూటింగ్ ను పూర్తి చేయాలని చూస్తున్నాడట. ఇదే నిజమైతే పవన్ ఫ్యాన్స్ కు పండగనే చెప్పాలి.ఆల్రెడీ మేకర్స్ మే 9న వీరమల్లును రిలీజ్ చేయాలని భావించారు.

# ఎట్టకేలకు ఫరియా ఫిక్స్ చేసిందా?



జాతి రత్నాలు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఫరియా అబ్దుల్లా ఆ సినిమాతో మంచి హిట్ ను అందుకుంది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించి నటిగా మంచి పేరు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా ఆఖరిగా మత్తు వదలరా2 లో కనిపించింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయినప్పటికీ ఆ తర్వాత ఫరియా నుంచి మరో సినిమా వచ్చింది లేదు.అయితే తాజాగా ఇప్పుడు ఫరియా ఇన్‌స్టాగ్రమ్ లో చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతుంది. ఫరియా ఓ ప్రొడక్షన్ హౌస్ నుంచి వచ్చిన ఓ టీజర్ ను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. ది టైటిల్ ఈజ్ హిజ్ నేమ్, అతని ఆటకు రెడీ గా ఉండు. మ్యాడ్‌నెస్ స్టార్ట్ కానుందంటూ ఆ పోస్టర్ కింద రాసి ఉంది. మోషన్ పిక్చర్స్, బురా, సద్ది క్రియేటివ్ ఆర్ట్స్ బ్యానర్లు ఆ సినిమాను సంయుక్తంగా రూపొందిస్తున్నాయి.అమర్ బురా, జయకాంత్, వేణు సిద్ది ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా నటిస్తున్నానని డైరెక్ట్ గా చెప్పకపోయినప్పటికీ ఆ టీజర్ ను ఆమె షేర్ చేయడం వెనుక ఉద్దేశం అదే అని ఆమె ఫ్యాన్స్ అభిప్రాయపడు తున్నారు. మొత్తానికి సంవత్సరం తర్వాత ఫరియా సినిమా ఓకే చేసిందని, ఈ ప్రాజెక్టుతోనే ఫరియా మళ్లీ స్క్రీన్ పైకి రానుందని వారు భావిస్తున్నారు. ఫరియా షేర్ చేసిన ఆ టీజర్ డార్క్ కామెడీ మూవీ అని తెలుస్తోంది. ఫరియా పోస్ట్ ఆమె కంబ్యాక్ ను సూచిస్తే, తెలుగు మూవీ కొత్త పుంతలు తొక్కుతున్న ఈ టైమ్ లో ఆమె కూడా ఒక అధ్యాయంలోకి అడుగుపెట్టినట్టే అవుతుంది. మరి ఈ సినిమా అయినా ఫరియాకు మంచి హిట్ ను అందించి, తనను బిజీ ఆర్టిస్టుగా మారుస్తుందేమో చూడాలి.

# రస్సెల్, రఘువంశీ మెరుపులు.. రాజస్థాన్ టార్గెట్ ఎంతంటే..?



**న్యూఢిల్లీ-నవభూమి:** సొంతమైదానంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌బ్యాటర్లు చెలరేగిపోయారు. ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతున్న వేళ సమిష్టింగా పంజా విసిరారు. ఈడెన్ గార్డెన్స్‌లో ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్(35), కెప్టెన్ అజింక్యా రహానే(30)లు బలమైన పునాది వేశారు. అయితే మిడిల్ ఓవర్లలో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో స్కోర్ మందగించింది. అయితే.. డెత్ ఓవర్లలో ఆండ్రూ రస్సెల్(57 నాటౌట్) గేర్ మార్చి విధ్వంసం సృష్టించాడు. అంగ్‌క్రిష్ రఘువంశీ(44)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. 20వ ఓవర్లో రింకూ సింగ్(19 నాటౌట్) 4, 6, 6 బాదేయడంతో కోల్‌కతా స్కోర్ 200లు దాటింది. గత మ్యాచ్‌లో ముంబై పేస్ బౌలర్లకు దాసోహమైన రాజస్థాన్ టాపార్డర్ ఈసారి లక్ష్యాన్ని ఛేదిస్తుందా? లేదా? అనేది ఆసక్తి రేపుతోంది.ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన కోల్‌కతా నైట్ రైడర్స్ కీలక పోరులో భారీ స్కోర్ చేసింది. ఈడెన్ గార్డెన్స్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రహానే బృందానికి శుభారంభం దక్కలేదు. డేంజరస్ ఓపెనర్ సునీల్ నరైన్(11)ను యుధ్‌వీర్ సింగ్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత రహ్మానుల్లా గుర్బాజ్(35)తో కలిసి కెప్టెన్ అజింక్యా రహానే(30) ధాటిగా ఆడాడు.రాజస్థాన్ బౌలర్లను కౌంటర్ అటాక్ చేసిన ఈ జోడీ రెండో వికెట్‌కు 56 రన్స్ చేసింది. అయితే.. కీలక భాగస్వామ్యంతో కోల్‌కతా భారీ స్కోర్‌కు పునాది వేసిన ఈ జోడీని థీక్షణ విడదీశాడు. గుర్జాజ్ ఔటైన కాసేపటికే పరాగ్ ఓవర్లో వికెట్ కీపర్ చేతికి క్యాచ్ ఇచ్చాడు రహానే. దాంతో, 113 వద్ద మూడో వికెట్ పడింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన అంగ్‌క్రిష్ రఘువంశీ(44) బాధ్యతగా ఆడాడు.

# రాణించిన కేకేఆర్ బ్యాటర్లు.. రాజస్తాన్ టార్గెట్ ఎంతంటే



**న్యూఢిల్లీ-నవభూమి:** బ్యాటర్లందరూ తమ వంతు పాత్ర పోషించి పరుగులు చేయడంతో కోల్‌కతా నైట్ రైడర్స్ ప్రత్యర్థి ముందు భారీ టార్గెట్ ఉంచింది. ఈ రోజు ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్తాన్ రాయల్స్ జట్లు తలపడుతు న్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానే టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ దిగిన కేకేఆర్ బ్యాటర్లు అందరూ సమష్టిగా రాణించారు. అంద్రూ రస్సెల్ (57) హాఫ్ సెంచరీ చేశాడు. దీంతో కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది.టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ సునీల్ నరైన్ (11) రెండో ఓవర్లోనే అవుటయ్యాడు. అయితే మరో ఓపెనర్ (35), కెప్టెన్ రహానే (30) చక్కగా రాణించి రెండో వికెట్‌కు 50 పరుగులకు పైగా జోడించాడు. వీరు అవుటైన తర్వాత బరిలోకి దిగిన రస్సెల్ అర్ధశతకం సాధించగా, రఘువంశీ (44) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో రింకూ సింగ్ (19) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది.

నవక్రీడ

# ధర్మశాలలో పోరు.. ఇరు జట్లలో కీలక ఆటగాళ్లు వీరే



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐపీఎల్‌లో ఇప్పటికే 50కు పైగా మ్యాచ్‌లు పూర్తయ్యాయి. రెండు జట్లు ఇప్పటికే అధికారికంగా ఈ సీజన్ ప్లే ఆఫ్స్‌కు దూరమయ్యాయి. మరో జట్టు కూడా అదే బాటలో సాగుతోంది. ఈ నేపథ్యంలో మరో కీలక పోరుకు ధర్మశాలకు వేదిక కానుంది. పంజాబ్ కింగ్స్ జట్టుతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ టీమ్ ఈ రోజు ధర్మశాల వేదికగా పోటీ పడుతోంది ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన పంజాబ్ ఆరు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. మరోవైపు ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన లఖ్‌నవూ ఐదు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది. ఈ రెండు జట్లు ఈ రోజు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాయి. ప్లే ఆఫ్స్‌కు మరింత చేరువ కావాలని ప్రయత్నిస్తున్నాయి.పంజాబ్ జట్టు ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ మంచి ఫామ్‌లో ఉన్నారు. అలాగే ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా స్థిరంగా రాణిస్తున్నాడు. నేహల్ వధేరా, జాస్ ఇంగ్లీష్ కూడా కీలక పరుగులు చేస్తున్నారు. ఇక, బౌలింగ్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్, ఛాహల్, ఒమర్జాయ్ లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి బౌలింగ్ చేస్తున్నారు. మరోవైపు ఓపెనర్లు మిచెల్ మార్ష్, మార్‌క్రమ్‌తో పాటు నికోలస్ పూరన్‌పైనే లఖ్‌నవూ ఎక్కువగా ఆధారపడుతోంది. వారి విఫలమైతే తర్వాతి వారు కూడా చేతులెత్తేస్తున్నారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**